www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 71 | గురువారం | 31 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రానిది తక్కువే

- రద్దు నోట్లు రూ.15.25 లక్షల కోట్ల మేరకు తిరిగొచ్చాయి
- రూ.16,050 కోట్లు మాత్రమే రాలేదు
- ఇది రద్దు నోట్లలో ఒక్క శాతమే
- కొత్త నోట్ల ముద్రణా వ్యయం భారీగా పెరిగింది : ఆర్‌బిఐ

ముంబయి : గతేడాది నవంబరు 8న రద్దు చేసిన రూ.1000, రూ.500 నోట్లలో దాదాపు 99 శాతం బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి చేరాయని ఆర్‌బిఐ తెలిపింది. 2016–17కి సంబంధించిన వార్షిక నివేదికను రిజర్వు బ్యాంకు బుధవారం విడుదల చేసింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ.15.28 లక్షల కోట్ల కరెన్సీ తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరుకుందని, రూ.16,050 కోట్లు మాత్రమే తిరిగి రాలేదని తెలిపింది. నోట్ల రద్దు నాటికి (నవంబరు 8, 2016) 1716.5 కోట్ల రూ.500 నోట్లు, 685.8 కోట్ల రూ.1000 నోట్లు చెలామణిలో ఉన్నాయి. ఈ మొత్తం రూ. 15.44 లక్షల కోట్లు. మరోవైపు వెయ్యి రూపాయల నోట్లు 1.4 శాతం మాత్రమే బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి రాలేదని ఆర్‌బిఐ తెలిపింది. అంటే, చెలామణిలో ఉన్న మొత్తం 632.6 కోట్ల వెయ్యి రూపాయల నోట్లలో 8.9 కోట్లు మాత్రమే వెనక్కి రాలేదు. మార్చి 31, 2017 నాటికి 588.2 కోట్ల పాత, కొత్త ఐదు వందల రూపాయల నోట్లు చెలామణిలో ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి అవి 1570.7 కోట్లు. కరెన్సీ ముద్రణ వ్యయం కూడా భారీగా పెరిగినట్లు ఆర్‌బిఐ తెలిపింది. కొత్త నోట్ల ముద్రణ కారణంగా అంతకుముందు ఏడాది తరువాయి 6లో

రద్దు వల్ల నష్టమే
ప్రయోజనం రూ. 16 వేల కోట్లు, కొత్త నోట్ల వ్యయం రూ.21 వేల కోట్లు : చిదంబరం 9



సర్కార్ గొప్పలకు చెక్ : సురవరం 6

సైన్యంలో భారీ సంస్కరణలు

- వివిధ హోదాల్లో 57 వేలమంది నియామకం
- షెకాత్కర్ కమిటీ సిఫార్సుల అమలుకు నిర్ణయం
- డోక్లాం పరిణామాలతో సంబంధం లేదు : అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ : సుమారు 57 వేల మంది అధికారులను తిరిగి నియమించుకోవడం, ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం సహా సైన్యం పోరాట సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో భారీ సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్వాతంత్ర్యం తర్వాత భారత ఆర్మీలో ఇంత భారీ స్థాయిలో సంస్కరణలను చేపట్టి ఉండకపోవచ్చని రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. చైనాతో డోక్లామ్ సమస్య నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్న ప్రశ్నకు, దీనికి ఎలాంటి ఘటనతోనూ సంబంధం లేదు. డోక్లామ్ ప్రతిష్టంభనకు పూర్వమే ఇది మొదలైందని జైట్లీ వివరణ ఇచ్చారు. ఈ సంస్కరణలను లెఫ్టినెంట్ జనరల్ డిబి షెకాత్కర్ (విశ్రాంత) నేతృత్వంలోని కమిటీ సిఫార్సు చేసింది. ఆర్మీలో నిర్మాణాత్మక మార్పుల కోసం ఈ కమిటీ మొత్తం 99 తరువాయి 6లో



నవంబర్‌లో ఆధార్ కేసు విచారణ

- కార్డుల అనుసంధానం గడువు మూడు నెలలు పొడిగిస్తామని సుప్రీంకోర్టుకు కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ జోడింపును తప్పనిసరి చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను నవంబరులో విచారిస్తామని సుప్రీంకోర్టు బుధవారం వెల్లడించింది. పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఆధార్ అనుసంధానపు గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్రం చెప్పడంతో అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు తెలిపింది. సెప్టెంబరు 30 వరకు ఉన్న తుది గడువును కేంద్రం మరో మూడు నెలల పాటు పొడిగించనుందని అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు. అందువల్ల ఆధార్‌పై విచారణకు తొందరపడాల్సిన పనిలేదని, నవంబరు మొదటి వారంలో విచారణ చేపడుతామని ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) దీపక్ మిశ్రా అన్నారు. పలువురు పిటిషనర్ల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ ఆధార్ పిటిషన్లపై త్వరగా విచారణ జరపాలని కోర్టును అభ్యర్థించిన నేపథ్యంలో సిజెఐ ఈ మేరకు స్పష్టం చేయడం తరువాయి 6లో

ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల్లో ఒబిసి క్రీమీలేయర్
- కేంద్రమంత్రివర్గం నిర్ణయం 6లో

అంతా పారదర్శకం

- భూ రికార్డుల ప్రక్షాళన వల్ల ఏ ఒక్క రైతుకూ హాని కలగకూడదు
- ఏ చిక్కులూ లేని 95% భూ వివరాలు ముందుగా ఖరారు చేయాలి
- ప్రజలకు అర్థమయ్యే రీతిలో రికార్డుల తయారీ
- పహణీ, శేత్వారీ స్థానే తెలుగు పదాలు
- రెవెన్యూ సమీక్షలో సిఎం కెసిఆర్
- రికార్డుల ఆధునికీకరణ మిషన్ డైరెక్టర్‌గా వాకాటి కరుణ
- నేడు జిల్లా కలెక్టర్ల సమావేశం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఏ రైతుకు కూడా ఎలాంటి హాని జరగకుండా అంతా పూర్తి పారదర్శకంగా భూ రికార్డుల ప్రక్షాళన జరగాలని, లెక్కలన్నీ సవరించిన తరువాత రైతుల భూముల వివరాలకు సంబంధించిన తుది జాబితాపై గ్రామంలోని రైతులందరి సంతకాలు తీసుకొని బహిర్గతం చేయాలని, భూమి రికార్డుల సమగ్ర ప్రక్షాళన ఆసాంతం సులభంగా, సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో జరగాలనీ, ప్రక్షాళనలో భాగంగా తొలుత ఏ విధమైన చిక్కులు, సమస్యలు లేని సుమారు 95 శాతానికి సంబంధించి వివరాలు ఖరారు చేయాలని సిఎం కెసిఆర్ దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ కోర్టు మినహా మిగతా రెవెన్యూ కోర్టులన్నీ రద్దు చేయాలని ఆదేశించారు. భూమి, భూ సంబంధమైన వ్యవహారాలు రాజ్యాంగపరంగా రాష్ట్ర పరిధిలో ఉంటాయి కాబట్టి దానికి సంబంధించిన చర్యలు చేపట్టే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం. కాబట్టి దీనికి అనుగుణంగా న్యాయపరమైన చిక్కులకు ఆస్కారం లేని విధంగా రికార్డుల ప్రక్షాళన జరగాలన్నారు. భూ రికార్డుల సరళీకరణ, ప్రక్షాళనకు సంబంధించి సిఎం కెసిఆర్ రెవెన్యూ అధికారులతో బుధవారం ప్రగతిభవన్‌లో సమీక్ష జరిపారు. పహాణీ, సేత్వారీ వంటి పాతకాలపు పదాలు మన తెలుగు భాషకు సంబంధించినవి కావు. తెలుగులో సరళంగా, సులభంగా, సరళీకృతమైన భాషలో ఈ పదాలను మార్చాలి అని సిఎం అన్నారు. రికార్డులలో బై నెంబర్ల గోల్‌మాల్ లేకుండా పోవాలి అని స్పష్టంగా సిఎం చెప్పారు. ''ఒకప్పుడు ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరు భూమి శిస్తుగా ఉండేది. అయితే కాలక్రమేణా రైతుల దగ్గర శిస్తు వసూలుకు బదులు ప్రభుత్వమే ఎకరానికి రూ.8వేల చొప్పున పెట్టుబడి సమకూర్చుతున్నది. దీంతో పూర్తిగా భూమికి సంబంధించిన దృక్పథమే మారిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా రైతులను అన్ని దేశాలు గౌరవిస్తున్నాయి. ఆహార రంగంలో స్వావలంబన ఉండాలని ఏ దేశమైనా ఆలోచించడమే దీనికి ప్రధాన కారణం. మన దేశం కూడా అంతే. మన రాష్ట్రం తరువాయి 6లో

ముగ్గురు మంత్రులపై రైల్‌రోకో కేసు కొట్టివేత

- మరి 14 మందిని నిర్దోషులుగా ప్రకటించిన రైల్వే కోర్టు



మన తెలంగాణ/ సికింద్రాబాద్: రైల్వే కోర్టులో మంత్రులకు ఊరట లభించింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011లో మౌలాలి జంక్షన్ వద్ద నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమంలో ఐటి, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, అబ్కారీ, క్రీడల శాఖమంత్రి టి.పద్మారావులతో పాటు మరో14 మంది టిఆర్‌ఎస్ నాయకులపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మంత్రులు పలుమార్లు బోయిగూడలోని రైల్వే కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో బుధవారం కూడా వారు రైల్వే కోర్టుకు హాజరుకాగా న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించి వారిపై రైల్వే పోలీసులు పెట్టిన కేసులను కొట్టివేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం చారిత్రక ఘట్టమన్నారు. దశాబ్ద కాలంగా జరిగిన ఉద్యమంలో ప్రభుత్వ తరువాయి 6లో

వరంగల్ నిట్‌లో డ్రగ్స్

హాస్టల్‌లో ఇద్దరు పూర్వ విద్యార్థుల పట్టివేత, మత్తు పదార్థాలు స్వాధీనం

మన తెలంగాణ/ కాజీపేట : వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలోని ప్రతిష్ఠాత్మకమైన జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయానికి (నిట్) డ్రగ్స్ బెడద తాకింది. నిట్‌లోని 1కె హాస్టల్‌లో డ్రగ్స్ తీసుకుంటున్న ఇద్దరు పూర్వ ఇంజినీరింగ్ విద్యార్థులు బుధవారం పట్టుబడ్డారు. కాజీపేట ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరిద్దరిని వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆర్.సురేష్ రాథోడ్ మీడియా ముందు ప్రవేపెట్టారు. పూర్వ విద్యార్థులు వై.రమేష్, జి.దీరజ్ 1కె హాస్టల్‌లో డ్రగ్స్ తీసుకుంటున్నారనే సమాచారం అందడంతో తమ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని వారి గదుల్లో తనిఖీలు జరిపారని, వారి నుంచి 5 ఎల్‌ఎస్‌డి స్ట్రిప్పులు, ల్యాప్‌టాపు, 2 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలియజేశారు. హైదరాబాద్ కొత్తపేటలో డిక్కీ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో డార్క్ వెబ్‌సైట్ నుంచి ఆర్డర్ చేసి తన ఇంటికి డ్రగ్స్ తెప్పించుకొని నిట్‌లో అమ్ముతున్నాడని బయటపడినట్లు వెల్లడించారు. ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిట్‌పై నిఘా : ఈ ఘటనతో నిట్‌పై కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారం వద్ద సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్యాంపస్‌లోకి అర్ధరాత్రుల్లో వచ్చే విద్యార్థులపైన, వారు బస చేసే హాస్టళ్ల మీదా నిఘా ఉంచారు. డ్రగ్స్‌తో పట్టుబడిన విద్యార్థులతో పాటు ఈ వ్యవహారంలో మరి ఐదుగురు విద్యార్థులు ఉన్నట్లు సమాచారం.



నాలుగైదు రోజుల పాటు వర్షాలు

మన తెలంగాణ/ హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ఈశాన్య మధ్యప్రదేశ్ నుంచి సౌరాష్ట్ర వైపుకు కదులుతోంది. రుతుపవన ద్రోణి కూడా సౌరాష్ట్ర సమీపంలో అల్పపీడన ద్రోణి మీదుగా వెళుతుంది. విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ, రాయలసీమ మీదుగా ఆవర్తన ద్రోణి ఆవరించింది. ఫలితంగా వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇదిలా ఉండగా, గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా చంద్రుగొండలో 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. బూర్గంపాడు, ఖమ్మం అర్బన్, తిమ్మాజిపేటలో 4, దామరగిద్ద, భద్రాచలం, ములకలపల్లి, కొణిజెర్ల, తరువాయి 6లో

కుంచెపోటు



గ్లాసు బదులు స్పూన్‌తో నీళ్లు తాగమని కాదేమో ఆయన ఉద్దేశం!

మిద్దె తోటకు పెద్దపీట

- ఉద్యానవన ప్రదర్శనలో రూఫ్ గార్డెన్‌పైనే అందరి కళ్లు
- ఆకట్టుకుంటున్న ఒకే మొక్కకు రంగురంగుల పూలు



మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయిన హైదరాబాద్ మహానగరంలో వారానికి రెండు, మూడు సార్లు మార్కెట్‌లో అవసరమైన కూరగాయలు కొనుక్కోవడమే తప్ప అవి ఎలా పండిస్తున్నారో నేటి తరంలో చాలా మందికి తెలియదు. పిల్లలకు స్కూల్‌లో ఏ కూరగాయను ఇంగ్లీష్‌లో ఏమంటారో నేర్పిస్తారు కానీ, ఎలా పండిస్తారో తెలియదు. రంగు రంగుల పూలు ఏ వేడుకైనా బొకేలతో దర్శనమిస్తాయి అవి ఎలా సాగు చేస్తున్నారు? కొంత మంది గృహిణులకు తమ కుటుంబానికి సరిపడా కూరగాయలను ఎటువంటి రసాయన ఎరువులు తరువాయి 6లో

శిశువును బలిగొన్న వైద్యుల వైరం

- ఆపరేషన్ థియేటర్‌లోనే ఇద్దరు డాక్టర్ల జగడం
- పరస్పరం తిట్టుకొని ఒకరు బయటకు వెళ్లిపోగా పల్స్‌రేట్ పడిపోయి గర్భంలోనే శిశువు దుర్మరణం


జోధ్‌పూర్: ఇద్దరు వైద్యుల జగడం ఒక గర్భస్థ శిశువును బలి తీసుకున్నది. రాజస్థాన్ జోద్‌పూర్‌లోని ఉమయిద్ ఉమన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. శిశువు హృదయ స్పందనను తనిఖీ చేసే విషయంలో తరువాయి 6లో



కేరళ కొత్త సిఎస్ అబ్రహాం

తిరువనంతపురం: కేరళ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి డాక్టర్ కెవిల్ అబ్రహాంను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత ప్రధానకార్యదర్శి నళిని నెట్టో గురువారం పదవీ విరమణ చేయనుండటంతో ఆమె స్థానంలో ఆర్థిక శాఖలో అదనపు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న అబ్రహాంను నియమించారు.

సిఎంను తొలగించే తదుపరి చర్యను నిర్ణయిస్తాం: దినకరన్



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళని స్వామిని పదవి నుంచి తొలగించే తదుపరి చర్యపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఎఐఎడిఎంకె పార్టీ నుంచి తప్పించిన నాయకుడు టి.టి.వి. దినకరన్ బుధవారం చెప్పారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని వదిలిపెట్టబోమని అన్నారు. అధికార పార్టీ ఎంఎల్ఎలు 134 మందిలో 21 మద్దతే కలిగి ఉన్న ఆయన రెండు మూడు రోజులలో తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటా మన్నారు. ఆయనకు అనుకూలంగా ఉన్న 19 మంది ఎంఎల్ఎలు పళనిస్వామిని పదవి నుంచి తప్పించాలని గవర్నర్ సి.హెచ్. విద్యాసాగరరావుకు వినతి సమర్పించారు. పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వంలను పదవి నుంచి తప్పిస్తేనే పార్టీలోని శత్రుత్వం సమసిపోగలదని దినకరన్ విలేకరులతో అన్నారు. పన్నీర్‌సెల్వం ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశంలో కేవలం 77 శాసనసభ్యులు మాత్రమే హాజరయ్యారన్నారు. దీనికి ముందు అనేక మంది పార్టీ కార్యకర్తలు దినకరన్‌ను ఆయన అడయార్ నివాసంలో కలుసుకున్నారు.

హౌరా–సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు హౌరా సికింద్రాబాద్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్ 3, 5 తేదీల్లో నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. హౌరా సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (నెం.07183) సెప్టెంబర్ 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు హౌరా నుంచి బయలుదేరి గుంటూరు, విజయవాడ మీదుగా మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు సికాంద్రాబాద్ చేరుకుంటుంది. అదే విధంగా సికింద్రాబాద్ హౌరా ప్రత్యేక రైలు (నెం.07183) సెప్టెంబర్ 5వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 1.05 గంటలకు హౌరా నుంచి బయలుదేరి విజయవాడ, ఖాజీపేట్ మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ ఒక ప్రకటనలో వివరించారు.

స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఎంపికైన పాఠశాలలకు రూ.10 వేల గ్రాంటు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ 2016 ఎంపికైన 40 ప్రభుత్వ పాఠశాలలకు అదనంగా రూ.10 వేల గ్రాంటు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ పురస్కారాలను ఉపాధ్యాయ దినోత్సవం రోజున సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రదానం చేయనున్నారు. పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, చెట్ల పెంపకం పాటిస్తున్న పాఠశాలలకు రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు ప్రదానం చేస్తుంది.అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 6 పాఠశాలలకు ఈ పురస్కారం లభించగా, రంగారెడ్డి జిల్లాలో 4 పాఠశాలలకు, యాదాద్రి జిల్లాలో మూడు పాఠశాలలు ఈ పురస్కారాలు లభించాయి.

రైల్వే స్వచ్ఛత అవార్డుల ప్రదానం



మన తెలంగాణ / హైదరాబాద్ : 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ్ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'స్వచ్ఛత వారోత్సవాల'లో క్రియాశీల పాత్ర వహించిన 91 మంది రైల్వే ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ అవార్డులను అందజేశారు. రైల్ నిలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌సిఆర్ పరిధిలోని ఆరు డివిజన్లకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. స్వచ్ఛత వారోత్సవాలను విజయవంతం చేసి రైల్వే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసిన సిబ్బందిని జాన్ థామస్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై 124 అవగాహన ప్రచార కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సుమారు 15 వేల మంది ప్రయాణికుల సూచనలు తీసుకున్నట్లు ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే పరిసరాలు, రైళ్లలో అపరిశుభ్ర చర్యలకు పాల్పడిన 1719 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ.4 లక్షల జరిమానాను వసూలు చేసినట్లు ఆయన తెలిపారు.

పెన్షన్ టీంను టెన్షన్ స్కీంగా మార్చారు




మన తెలంగాణ/హైదరాబాద్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రాష్ట్ర ప్రభుత్వం టెన్షన్ స్కీంగా మార్చిందని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ సి. వంశీచంద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల పెన్షన్ స్కీంపై గతంలో శాసనసభలో ప్రశ్నించినపుడు ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇచ్చిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల లక్షా 20 వేల మంది ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నిరసిస్తోందని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌కు మద్దతిస్తోందని స్పష్టం చేశారు. కేంద్రం గ్యాట్యుటీ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసినా తెలంగాణ ప్రభుత్వం కావాలని ఉద్యోగులను మోసం చేస్తోందని, 2004 నుంచి ఉద్యోగంలో చేరిన వారికి షేర్ మార్కెట్ ద్వారా పెన్షన్ వస్తోందని, షేర్ మార్కెట్ ఒడిదుడుకులపై ఉద్యోగుల పెన్షన్ ఆధారపడుతోందన్నారు. దీని వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లుతోందన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాలకు ఎఐటియుసి మద్దతు

మన తెలంగాణ/హైదరాబాద్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సిపిఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఉద్యమానికి ఎఐటియుసి సంఘీభావం తెలిపింది. సిపిఎస్‌ను ఉపసంహరించుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు ఉద్యోగులుగా అందించిన సేవలకు పదవీ విరమణ పొందిన తర్వాత సామాజిక భద్రత కల్పించాలని ఉద్యోగ సంఘాలు చేసిన పోరాట ఫలితంగా 1952లో పెన్షన్ స్కీం రూపొందించగా, 1982లో సుప్రీంకోర్టు ధ్రువీకరించిందని, అయితే ప్రపంచ బ్యాంకు విధానాలైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను మలు చేసిన ప్రభుత్వాలు 1995 నుండి పెన్షన్‌ను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించాయన్నారు. 2004 జనవరి 1వ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004 సెప్టెంబర్ 1 తర్వాత చేరిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే పశ్చిమబెంగాల్, త్రిపుర, ఢిల్లీ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమల్లో ఉందని, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు సిపిఎస్ విధానాన్ని తొలగించడానికి అధ్యయనం చేస్తున్నాయన్నారు. దీని ప్రకారం ఉద్యోగుల జీతంలో 10 శాతం, ప్రభుత్వం 10 శాతంవ కలిపి పెన్షన్ నిధిలో జమచేస్తారని, ఆ నిధిలో 50 శాతం షేర్ మార్కెట్లో, ప్రభుత్వ సెక్యూరిటీలో 30 శాతం, ఇతర సంస్థల్లో 20 శాతం జమ చేస్తారన్నారు. పదవీ విరమణ సమయంలో 60 శాతం ఇస్తారని, మిగిలిన 40 శాతం బీమా సంస్థల్లో ఈక్విటీ క్రింద తీసుకుంటారని, దీనిపై వచ్చే ఆదాయాన్ని పెన్షన్‌గా భావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014 ఫిబ్రవరి 1న తీసుకొచ్చిన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) మార్కెట్ శక్తులకే లాభం కలుగుతుందని, అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు సొమ్ము వెళుతుందన్నారు. మార్కెట్ శక్తుల చేతుల్లో సొమ్ము ఉంటుండడంతో పదవీ విరమణ పొందిన తర్వాత ఎంత పెన్షన్ వస్తుందనేది తెలియని అయోమయ స్థితిని ఉద్యోగులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన పింఛన్ విద్రోహ దినంగా జరుపుతూ నిరసనలకు పిలుపునిచ్చాయన్నారు.

సత్వర ప్రజాభిప్రాయ సేకరణ

మహారాష్ట్రను కోరిన తెలంగాణ బృందం



మన తెలంగాణ/హైదరాబాద్: గోదావరి నదిపై కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టులపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించడానికి సాగునీటిశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ముంబై నగరానికి వెళ్లారు. మంత్రితో పాటు పలువురు ఇంజనీర్లు కూడా ముంబై వెళ్లిన బృందంలో ఉన్నారు. కాళేశ్వరంతో మహారాష్ట్రలో ఏర్పడే ముంపు ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ త్వరగా జరపాలని కోరినట్లు తెలిసింది. తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు, పెన్‌గంగ, చనాకా కొరాటాతో పాటు మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలోనూ ముంపు ఉంటుంది. తెలంగాణలో కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన నేపథ్యంలో మహారాష్ట్రలో కూడా పూర్తైతే అనుమతుల ప్రక్రియలో వేగం పెరుగుతుంది. దీంతో పాటు కాళేశ్వరంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అఫిడవిట్‌పై కూడా చర్చించే అవకాశం ఉంది. గోదావరి నదిపై తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాజెక్టుల నిర్మాణంపై ఇదివరకే అంతర్రాష్ట్ర బోర్డు ఏర్పాటు అయింది. ఇందులో ఐదు బ్యారేజీల నిర్మాణంపై తెలంగాణ, మహారాష్ట్రల ముఖ్యమంత్రులు ఒప్పందం చేసుకున్నారు. దీంతో పాటు లెండి సహా చాలా కాలంగా సరిహద్దుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు కీలక పదవులు

అక్టోబర్‌లో కొత్త ఎఐసిసి • రాహుల్ సారథ్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో కొనరిల్లుతోన్న కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అధిష్టానం సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. అధికార టిఆర్ఎస్‌పై రాజీలేని పోరాటం చేస్తున్న కాంగ్రెస్‌కు తెలంగాణలో మరింత పటిష్టం చేయడంతో పాటు కేంద్ర పార్టీలోనూ కొందరికి ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2019లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోన్న నేపథ్యంలో రాహుల్ గాంధీకి పార్టీ పగ్గాలను అప్పగించేందుకు దాదాపు నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న రాహుల్ తన టీంలో తెలంగాణలోని నేతలకు పెద్ద పీట వేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. కేంద్ర పార్టీలో ఎవరికి ఏ స్థానం కల్పించాలన్న అంశంపై పిసిసి చీఫ్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డితో నేతలు కొంత మంది సంప్రదించినట్లు సమాచారం. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)లో ఒకరికి, ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా ఒకరిని, ఎఐసిసి అధికార ప్రతినిధిగా మరొకరిని, కార్యదర్శులుగా ఇద్దరికి చోటు కల్పించే అవకాశాలున్నాయని ఉత్తమ్ బుధవారం తనను కలిసిన మీడియా వారితో చూచాయగా వెల్లడించారు. సిడబ్ల్యుసి సభ్యుడిగా ఎస్. జైపాల్ రెడ్డి, ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా పొన్నాల లక్ష్మయ్య, కార్యదర్శులుగా మాజీ ఎంపీలు విజయశాంతి, బలరాం నాయక్‌లు, ఎఐసిసి అధికార ప్రతినిధిగా దాసోజు శ్రవణ్‌కుమార్‌లకు చోటు దక్కనుందని తెలిసింది. జైపాల్‌రెడ్డి, పొన్నాలకు కేంద్ర పార్టీలో చోటు కల్పించడం ద్వారా రెడ్డి సామాజికవర్గంతో పాటు బిసిలకు ప్రాధాన్యత కల్పించినట్లవుతుందని పార్టీ భావిస్తోందని సమాచారం. కొంత కాలంగా పార్టీ కార్యకలాపాల పట్ల అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తోన్న విజయశాంతిని క్రియాశీలం చేయాలని భావించిన అధిష్టానం ఈ మేరకు ఆమెతో చర్చించినట్లు తెలిసింది. ఇక తెలంగాణ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పొన్నం ప్రభాకర్, ప్రచార కమిటీ ఛైర్మన్‌గా దామోదర్ రాజనర్సింహలకు బాధ్యతలను అప్పజెప్పనున్నట్లు చర్చ సాగుతోంది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్‌గా రామచంద్ర కుంతియ బాధ్యతలు తీసుకోవడంతోనే తెలంగాణలో పార్టీ విస్తరణ, పటిష్టతపై అధిష్టానం దృష్టి పెట్టిందన్న విషయం స్పష్టమైంది. ఇటీవల కుంతియా రాష్ట్రంలో పర్యటించి పలువురు నేతలతో పార్టీ పటిష్టత, రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. కుంతియా నివేదికను పరిశీలించిన అధిష్టానం కేంద్ర పార్టీలో తెలంగాణ నేతలకు ప్రాధాన్యతను పెంచడంతో పాటు రాష్ట్ర పార్టీలోనూ కొన్ని మార్పులను చేసేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. ప్రస్తుతం పిసిసి అధ్యక్షుడితో పాటు కార్యనిర్వాహక అధ్యక్షుడు కూడా ఉన్నారు. త్వరలోనే మరో కార్యనిర్వాహక అధ్యక్షుడిని నియమించనున్నారన్న సంకేతాలు రాష్ట్ర నేతలకు అందాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ ప్రచారం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని భావిస్తున్న కేంద్ర పార్టీ రాష్ట్ర స్థాయి ప్రచార కమిటీని కూడా నియమించాలని భావిస్తోంది. నవంబర్ నాటికల్లా పదవులన్నింటినీ ప్రకటించిన అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టే దిశలో పార్టీ నాయకత్వం సన్నద్ధమవుతోంది. పనిలో పనిగా పిసిసిలోనూ కొన్ని మార్పులు, చేర్పులు చేసే అవకాశాలున్నాయని నేతలు అంటున్నారు. పార్టీలో ఇప్పటికే నేతలు ఎవరికి వారుగా గ్రూపులు ఏర్పటు చేసుకోవడం, ఒకరంటే ఒకరికి గిట్టక పోవడం తదితర పరిణామాలన్నింటినీ సరి చేసే ప్రక్రియను కూడా చేపడతారని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పిఎస్‌యు అధికారులకు 3వ పిఆర్‌సి సిఫార్సులు అమలు

ఇండియన్ ఆయిల్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థల అధికారులకు మూడవ పేరివిజన్ కమిషన్(పిఆర్‌సి) సిఫార్సులు అమలు చేయాలని ఇండియన్ ఆయిల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్.వి.బద్రినాథ్ డిమాండ్ చేశారు. జస్టిస్ సతీష్‌చంద్ర నేతృత్వంలోని మూడవ పిఆర్‌సి కమిటీ రూపొందించిన సిఫార్సులను వర్తింపజేయాలని కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల అధికారులకు ప్రతి పదేళ్లకు ఒకసారి వేతనాలు పెంపు ఉంటుందని, గతంలో 2007లో పిఆర్‌సిని ఇవ్వగా, మళ్లీ 2017లో ఇస్తున్నారని అన్నారు. 2వ పిఆర్‌సి సమయంలో గ్రేడ్‌లవారీగా 30 నుంచి 42 శాతం ఫిట్‌మెంట్ పెంచగా, ఈ సారి కేవలం 15 శాతం పెంచారని అన్నారు. ఈ నిర్ణయం వల్ల తమకు ఏడాదికి 1.5 శాతం మాత్రమే ఫిట్‌మెంట్ పెరుగుతుందని చెప్పారు. దాంతోపాటు ఇంతకుముందు లేని విధంగా తమకు కేటాయించే ఇళ్లపై 50 శాతం ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలని నిబంధన విధించారని తెలిపారు. అలాగే సంస్థలకు లాభాలకు రాకపోతే తమ వేతనాలు తగ్గించాలనే విధానం తీసుకువచ్చారని పేర్కొన్నారు. లాభాలు మా చేతుల్లో ఉండవని, ప్రభుత్వ విధానాలు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో లాభాలు ప్రభావితమవుతాయని చెప్పారు. తమ డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 5న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని అన్నారు. సెప్టెంబర్ 12న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎ.ఆర్.వి.బద్రీనాథ్ వెల్లడించారు.

కెసిఆర్ పాలన తుగ్లక్‌ను తలపిస్తోంది

భూసర్వే పేరుతో గ్రామాల్లో గందరగోళానికి తెరలేపిన ప్రభుత్వం : బిజెపి నేత ఇంద్రసేన్



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పాలన రోజుకో స్లోగన్‌తో తుగ్లక్‌ను మరిపించేలా సాగుతోందని బిజెపి సీనియర్ నేత ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. తహశీల్దారే రిజిస్ట్రార్‌గా మారుతాడంటూ కెసిఆర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని రాజ్యాంగం ఒప్పుకోదన్న విషయం సిఎం కు తెలియదా అని ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనను ప్రజల చెంతకు చేర్చాలన్న ఉద్దేశ్యంతో 31 జిల్లాలు చేశామని చెప్పిన కెసిఆర్ జిల్లాలలో సరైన వ్యవస్థను ఏర్పాటు చేయడంలో వైఫల్యం చెందారన్నారు. జిల్లాలు ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇప్పటికీ కీలక శాఖలైన పంచాయత్ రాజ్, నీటి పారుదల, వ్యయసాయ, విద్య, వెటర్నరీ తదితర విభాగాలకు జిల్లా స్థాయి అధికారులను నియమించలేదని, ఆదాయం వచ్చే రిజిస్ట్రేషన్ శాఖకూ పూర్తి స్థాయి అధికారిని నియమించలేదన్నారు. వీటన్నింటినీ పక్కకు పెట్టి ఇప్పుడు భూ సర్వే అంటూ రైతులను మాయ చేసే మాటలను మొదలు పెట్టారన్నారు. భూ సర్వే చేయాలంటే భూమి రికార్డులుండాలని, 1940లో ఉన్న రికార్డుల ప్రకారం సర్వే చేస్తే సాధ్యమయ్యేది కాదన్నారు. పైగా రెవెన్యూ అధికారులకే భూ రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించడం చట్టరిత్యా చెల్లదన్నారు. విలేజ్‌ల వారిగా భూ నక్షలుండాలని, వీటిని తయారు చేశారో లేదో ప్రజలకు తెలపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. డిజిటల్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ సర్వే పేరుతో ఇటీవల కేంద్రం రూ. 255 కోట్లను కేటాయించిందని, ఈ డబ్బులను వెచ్చించి కేంద్రం చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తే భూ సర్వే సాధ్యం కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు.

స్వయం ఉపాధి పనులను వేగవంతం చేయండి

మన తెలంగాణ /హైదరాబాద్ : ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనారిటి కార్పొరేషన్‌లలో స్వయం ఉపాధి పథకాల అమలను వేగవంతం చేయాలని ప్రభుత్వ సలహాదారు (సంక్షేమం) ఏ. రామలక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. స్వయం ఉపాధి పథకాల కోసం ప్రభుత్వ ఆమోదిత కార్యాచరణ ప్రణాళికను జిల్లాల అధికారులకు తెలియజేసి లబ్దిదారుల ఎంపిక, సబ్సిడీల మంజూరు వంటి కార్యక్రమాలను త్వరితగతిన చేపట్టాలన్నారు. బుధవారం సచివాలయంలో ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్‌ల ఉన్నతాధికారులతో రామలక్ష్మణ్ సమీక్ష నిర్వహించారు. బిటెక్ చదివి ఎన్‌ఏసిలో శిక్షణ పొందిన ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖల్లో చేపడుతున్న రోడ్లు, భవన నిర్మాణంలో వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అదే కాకుండా ఆయా కార్పొరేషన్‌ల ద్వారా అమలు చేస్తున్న వివిధ కోర్సులకు నిరుద్యోగులను ఎంపిక చేసి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, భవన నిర్మాణం, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవింగ్, ప్లాస్టిక్ వర్క్ వంటి కోర్సులలో శిక్షణలను ఇవ్వవలసిందిగా అధికారులను ఆదేశించారు. భూమి కొనుగోలు పథకం కింద ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రూ. 479 కోట్లతో ఇప్పటి వరకు 11,284 ఎకరాల భూమిని కొని 4303 మందికి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అంతే కాకుండా నాల్గు కార్పొరేషన్‌ల ద్వారా 2017–18 సంవత్సర కాలంలో దాదాపు 2 వేల మంది నిరుద్యోగులకు ట్యాక్సీ కార్ల కొని ఇచ్చే పథకంను అమలు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ ఎండి లచ్చిరాం భూక్యా, డిప్యూటి సెక్రటరీ లియాఖత్, మైనారిటి కార్పొరేషన్ జిఎం ఎస్‌ఎం భారీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఎండి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జివో 39తో రైతుల జీవితాలతో చెలగాటం



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడే ప్రక్రియకు జివో 39 ద్వారా తెర తీసిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంత్రులే రైతు సమితుల సభ్యులను నామినేట్ చేస్తే ఇందులో టిఆర్ఎస్ కార్యకర్తలే ఉంటారని చెప్పడంలో ఎలా సందేహం లేదన్నారు. దీనిపై లీగల్‌గా వెళ్లనున్నట్లు చెప్పారు. ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా రైతులకు వచ్చిన ఆస్తి హక్కును టిఆర్ఎస్ కార్యకర్తలు నిర్ణయించబోతున్నారన్నారు. రికార్డ్స్ ఆఫ్ రైట్స్ చట్టం, కేంద్ర, రాష్ట్ర భూ చట్టాలు ఉన్నాయని, వీటన్నింటినీ ఒక్క జిఓతోనే కాలరాయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చిన్న, సన్నకారు రైతులు సమితులలోని సభ్యుల ఇండ్ల చుట్టూ తిరిగే పరిస్థితులు రాబోతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూభారతి పేరుతో నిజామాబాద్ జిల్లాలో రూ. కోట్లు ఖర్చు చేసినా ఫలితం తెలియడం లేదన్నారు. ఇప్పుడు ఆ భూభారతి కార్యక్రమాన్ని టిఆర్ఎస్ భారతిగా చేయబోతున్నారన్నారు. దొడ్డి దారిన టిఆర్ఎస్ కార్యకర్తలను న్యాయ వ్యవస్థలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని, రెవిన్యూ సిబ్బంది, నిపుణులు, న్యాయ నిపుణలు దీనిపై స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్ కూడా ఉన్నారు.

జిఒ నెం. 39 కాపీల దగ్ధం : రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెం. 39కు వ్యతిరేకంగా టిడిపి నేతలు ట్యాంక్‌బండ్ దగ్గర ఉన్న అంబేద్కర విగ్రహం వద్ద నిరసనను వ్యక్తం చేశారు. జిఒ కాపీలను దగ్ధం చేశారు. రైతు హక్కులను, మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా, రాజకీయ పక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా సమితులు ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఎం. అమరనాథ్‌బాబు, సామా రంగారెడ్డి, సుభాష్ యాదవ్, కూన వెంకటేష్ గౌడ్, బిఎన్ రెడ్డి, బొట్ల శ్రీనివాస్ ఉన్నారు.

రికార్డులను సరిచేస్తామంటే విమర్శలెందుకు?

మన తెలంగాణ/హైదరాబాద్: భూరికార్డులను సరిచేస్తామంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావడం లేదని, ఇలాగే చేస్తే వచ్చే ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని సాగునీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, తర్వాత మళ్లీ సర్వే జరగకపోవడంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. అస్తవ్యస్థంగా ఉన్న రికార్డుల కారణంగానే గ్రామాల్లో వివాదాలు, ఘర్షణ, అవినీతి, అక్రమాలకు కారణమవుతున్నాయని, భూవివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రికార్డులను సరిచేస్తుందని మంత్రి వివరించారు. గ్రామసభలు పెట్టి, రైతుల భాగస్వామ్యంతోనే, భూమి హక్కులపై స్పష్టత నిస్తామంటే, కాంగ్రెస్ నాయకులకు అభ్యంతరమెందుకని హరీశ్‌రావు ప్రశ్నించారు. రికార్డులు సరిచేస్తే తమ భూకబ్జాలకు, అవినీతికి అవకాశాలు మూసుకుపోతాయని కాంగ్రెస్ నేతలు బాధపడుతున్నారా, వారి భూదందాలు బయటకు వస్తాయని జంకుతున్నారా, బినామీ భూములు కోల్పోతామని వణుకుతున్నారా అని మండిపడ్డారు. కోర్టుకెళ్లి మరీ భూరికార్డుల ప్రక్షాళనను అడ్డుకుంటామని కాంగ్రెస్ నేతలు చెప్పడం వారి నైరాశ్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి పనిని కాంగ్రెస్ పార్టీ కోర్టులకు వెళ్లి అడ్డుకుంటుందన్న తమ ఆరోపణలు అక్షర సత్యాలని రుజువైందన్నారు. ఆదర్శ రైతుల పేరుతో కార్యకర్తలకు జీతాలిచ్చే ఏర్పాటు కాంగ్రెస్ చేసిందని, దీనికి విరుద్ధంగా రైతు సంఘాలను, రైతు సమన్వయ సమితిలను తాము ఏర్పాటు చేస్తుంటే, కండ్ల మంట ఎందుకని ప్రశ్నించారు. రైతులకు నిరంతర కరెంటు, రుణమాఫీ, ఎకరానికి 8 వేల పెట్టుబడి, ఇస్తామంటే వంకలెందుకు పెడుతున్నారని మండిపడ్డారు. పద్ధతి మార్చుకోవాలని, మా ప్రభుత్వ ఏకాగ్రతను భగ్నం చేయలేరన్నారు. కాంగ్రెస్‌లో నిరాశ, నిస్పృహలు తారాస్థాయికి చేరడంతో మరింత దిగజారి టిఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని అబద్ధపు ప్రచారానికి దిగారని విమర్శించారు. మునిగిపోతున్న కాంగ్రెస్ నావను ఎక్కడానికి ఎవరొస్తారని, రిటైర్మెంట్లే తప్ప రిక్రూట్‌మెంట్లు లేని పార్టీ అని, రిజైన్లే తప్పించి, జాయినింగ్‌లు ఉండవని వ్యంగ్యోక్తులు విసిరారు. మీ మైండ్‌గేములు చాలించి, పార్టీలో ఎవరుంటారో వెనక్కి చూసుకోవాలని మంత్రి హరీశ్‌రావు హితవుపలికారు.

40 మంది బేస్‌క్యాంపు సిబ్బంది తొలగింపుపై ఆందోళన



మనతెలంగాణ/భూపాలపల్లి ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పారెస్ట్‌లో 200 మంది బేస్ క్యాంపు సిబ్బంది అవుట్ సోర్సింగ్‌తో విధులు కొనసాగిస్తున్నారు. కాగా ఇందులో పనిచేస్తున్న సుమారు30 నుండి 40 మంది అవుట్‌సోర్సింగ్ బేస్‌క్యాంప్ సిబ్బందిని తమ విధుల్లో పనితీరును గుర్తించిన జిల్లా పారెస్ట్ అధికారి రవికిరణ్ తొలగించినట్లు సమాచారం. దీంతో సామాచారం తెలు సుకున్న బేస్ క్యాంపు సిబ్బంది కార్యాలయం ముందు ఆందోళనకు దిగి భైటాయించారు. అకారణంగా మమ్ముల్ని తొలగించారంటూ వెంటనే విధుల్లోకి తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు ఉపక్రమించారు. బేస్ క్యాంపు సిబ్బందిని తొలగించడంతో ఆందోళన చెందిన బేస్‌క్యాంపు ఉద్యోగి అన్వర్ పాషా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యానికి ప్రయత్నించగా అక్కడున్న తోటి సిబ్బంది అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు పారెస్ట్ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగిన సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ అదికారి సంప్రదింపులు జరిపిన అనంతరం న్యాయ పరంగా సహాయ సహకారాలు అందేలా చూస్తామని ఆందోళన విరమించుకోవాలని సిఐ వేణు నచ్చజెప్పి విరమింపజేశారు. పారెస్టలో పనిచేస్తున్న 40 మంది బేస్ క్యాంపు సిబ్బందిని తొలగించినట్లుగా పూర్తి వివరాలు తెలియరాలేదు.

ఒకే నెలలో 290 మంది చిన్నారుల మృతి



గోరఖ్‌పూర్ (యుపి) : ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఉన్న బాబా రాఘవ్‌దాస్ (బిఆర్‌డి) వైద్య కళాశాలలో ఆగస్టు నెలలో మొత్తం 290 మంది చిన్నారులు మరణించారని ప్రిన్సిపాల్ పికె సింగ్ బుధవారం వెల్లడించారు. వారిలో 231 మంది నవజాత శిశువులు ఐసియులోనూ, 77 మంది మెదడువాపు వ్యాధి వార్డులోనూ మరణించారు. ఈ ఏడాది జనవరి నుండి బిఆర్‌డి ఆస్పత్రిలో ప్రత్యేకించి మెదడువాపు వ్యాధి, శిశు, పిల్లల వార్డుల్లో 1,250 మంది మరణించారని ఆయన చెప్పారు. ఈ నెల 27, 28 తేదీల్లో 37 మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. వారిలో 26 మంది నవజాత శిశువులు ఐసియులోనూ, 11 మంది మెదడువాపు వ్యాధి వార్డులోనూ అసువులు బాసారు. జనవరిలో మొత్తం 152 మంది (నవజాత శిశువులు ఐసియులో 143 మంది, మెదడువాపు వ్యాధి వార్డులో 9 మంది), ఫిబ్రవరిలో 122 మంది, మార్చిలో 159 మంది, ఏప్రిల్‌లో 123 మంది, మేలో 139 మంది, జూన్‌లో 137 మంది, జులైలో 128 మంది మరణించారని సింగ్ చెప్పారు. అయితే ముందస్తు ప్రసవాలకోసం, తక్కువ బరువుతోనూ, కామెర్లు, రక్తహీనతతోనూ, అంటురోగాలు, మెదడువాపు వ్యాధితోనూ ఇక్కడ ఆస్పత్రిలో పిల్లలు చేరారని ఆయన చెప్పారు. ఇలాంటి విషమ పరిస్థితుల్లోనే ఎక్కువ మంది పిల్లలు చేరారని ఆయన అన్నారు.

జెన్‌కో ఔట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా వేతనాలు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెన్‌కోలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నేరుగా వేతనాలు ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా 2911 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నాలుగు విభాగాలుగా విభజించి, వేతనాలు ఇవ్వాలని సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు బుధవారం నాడు ఆదేశించారు. ఉద్యోగులకు రూ.14 వేల నుంచి 23 వేల వరకు వేతనం అందనుంది.

మంత్రి సమక్షంలోనే ఉద్యమకారుడి ఆత్మహత్యా యత్నం



మన తెలంగాణ/తాండూరు టౌన్: తెలంగాణ ఉద్యమకారులకు పదవులు దక్కడం లేదని నిరసన గళమెత్తిన ఉద్యమకారుడు, టిఆర్‌ఎస్ పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు అయుబ్‌ఖాన్ మంత్రి సమక్షంలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన బుధవారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో సంచలనం రేపింది. బుధవారం తాండూరు పట్టణంలోని సమ్మద్ ఫంక్షన్ హాల్లో పట్టణ టిఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. తొలుత పార్టీ కార్యకర్తలతో మాట్లాడించారు. సమావేశంలో మాట్లాడిన అయుబ్‌ఖాన్ మంత్రి సమక్షంలోనే ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మంత్రి తన వర్గానికే పదవులు కేటాయిస్తున్నారని, తాము కేవలం కార్యకర్తలుగానే మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలోకి సైతం సమాచారం ఇవ్వడం లేదని ఆవేశ పూర్వకంగా మాట్లాడిన అయుబ్‌ఖాన్ సమావేశం నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి ఆయన ఏకంగా పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని కార్యకర్తల సమావేశ హాల్లోకి పరుగులు తీసుకుంటూ వచ్చాడు. వెంటనే అలర్ట్ అయిన మంత్రి మహేందర్‌రెడ్డి సైతం ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేయించారు. జిల్లా ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు 40శాతం ఎద భాగం కాలిపోయిందని తెలిపారు. వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. మంత్రి జిల్లా ఆసుపత్రి నుంచి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన అయుబ్‌ఖాన్ మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

ఇంటర్ ప్రైవేట్ విద్యార్థులు 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రైవేట్‌గా ఇంటర్మీడియేట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా హాజరు మినహాయింపుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు రూ.500 ఫీజు చెల్లించాలని అన్నారు. రూ.200 అపరాధ రుసుంతో అక్టోబర్ 31 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

డిఇఇసెట్ రెండవ విడత సవరించిన షెడ్యూల్ విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : డిఇఇసెట్ రెండవ విడత సవరించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. అభ్యర్థులు ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీలలో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని డిఇఇసెట్ కో కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 4న సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. వచ్చే నెల 4,5 తేదీలలో ఫీజు చెల్లించాలని, సెప్టెంబర్ 7 వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

12 నుంచి కావేరి పుష్కరాలు

మన తెలంగాణ/హైదరాబాద్: కావేరి నది పుష్కరాలు సెప్టెంబరు 12 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం ఏర్పాట్లు చేస్తుందని ఒక ప్రకటనలో గారపాటి రామకృష్ణ పేర్కొన్నారు. కర్ణాటక, మాండ్య జిల్లాలోని శ్రీరంగపట్టణం, మైసూరు జయలక్ష్మి కళ్యాణమండపంలో కర్ణాటక కమ్మ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు, ఉచిత అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామి, పండిత్ రవిశంకర్, చిన్న జీయర్‌స్వామి, ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని కావేరి ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రభాకరస్వామి తెలిపారు.

భూ రికార్డులపై నేడు దిశానిర్దేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమన్వయ సమితులు, భూ రికార్డుల ప్రక్షాళనపై సిఎం కె. చంద్రశేఖర్‌రావు గురువారం వ్యవసాయాధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో గురువారం జరిగే వర్క్‌షాప్ కార్యక్రమంలో ఒక్క ఎఇఒలు తప్ప మండల వ్యవసాయాధికారులు (ఎఒ)లు, జిల్లా వ్యవసాయాధికారులు (డిఎఒ), అసిస్టెంట్ వ్యవసాయాధికారులు(ఎడిఎ), అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్లు (డిడిఎ)లు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ పెట్టుబడి పథకం ప్రాధాన్యతను చెబుతూ రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, వ్యవసాయాధికారుల పాత్రను వివరించనున్నారు.

ఎంవిఆర్‌కు కీర్తి పురస్కారం

మన తెలంగాణ/హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు ఎం.వెంకటేశ్వరరావు(ఎంవిఆర్) 2016 సంవత్సరానికి కీర్తి పురస్కారం అందుకున్నారు. బుధవారం తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కె.స్వామి గౌడ్, ఎంవిఆర్‌కు కీర్తి పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిఎస్‌సి సభ్యులు మంగారి రాజేందర్, తెలుగు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్.వి.సత్యనారాయణ, రిజిస్ట్రార్ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కీర్తి పురస్కారాలను అందజేస్తుంది.



పంటను చంపేస్తున్న చీడ–పీడ



మన తెలంగాణ/హైదరాబాద్: వానాకాలం పంటలను చీడ, పీడలు బెంబేలెత్తిస్తున్నాయి. అధికంగా సాగైన పత్తితో పాటు వరి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. దీంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాత ఏ చీడకు ఏ మందు వాడాలో తెలియక సతమతమవుతున్నాడు. వారం రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా 2.40 లక్షల ఎకరాలలో వివిధ పంటలు తెగుళ్ల భారీ పడినట్లు వ్యవసాయ శాఖ తేల్చింది. అయితే పంటలకు పట్టే చీడ, పీడలపై వ్యవసాయాధికారులు రైతులకు సలహాలు, సూచనలను మాత్రం ఇవ్వడం లేదు. దీంతో ఏమీ అర్థం కాని స్థితిలో రైతులు పురుగు మందుల దుకాణదారులను ఆశ్రయిస్తే వారు తమ లాభాపేక్ష కోసం ఏదీ సూచిస్తే దానిని రైతులు ఇష్టారీతిన పంటలకు వాడుతున్నారు. ఇలా రసాయన ఎరువుల వాడకం కూడా పెరిగిపోతుంది. ప్రస్తుతం పత్తి పంట కాయ దశలో ఉంది. దాదాపు లక్ష ఎకరాల్లో పత్తికి తెగుళ్లు పట్టి పంటను నాశనం చేస్తున్నాయి. దీనిని గులాబీ రంగు పురుగు, రసం పీల్చే పురుగులు, ఎండు తెగులు, దీర్ఘకాలం కాలం బెట్ట తరువాత అధిక వర్షం కురవడంతో ఆకస్మాత్తుగా మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, వికారాబాద్, గద్వాల, నల్లగొండ, సిరిసిల్ల, నాగర్‌కర్నూల, ఆదిలాబాద్ జిల్లాలలో అధికంగా నష్టం వాటిల్లుతోంది. మొక్కజొన్నకు తొలుచు పురుగు పట్టింది. కామారెడ్డి, గద్వాల జిల్లాలో 53 వేల ఎకరాల్లో పంట ఎఫెక్ట్ అయింది. అలాగే ప్రస్తుతం సోయాబీన్ పంట పూత దశలో ఉంది. దీనికి బూజు తెగులు ఆశిస్తోంది. కాండం కూడా తొలుస్తోంది. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 50 వేల ఎకరాల్లో పంటకు తెగుళ్లు పట్టింది. వరిలో తాటాకు తెగులు, ఆకు నల్లి పురుగు పట్టి 51548 ఎకరాలలో ప్రభావం చూపుతోంది.

పట్టించుకోని వ్యవసాయాధికారులు

రాష్ట్రంలోని పంటలకు ఎంత విస్తీర్ణంలో తెగుళ్లు పట్టాయనే అంచనా వేస్తున్న వ్యవసాయ శాఖ వాటిపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది. అధికారులు అందుబాటులో లేకపోవడం, రైతు సర్వేతో సరిపోయిందని సమాధానాలు చెప్పడం, కొత్తగా వచ్చిన ఎఇఒలకు అన్నదాతలకు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వాలో కూడా తెలియడం లేదు. గతంలో ఎరువులకు, పురుగు మందులకు వ్యవసాయాధికారి చిట్టీ రాసిస్తేనే మందుల వ్యాపారులు విక్రయించేలా చూస్తామని చెప్పినప్పటికీ అది ఇప్పటికీ అమలునకు నోచుకోవడం లేదు.

ఈ నెలలోనూ లోటు వర్షమే

రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులు కురిసిన వానలు రైతులు వరి నాట్లు వేసేందుకు సహకరించాయి. వారం వ్యవధిలోనే 1.16 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడినట్లు రాష్ట్ర వ్యవసాయ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో పేర్కొంది. ఇప్పటి వరకు 16.48 లక్షల ఎకరాల్లో వరిని సాగు నమోదైంది. ప్రాజెక్టులు, చెరువులలోకి నీరు వచ్చి చేరితే మరింత సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈసారి సాగు అంచనా 1.06 కోట్ల ఎకరాలకు గాను ఇప్పటి వరకు 92.39 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో పత్తి పంటనే 45.98 లక్షల ఎకరాల్లో వేసారు. నూనె గింజల సాగు కాస్త తగ్గింది. కేవలం 5 లక్షల ఎకరాలలో మాత్రమే సాగైనట్లు నివేదికలో పేర్కొన్నారు. గత ఏడాది ఇదే సమయానికి 8.89 లక్షల ఎకరాలలో సాగు కావడం గమనార్హం. ఆహార పంటల సాగు కూడా అలాగే ఉంది. అంచనాలు 48.13 లక్షల ఎకరాలు ఉండగా, 37.83 లక్షల ఎకరాలో మాత్రమే నమోదైంది. మిర్చి సాగు కూడా గణనీయంగా పడిపోయింది. కేవలం 37 వేల ఎకరాలలో మాత్రమే మిర్చి పంట సాగవుతోంది. సోయాబీన్ కూడా 71 శాతమే 4 లక్షల ఎకరాలలో రైతులు వేసారు. మొత్తంగా చూస్తే ఈ వానకాలం పంటల విస్తీర్ణం అంచనాలకు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇంకా లోటులోనే 8 జిల్లాలు : రాష్ట్రవ్యాప్తంగా వానలు విస్తారంగా కురిసినప్పటికీ, ఇంకా 8 జిల్లాలలో లోటు వర్షపాతమే ఉంది. ఇందులో కొమురం భీం, మంచిర్యాల్, మేడ్చల్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, పెద్దపల్లి, రాజన్న, మెదక్ జిల్లాలు ఉన్నాయి. ఈ నెలలో 162.8 మి.మీల వర్షం కురవాల్సి ఉండగా, 128.9 మి.మీలు నమోదైంది. అంటే మొత్తంగా ఈ నెలలో లోటు వర్షపాతమే నమోదైనట్లు లెక్క.

ఎగ్జిబిషన్ సొసైటీ భూమి లీజుపై తప్పుడు ప్రచారం : ఈటల

మన తెలంగాణ/హైదరాబాద్: ఎగ్జిబిషన్ సొసైటీకి భూమి లీజు రద్దు చేశారంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి వాటిని నమ్మవద్దని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు ఈటల రాజేందర్ కోరారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖలు, ఎగ్జిబిషన్ సొసైటీకి భూమిని లీజుకు కేటాయించే పనిలో ఉన్నాయని ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత మొదటి సంవత్సరం నుమాయిష్‌ను ప్రారంభించిన సిఎం, మీరు అడుక్కునేలాగా ఉండవద్దని, ఈ భూమిని మీకే 99 సంవత్సరాలు లీజుకు ఇస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. సిఎం ప్రజల కోసం పనిచేసే సంస్థలను పెంచే ప్రయత్నం చేస్తారు కానీ తుంచే ప్రయత్నం చేయరని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నారని, రాష్ట్ర ప్రజల ఆదరణ చూరగొన్న సంస్థలు, వ్యక్తులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే నుమాయిష్‌కు సిఎం మద్దతు తెలిపారని అన్నారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ 76 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతి ఏడాది నాంపల్లిలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని తెలిపారు. అంతేకాకుండా ఎగ్జిబిషన్ సొసైటీ 18 విద్యాసంస్థలను నిర్వహిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు విద్యనందించడానికి, ప్రత్యేకంగా మహిళలకు విద్య అందించడానికి ఈ సొసైటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీ భూముల లీజుపై త్వరలో ఉత్తర్వులు జారీ

మన తెలంగాణ/హైదరాబాద్: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ భూముల లీజుపై రెవెన్యూ శాఖ ఒకటి రెండు రోజులలో ఉత్తర్వులు జారీ చేయనున్నది. భూముల లీజు పొడిగింపులో రెండు నిబంధనలు చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎగ్జిబిషన్ సొసైటీ పాలక మండలిలో పరిశ్రమలు, ఆర్ అండ్ బి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులను ప్రభుత్వం తరపున నామినేట్ చేయనున్నారు. అదే విధంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఇకనుంచి నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు ఎలాంటి రుసుంలు వసూలు చేయకూడదు. ఈ రెండు నిబంధనలు లీజ్ అగ్రిమెంట్‌లో చేర్చనున్నారు. సిఎం కెసిఆర్ ఆదేశం ప్రకారం ఎగ్జిబిషన్ సొసైటీకి 99 సంవత్సరాల లీజుతో రెవెన్యూ శాఖ భూమి కేటాయించనున్నది.

గతంలో ఉద్యోగులకు అన్యాయం



మన తెలంగాణ/హైదరాబాద్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టాయి. పలు జిల్లాల్లో కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు చేసి బహిరంగ సభలు నిర్వహించారు. నగరంలో ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల్లో టిజివో ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. నగరంలో జరిగిన ఒక ప్రధాన నిరసన కార్యక్రమంలో, ఉద్యోగుల ప్రాథమిక హక్కు పెన్షన్‌ను గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసేసి ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని టిజివోస్ ఛైర్మన్, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ జెఎసి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని గృహకల్పలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, సిపిఎస్ విధానం కారణంగా ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన వెయ్యి మందిలో ఒక్కరికి పెన్షన రాలేదన్నారు. పెన్షన్ రాలేదని చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులందరూ కలిసి ఢిల్లీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. టిజివోస్ అధ్యక్షురాలు, ఉద్యోగ జెఎసి సెక్రెటరీ జనరల్ వి.మమత మాట్లాడుతూ, సిపిఎస్‌తో ఉద్యోగులకు సామాజిక భద్రత లేకుండా పోయిందన్నారు. తర్వాత శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో టిజివో హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు గృహకల్ప నుండి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు.

భూ సమగ్ర సర్వే పక్కదారి

ప్రభుత్వ వైఖరే కారణం : సిపిఐ

మన తెలంగాణ/ హైదరాబాద్: భూ సమగ్ర సర్వేను ప్రభుత్వ వైఖరి ప్రక్కదోవ పట్టిస్తున్నదని, ఘర్షణలకు దారితీసే విధంగా ఉందని సిపిఐ విమర్శించింది. భూ రికార్డులను సరిచేసేందుకు నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారయంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, అఖిలపక్షంతో సమాలోచనలు జరపాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ నెల 29,30 తేదీల్లో మఖ్దూంభవన్‌లో ఇ.టి. నరసింహ అధ్యక్షతన జరిగిన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలలో ఆమోదించిన పలు తీర్మానాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం కెసిఆర్ ప్రకటించిన కార్యాచరణను చూస్తే ఈ ప్రక్రియను క్రిందిస్థాయి టిఆర్‌ఎస్ కార్యకర్తలకు అప్పగిస్తున్నట్లు కనబడుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే భూ తగాదాలు, ఇతర అంశాల కారణంగా రాజకీయ వ్యవస్థ గ్రామస్థాయిలో విషతుల్యమౌతున్నదని, ఇప్పుడేమో రాష్ట్ర మంత్రులను ఇంచార్జీలు పెట్టి, శాసనసభ్యులతో రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేస్తామనడం పూర్తిగా రాజకీయమయం చేయడమేనని విమర్శించారు. సర్వే నంబరు వారీగా సర్వే చేయకుండా భూ రికార్డులు సరిచేయడం అసాధ్యం కాదని, ఇప్పటికైనా భూ అంశంపై లోతైన విశ్లేషణతో పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆయన కోరారు. నూతన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం లోపభూయిష్టమైందని, ఉద్యోగులకు ఆర్థిక భద్రతలేని ఈ విధానాన్ని రద్దు చేసి 2004కు ముందున్న పెన్షన్ విధానాన్ని అమలు పర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎఫ్ రద్దు కోసం ఉద్యమిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాలకు సిపిఐ పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ పొందిన తర్వాత పింఛన్ పొందడం ఉద్యోగి హక్కు అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో స్కూలు విద్యార్థుల మార్కులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఫార్మామెటిస్ అసెస్మెంట్(ఎఫ్ఎ), సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఎ) పరీక్షల గ్రేడ్‌లను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో పుస్తక రూపంలో రూపొందించిన విద్యార్థి సంచిత సమగ్ర ప్రగతి నివేదిక (స్టూడెంట్ క్యుములేటివ్ రికార్డ్)లో వివరాలు పొందుపరుస్తారు.

ఈ వివరాలను పూర్తి గా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు చర్యలు చేపడతున్నా రు. ఆన్‌లైన్‌లో విద్యార్థి పేరు లేదా వారి ఆధార్ సంఖ్యను ఎంట్రీ చేస్తే వారికి సంబంధించిన పూర్తి వివరాలు లభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం ఇప్పటివరకు ఎఫ్ఎ1 పరీక్షలు పూర్తి కాగా, అక్టోబర్ 2328 వరకు ఎస్ఎ1 పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే నెలలో మార్కులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసే ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నివేదికలో సమగ్ర వివరాలు: విద్యార్థి సంచిత సమగ్ర ప్రగతి నివేదికను గత విద్యాసంవత్సరం అందుబాటులోకి తీసుకువచ్చారు. గత ఏడాది ఈ నివేదిక అన్ని పాఠశాలలకు అందలేదు. ఈ ఏడాది మాత్రం పాఠశాలలు ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా ముందుగానే పంపిణీ చేశారు. ఈ నివేదికలో విద్యార్థి ఆధార్ సంఖ్య, బ్లడ్ గ్రూపు, తరగతుల వారీగా సబ్జెక్టుల వారీగా విద్యార్థులు సాధించిన మార్కులతో పాటు ఆరోగ్య వివరాలు పొందుపరుస్తారు. విద్యార్థి వయసు, ఎత్తు, బరువు, దృష్టిలోపం, మాట్లాడటంలో లోపం, వినికిడిలోపం, మానసిక వైకల్యం, మూర్ఛ తదితర సమస్యలు ఉన్నది/ లేనిది నిర్ధారంచడంతో పాటు రక్తహీనత, కాళ్లలో వాపు, చర్మం, ముక్కు, గొంతు, చెవి సమస్యలు దంత సమస్యలు తదితర వివరాలు ఆ నివేదికలో పొందుపరుస్తారు.

మార్క్సిజానికి నేటికీ కాలానుగుణ్యత

'పెట్టుబడి గ్రంథం' 150వ వార్షికోత్సవ సభలో సురవరం




మన తెలంగాణ/ హైదరాబాద్: సమకాలీన ప్రపంచంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నప్పటికీ మార్క్సిజానికి నేటికీ కాలానుగుణ్యత ఉండడమే కాకుండా దాని ఆవశ్యకత మరింత పెరిగిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత సమస్యలు, ఇబ్బందులు, బాధల నుండి మానవాళి విముక్తికి పెట్టబడి గ్రంథం దిక్సూచి కాగలదని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మఖ్దూంభవన్‌లో బుధవారం జరిగిన కారల్‌మార్క్స్ 'పెట్టుబడి గ్రంథం' 150వ వార్షికోత్సవ సభలో సుధాకర్‌రెడ్డి ప్రసంగించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా కమ్యూనిస్టు సిద్ధాంతం వ్యాపించిందని, కార్మికవర్గం అనేక రూపాల్లో పోరాటం చేయడానికి ఒక స్పష్టమైన మార్గాన్ని మార్క్సిజం చూపిందని ఆయన అన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థపై పోరాటాలు చేసేందుకు కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందన్న విషయాన్ని వెల్లడించిందన్నారు. మార్క్స్ విభిన్న కోణాల్లో సమాజాన్ని పరిశీలన చేసి దానిలో మార్పు తీసుకవచ్చేందుకు పెట్టుబడి గ్రంథం కీలకపాత్ర వహించదని, మార్క్సిజానికి ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఓటమి పాలైనంత మాత్రాన మార్క్సిజంకు కాలం చెల్లిందని, కమ్యూనిస్టులు ఉనికి కోల్పోతున్నారని దుష్ప్రచారం జోరుగా సాగుతుందని అన్నారు. దేశంలో బోగస్ జాతీయవాదాన్ని ప్రధాని మోడీ తీసుకవచ్చారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రసంగిస్తూ దోపిడి లేని సమాజం రావాలంటే విప్లవం తప్పనిసరి అని మార్క్స్ విశ్వసించారన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయని, బూర్జువా, మతోన్మాద పార్టీలు అధికారాన్ని చేపట్టి అనేక విధ్వంసాలకు పాల్పడుతున్నాయన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషా పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో స్కూల్ ఫీజులు వివరాలు

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రైవేట్ యాజమాన్యాలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో మూడు సంవత్సరాల ఫీజుల వివరాలు సమర్పించేలా సంబంధిత జిల్లా డిఇఒలు యాజమాన్యాలు మార్గదర్శనం చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ ఆదేశాలు జారీ చేశారు. 2015–16,2016–17తో పాటు ప్రస్తుత విద్యాసంవత్సరంలో అమలు చేస్తున్న ఫీజుల వివరాలు, ఆయా పాఠశాలల ఆదాయ, వ్యయాలను సమర్పించాలని పేర్కొన్నారు. యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో ఫీజులు వివరాలు పొందుపరిచేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి www.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. యాజమాన్యాలు ఆయా పాఠశాలల యూడైస్ కోడ్‌ను యూజర్ ఐడిగా, guestను పాస్‌వర్డ్‌గా ఉపయోగించుకుని లాగిన్ కావాలని పేర్కొన్నారు. లాగిన్ అయిన వెంటనే యాజమాన్యాలు పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలని సూచించారు.

"మూఢనమ్మకాలకు, కర్కశత్వానికి భయమే మూలం. అధిగమించటం జ్ఞాన సముపార్జనకు మొదటిమెట్టు.
– జాన్ రస్కిన్"



సంపాదకీయం

ఒబిసి ఉపవర్గీకరణ

ఇతర వెనుకబడిన తరగతుల(ఒబిసి)ఉపవర్గీకరణ చేపట్టే నిమిత్తం ఒక కమిషన్‌ను నియమించాలని కేంద్రమంత్రివర్గం ఇటీవల తీసుకున్న నిర్ణయం కులాల పాములబుట్టను మళ్లీ కుదుపుతుంది. ఒబిసిలు 50 శాతం పైగా ఉన్నప్పటికీ, మొత్తం రిజర్వేషన్‌లు 50శాతం మించరాదన్న సుప్రీం కోర్టు ఆదేశానికి లోబడి మండల్ కమిషన్, వారికి విద్యాసంస్థల అడ్మిషన్‌లు, ప్రభుత్వోద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్‌ను సిఫారసు చేసింది. ఒబిసి నిర్ధారణకు విద్య, సామాజిక వెనుకబాటుతనం ప్రమాణం. ఈ కులాల్లో ఆర్థిక సంపత్తిగలవారు రిజర్వేషన్ ఫలాలను తన్నుకుపోకుండా నిరోధించేందుకు వరుస ప్రభుత్వాలు 'క్రీమీలేయర్'ను మినహాయిస్తూ వచ్చాయి. తాజా నిర్ణయం ప్రకారం క్రీమీలేయర్ గరిష్ట పరిమితి కుటుంబ సంవత్సరాదాయం రూ.8లక్షలు. వి.పి.సింగ్ ప్రభుత్వం 1990లో మండల్ కమిషన్ నివేదికను అమలులోకి తేవటంతో బిజెపి ఆయన ప్రభుత్వాన్ని కూల్చటం, మండల్ అమలుకు వ్యతిరేకంగా ఉత్తరాదిన అగ్రవర్ణాలు పెద్ద ఎత్తున సాగించిన ఆందోళనకు మద్దతు పలకటం, అటుతర్వాత మండల్‌కు వ్యతిరేకంగా 'కమండల్'(రామ జన్మభూమి వివాదం)ను ముందుకు తేవటం గతించిన చరిత్రలో భాగం. మండల్ నివేదిక అమలు ప్రభావం కేవలం విద్య, ఉద్యోగాలకే పరిమితం కాలేదు. రాజకీయ యవనికపై, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లో పెనుమార్పులు వచ్చి మండల్ అనుకూల ఒబిసి పార్టీలు అధికార పార్టీలుగా ఎదిగాయి.

ఒబిసి రిజర్వేషన్‌లు అమలులో ఉన్న గత పాతికేళ్లలో వెనుకబడిన తరగతుల్లో ముందున్న తరగతులే రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నాయన్న అసంతృప్తి, ఆందోళన వారిలో అత్యంత వెనుకబడిన తరగతుల్లో ప్రబలమైంది. అదేకాలంలో తమను ఒబిసి జాబితాల్లో చేర్చాలనే డిమాండ్‌లు, ఫలాలను మరింత మెరుగ్గా పంపిణీ చేసేందుకు జాబితాను కుదించాలన్న ఒత్తిళ్లు ప్రభుత్వంపై వచ్చాయి. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ మూడు కేటగిరీలను సూచించింది – ఇతర బిసిలు, ఎంబిసిలు, ఇబిసిలు. ఇది సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తున్నది. అయితే ఇది అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. రిజర్వేషన్‌ల శాతం పెరగదు. ఉన్న ఫలాన్ని మరింత సమన్యాయంతో పంపిణీ చేయటమనేది ఉపవర్గీకరణ లక్ష్యం. వందల సంఖ్యలో కులాలు, వేలసంఖ్యలో ఉపకులాలున్న సమాజంలో కులాల వర్గీకరణ చేసినప్పటికీ అందరికీ న్యాయం చేయటం, అసంతృప్తికి తావులేకుండా చేయటం అసాధ్యం. ఇదే సమస్య షెడ్యూలు కులాల రిజర్వేషన్‌లో ఉంది. రిజర్వేషన్ ఫలాలను మాలలే అత్యధికంగా అనుభవిస్తున్నందున మాదిగలకు అన్యాయం జరుగుతోందని, అందువల్ల ఉపవర్గీకరణ చేయాలని తెలుగునాట మంద కృష్ణ దశాబ్దాలుగా పెద్ద ఉద్యమమే చేస్తున్నాడు. ఉద్యమాన్ని ఢిల్లీదాకా తీసుకెళ్లి ఎంతో ప్రయత్నం చేసినప్పటికీ పాలక రాజకీయ పార్టీలనుంచి సానుకూల హామీలు తప్ప చట్టరీత్యా చర్యలు లేవు. ఎస్‌సి వర్గీకరణ ఉండదని కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్, ఒబిసి ఉపవర్గీకరణకు మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న మరునాడే స్పష్టం చేశాడు.


ఒబిసి వర్గీకరణ నిర్ణయంలో అత్యంత వెనుకబడిన కులాలకు న్యాయం చేయటమనే ఉన్నత లక్ష్యం కనిపిస్తున్నప్పటికీ, అటువంటి వర్గీకరణకు తక్షణ డిమాండ్ లేకపోయినా కేంద్రమంత్రివర్గం ఆ నిర్ణయం చేయటంలో రాజకీయ దృష్టి ప్రస్ఫుటమవు తున్నది. ఒబిసిల్లోని ఆధిక్య తరగతులకు (ఉదా. ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లో యాదవులు) వ్యతిరేకంగా అత్యంత వెనుకబడిన తరగతులను (ఎంబిసి) కూడగట్టే వ్యూహం యుపి ఎన్నికల్లో బిజెపికి పెద్ద లబ్ది చేకూర్చింది. కాబట్టి ఆ రెండు రాష్ట్రాల్లో బలమైన సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్‌లను రాజకీయంగా దెబ్బతీయటానికి ఉపవర్గీకరణ పదునైన ఆయుధంగా పనిచేస్తుంది. ఒబిసి రిజర్వేషన్‌లనే వ్యతిరేకించి పెద్ద ఎత్తున ఆందోళన చేసిన పార్టీ, ఇవాళ అందులో మరింత వెనుకబడిన వారితో ఓటు బ్యాంక్ సృష్టించుకునేందుకు ప్రయత్నించటమే రాజకీయం. ఏమైనా, సామాజిక న్యాయాన్ని అట్టడుగు వరకు తీసుకెళ్లటం మంచిదే. అయితే విద్య, ఉద్యోగాల్లో ప్రభుత్వ వాటా నానాటికీ తీసికట్టు అవుతున్న విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తుండగా, ఒబిసి ఉపవర్గీకరణ వల్ల జరిగే లబ్ది నామమాత్రమే.

గోప్యత తీర్పుతో గొప్ప మార్పులు

చూపు

గోప్యత పౌరుని ప్రాథమిక హక్కు అని 9మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పు క్రికెట్‌ను మించి ప్రజలను ఆకర్షించింది. అత్యున్నత ధర్మాసనం తన పరిధిని మించి తీర్పులు ఇస్తోందని, అక్కరలేని సంయమనం ప్రదర్శిస్తోందని ఇటీవల విమర్శలు వచ్చాయి. అందుకు భిన్నంగా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన తాజా తీర్పు ప్రజలకు ఊరటనిచ్చింది. తమ తీర్పు ప్రభావం ఆ తొమ్మిదిమంది న్యాయమూర్తుల బెంచ్‌కి తెలుసు. ముఖ్యంగా ఆధార్ ప్రాజెక్టుపై పడే ప్రభావం కూడా తెలుసు. ఈ అంశం త్వరలో విడిగా సుప్రీంకోర్టు తేల్చుతుంది. పౌర సమాజం మాత్రం ఈ తీర్పు పట్ల ఉన్నతమైన ఆశలు పెట్టుకొంది. తీర్పు కేవలం న్యాయపరమైన వరవడిగా మిగలకుండా పౌరుల ప్రాథమిక హక్కులను బలపరిచి చరిత్ర సృష్టించిందనే అభిప్రాయం బలంగా నాటుకుంది.

సుప్రీంకోర్టు ఈ తీర్పుతో నిలబెట్టిన మౌలిక హక్కులపై రానున్న వారాలలో వరుస విశ్లేషణలు తప్పక వెలువడతాయి. ముఖ్యంగా పౌరుల బయోమెట్రిక్ వివరాలతో రూపొందిన 'సమాచార నిక్షేపం'పై ప్రభావం గురించి కూడా తెలియజెప్పే విశ్లేషణలు వస్తాయి. ఈ తీర్పుపై 547 పేజీల వచనంగా, కవిత్వంగా, రాజ్యాంగ సూక్ష్మాల తేటగీతిగా వర్ణనలు వెలువడుతున్నాయి.



21వ అధికరణను తలదాల్చిన తీర్పు

గోప్యత పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని విస్తృత బెంచ్ స్పష్టంగా పేర్కొంది. పుట్టుకతో వచ్చి చనిపోయే దాకా ఆ హక్కు ఉంటుందని, దాని క్రిందకు గౌరవప్రదంగా జీవించే హక్కుతో పాటు 21వ అధికరణ భరోసా ఇచ్చిన స్వేచ్ఛ కూడా వస్తుందని ఘంటాపథంగా జడ్జీలు చెప్పారు. ఇంతకు ముందు ఎంపి శర్మ, ఖరక్ సింగ్ కేసులలో ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పులను వారు పక్కన బెట్టారు. మన న్యాయవ్యవస్థ ఈ తీర్పుతో కొత్తగా పౌరులకు హక్కులు ఏవీ కల్పించలేదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను నిలబెట్టింది అంతే. ఈ విషయాన్ని తన తీర్పులో జస్టిస్ చంద్రచూడ్ రాశారు.

వ్యక్తి స్వయం ప్రతిపత్తితో గోప్యత ముడిపడి ఉందని రాజ్యాంగం చెప్పిన దానికి ఈ ఏకగ్రీవ తీర్పు స్పష్టతను ఇచ్చింది. ఆ న్యాయమూర్తులు గోప్యత హక్కుతో వ్యక్తులకు వచ్చే పలు అర్హతలు, ప్రయోజనాలను వివరించే పనికి పూనుకోలేదు. 'రాజ్యాంగం ఒక సజీవ పత్రం' అన్న స్ఫూర్తికి అనుగుణంగా ఆ బాధ్యత భవిష్య న్యాయమూర్తులు నిర్ణయించడానికి వదిలిపెట్టారు. అయితే 21వ అధికరణ కల్పిస్తున్న పౌరుల గోప్యత హక్కును ఎటువంటి సందర్భాలలో ప్రభుత్వం అతిక్రమించ వచ్చో న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ విషయంలో అతిక్రమణ ఉద్దేశాలు, మార్గాల మధ్య పొంతన ఉండాలని నిర్దేశించారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు ఇష్టానుసారం పౌరుల స్వేచ్ఛను హరించకుండా రాజ్యాంగం చేసిన బిగింపులను గుర్తుచేశారు. పౌరులు ఏమితినాలి, ఎటువంటి దుస్తులు తొడగాలి అన్నది వారి స్వేచ్ఛకే ప్రభుత్వం ఇకపై వదలాలి.

ఎల్‌జిబిటి, మహిళల హక్కులు కీలకం

గోరక్షణ ఆంక్షల పేరుతో స్వేచ్ఛను హరిస్తే బాధితులు కోర్టులో సవాలు చేయవచ్చు. ముఖ్యంగా సెక్సుపరమైన హక్కులపై కూడా తీర్పు దృష్టి పెట్టడం హర్షణీయం. సెక్సు పరమైన మైనారిటీ (ఎల్‌జిబిటి)ల గోప్యత హక్కులను ఈ తీర్పు పరిరక్షించడం అత్యంత కీలకమైనది. అందుకోసం మూడేళ్ల క్రితం ఇచ్చిన తీర్పును ఈ బెంచ్ పక్కన బెట్టింది. సురేష్ కుమార్ కౌశల్, నాజ్ ఫౌండేషన్ మధ్య నడిచిన కేసులో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ అప్పుడు ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని తలక్రిందులు చేయడం ద్వారా పురోగమన విలువల వ్యాప్తికి తిలోదకాలు ఇచ్చింది.

భారతీయ శిక్షాస్మృతిలో స్వజాతి శృంగారాన్ని నేరంగా ప్రకటిస్తున్న 377వ సెక్షన్‌ను కొట్టివేయడానికి నిరాకరించడం ద్వారా అప్పుడు సుప్రీంబెంచ్ చేసిన తప్పును ప్రస్తుత 9 మంది జడ్జిల బెంచ్ సరిదిద్దింది. గోప్యత హక్కు కోసం ఈ అంశంలో న్యాయవ్యవస్థ తీర్పులు ఇవ్వడాన్ని విమర్శిస్తూ కొందరు సాంప్రదాయ మేధావులు గుడ్లెర్ర జేస్తున్నారు. జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పు ప్రతి 125 –128 పేరాగ్రాఫ్‌లో ఈ కఠిన సెక్షన్‌ను దాదాపు కొట్టివేశారు.

మైనారిటీల హక్కులకే పెద్దపీట

మన జనాభాలో ఎల్‌జిబిటి వర్గం అత్యంత సల్పసంఖ్యలో ఉంటారని ఆయన పేర్కొన్నారు. వారికి వ్యక్తిగత గోప్యత హక్కును నిరాకరించడం భావ్యం కాదని స్పష్టం చేశారు. మెజారిటీ ప్రజలు ఇష్టపడిన విధంగానే 'హక్కులు' ఉండవని గుర్తు చేశారు. అల్ప సంఖ్యాకుల హక్కులను కాపాడితేనే అది హక్కుల పరిపూర్ణ రక్షణ అవుతుందన్నారు. కౌశల్ కేసులో న్యాయమూర్తి సింఘ్వి పేర్కొన్న దాన్ని చంద్రచూడ్ చింపివేసినంత పని చేశారు. సెక్సుపరమైన మైనారిటీల హక్కులను సింఘ్వి ఈసడించడాన్ని ఆయన ఎండగట్టారు. ఈ తీర్పునుంచి ప్రయోజనం పొందేది ఎల్‌జిబిటిలు ఒక్కరే కాదు. మహిళలకు గల ఎంపిక హక్కును కూడా ఇది బలపరిచింది. సుప్రీంకోర్టు తన తీర్పులో మహిళలకు గల గర్భస్రావ హక్కును నిలబెట్టింది. అలాగే పిల్లలను కనే విషయంలో, ఇతరత్రా మహిళలకు నిర్ణయాధి కారం లేని ప్రస్తుత సామాజిక స్థితిలో మహిళా హక్కులను బలపరచడం ఎంతో మార్పు తెచ్చే నిర్ణయం అనడంలో సందేహం లేదు. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడం ద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలను ఇష్టానుసారం ప్రభుత్వాలు చెలాయించడం ఇకపై సాగదు. అవి ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించవలసి ఉంటుంది. ఇంతటి పెనుమార్పులకు తెరతీసిన సుప్రీం న్యాయమూర్తులకు జోహార్లు చెప్పాల్సిందే.

* అగ్నిదిప్తా తరఫ్‌దెర్, అరింద్రజిత్ బసు

కేంద్రీకరణ దిశగా విద్య?

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవలనే జాతీయ విద్యావిధానంపై నూతన ముసాయిదా కమిటీని నియమించింది. దేశంలో తలపండిన విద్యావేత్తలు తొమ్మిది మందితో ఏర్పరచిన ఈ కమిటీకి మాజీ ఇస్రో ఛైర్మన్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ నేతృత్వం వహిస్తున్నారు. 20 అంశాలపై చేయాల్సిన మార్పులు చేర్పులపై ఇప్పటికే కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఓ చిత్తు ముసాయిదా విడుదల చేసింది. గత ఏడాది సిసిఇ పై నియమించిన గీతా బుక్కల్ కమిటీ ప్రధాన సిఫార్స్‌లతో పాటు, కేంద్రప్రభుత్వ పెద్దల మనోగతాన్ని ముసాయిదాలో దించేశారు. మన సమాఖ్య రాజ్యాంగ మౌలిక లక్షణం విద్యను ఉమ్మడి జాబితా అంశంగా ఉంచడమే. కాని మన జాతీయ విద్యావిధానం 2016–20 ముసాయిదా చూస్తే విద్య అందుకు భిన్నంగా కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నట్లు అగుపిస్తుంది.

వేద విద్య మన భారతీయ సంస్కృతిలో అంతర్భాగం అని మన పెద్దలు అన్నారు. క్రీ॥ పూ॥ 700 ఏళ్ళ క్రితం మొదటి విశ్వవిద్యాలయం తక్షశిల మన దేశంలోనే ఏర్పడింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా 'నలందా' సైతం 4వ శతాబ్దంలోనే ఏర్పరచబడింది. చరకుడు, శుశ్రుతుడు, ఆర్యభట్ట, భాస్కరాచార్య, చాణక్యుడు, పతంజలి, వాత్స్యాయనుడు ప్రపంచానికి పాఠాలు బోధించిన మన మేధావులే, కాదనలేం కానీ, ఇంకా వెనక్కిపోతే ద్వాపర యుగంలో వశిష్ఠుడు, త్రేతాయుగంలో సాందీపనీ నేటి కలియుగ గురుకులాలకు ఆద్యులు అని చెప్పుకున్నా మనం ఆశ్చర్యానికి గురికావాల్సిన అవసరం లేదు. ఇలా మొదలైన ముసాయిదా ప్రధానంగా నాలుగు సిఫార్సులు కీలకమైనవి ప్రతిపాదించింది. 1) విద్యా ట్రిబ్యునళ్ళ ఏర్పాటు 2) మాధ్యమిక పాఠశాల స్థాయిలో తిరిగి 'డిటెన్షన్' విధానం ప్రవేశ పెట్టడం 3)సైన్స్, గణితం, ఆంగ్లం సబ్జక్టులకు ఉమ్మడి సిలబస్ దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టడం 4) 'సంస్కృతాన్ని' తిరిగి ప్రవేశ పెట్టడం. అరకొరగా పదవ తరగతి పరీక్షా విధానంలో మార్పుల్ని సూచించింది. అయితే ఇక్కడ ముసాయిదాలో ''ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్ టెక్నాలజీ''ని అందుకోవాలని చెప్పింది. అయితే మృత భాష సంస్కృతాన్ని నేటితరం విద్యావ్యవస్థ ఏ మేరకు జీర్ణించుకోగలదన్నది ప్రశ్నార్థకమే. మాధ్యమిక స్థాయిలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఎప్పుడో 45 ఏండ్ల క్రితం వదిలేసిన 'డిటెన్షన్' విధానం ప్రవేశ పెట్టాలనడం సరి కాదు. ఇప్పటికే 30 శాతం డ్రాపవుట్స్ మాధ్యమిక విద్యాదశలో ఉన్నారు. ఎన్‌రోల్‌మెంట్ శాతం క్రమంగా పడిపోతోంది. ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీ విద్యార్థులలో ఈ శాతం మరింత ఎక్కువ ఉంది.

ఈ దశలో ఈ ప్రతిపాదన విద్యావ్యవస్థ మూలాల్ని మరింత దెబ్బతీస్తుంది. ఇక ఎక్కడికక్కడ 'కరిక్యులమ్' రూపొందించుకోవడం మంచిదని విద్యా కమీషన్లు , మేధావులు సిఫార్స్‌లు చేస్తుంటే కేంద్రం కీలకమైన సబ్జెక్టులు గణితం, సైన్స్ , ఆంగ్లం సబ్జక్టులను తామే ఉమ్మడి సిలబస్ ద్వారా నియంత్రిస్తామనడం విద్య కేంద్రీకరణలో భాగమే. కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయాలు, కస్తూరిబా బాలికా విద్యాలయాలను అవసరమున్నచోట అప్‌గ్రేడ్ చేయాలని ముసాయిదా పేర్కొంటున్నది.

జాతీయ విద్యావిధానం 2016–20 ముసాయిదాలో సూచించిన అనేక అంశాలు విద్య కేంద్రీకరణ అంశాన్ని, కొన్ని అసంబద్ధ సిఫార్సుల్ని రుద్దబోతున్నారని స్పష్టం చేస్తున్నది. జాతీయ విద్యావిధానం ముసాయిదాలో ప్రీ ప్రైమరీ విద్యకు సంబంధించి నాలుగు, ఐదు సంవత్సరాల వయస్సున్న పిల్లల బాధ్యత సైతం రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించాలి. అందుకు అంగన్ వాడీలు బలోపేతం చేయడంతో పాటు ' ప్లే ' స్కూల్స్‌లో రెగ్యులర్ ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని నియమించాల్సిన, ప్రైవేటు ప్లే స్కూల్స్‌ను నియంత్రించాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంచబడింది.

ప్రాథమిక విద్య విషయానికి వస్తే త్రిభాషా సూత్రం ప్రకారం 5వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన చేయాల్సి ఉంది. ఐదు వందలకు పైగా ఉన్న గిరిజన, సంచార జాతులు, దళితులు వారివారి మాతృభాషల్లో విద్యాబోధనలేక విద్యకు దూరంగా ఉన్నారు. ఈ విషయం ఎక్కడా ముసాయిదాలో ప్రస్తావించలేదు. 'సంస్కృతం' పట్ల అభిలాష ప్రాథమిక స్థాయి నుంచి పెంచాలని ముసాయిదా స్పష్టం చేస్తున్నది. పిల్లల అభివృద్ధి, భద్రత, హక్కుల పరిరక్షణ ప్రధానాంశంగా పేర్కొంది. ఇక మాధ్యమిక స్థాయిలో పిల్లలు సాధించిన సామర్థ్యాల ఆధారంగా 'డిటెన్షన్' విధానం అమలు జరపాలని కోరింది.

పదవ తరగతి పరీక్షల్లో గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టులలో తక్కువ మార్కులు రావడాన్ని గమనించిన కేంద్ర విద్యాశాఖ ఈ మూడు సబ్జెక్టులకు దేశవ్యాప్త ఉమ్మడి సిలబస్‌ను ప్రతిపాదించడంతో పాటు పదవ తరగతి పరీక్షల్లో పాస్ కావడానికి స్వల్ప మార్పులు సూచించింది.

పాఠశాల విద్యలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పొందిన శిక్షణకు రోజువారీ పనికి సంబంధం లేదని , ఉపాధ్యాయుల గైర్హాజరు, జవాబులేనితనం పెరిగిందని నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. కనుక జాతీయ స్థాయిలో ''ఉపాధ్యాయ విద్యా యూనివర్సిటీ'' ఏర్పాటును ప్రతిపాదించింది. మెరిట్ ప్రాతిపదికనే ఈ కమిషన్ పని చేస్తుందని నిర్ద్వందంగా ప్రకటించింది. ఉపాధ్యాయ విద్యకు ప్రత్యేక విభాగాల్ని ప్రతి రాష్ట్రంలో ఏర్పాటు చేసుకోవడంతో పాటు సామర్థ్యాల అభివృద్ధికి బి.ఇడి కళాశాలలు, డైట్స్‌ను బలోపేతం చేయాలని సూచించింది. విద్యార్థుల అన్ని రికార్డులు ప్రాథమిక ఉన్నత విద్యాస్థాయిలో 'ఆన్ లైన్'లో భద్రపరచాలని, సిలబస్‌లో ''ఇంటర్‌నేషనల్ కమ్యూనికేషన్ టెక్నాలజీ'' (ఐ.సి.టి) అవసరం అయితే 6వ తరగతి నుండే దానిని పరిచయం చేయాలని ముసాయిదాలో చేర్చారు.

భౌతిక విద్య, యోగ విద్య , ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్., చిత్రలేఖనం బాలసన్సద్, క్రాఫ్ట్, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలను పాఠ్యప్రణాళికలో చేర్చాలనేది సిఫార్స్‌గా ఉంది. ఇక నుండి ఉపాధ్యాయుల అవార్డులు పాఠశాల విద్యాకమిటీల సిఫార్సుల మేరకే చేయాలని సూచించింది. పాఠశాల ఉపాధ్యాయ అభివృద్ధి సూచికల్లో మార్పులు సూచించింది.

2.82 మిలియన్ల మంది నిరక్షరాస్యులుగా భారతదేశం విద్యలో వెనుకబడి ఉంది. ప్రపంచంలో 53 శాతం 25 ఏళ్ళలోపు జనాభా కల్గిన భారతదేశాన్ని నిరక్షరాస్యత వేధిస్తున్న సమస్యగా మారింది. 1978 నుండి జాతీయ అక్షరాస్యత మిషన్, సాక్షర భారతి లాంటి ఎన్ని కార్యక్రమాలు పెట్టినా వైఫల్యాల పుట్టగా అవి మారాయి. అయినా '' కొత్త సీసాలో పాత సారా '' మాదిరిగా స్వయం సహాయక బృందాలు, ప్రభుత్వం, పాఠశాలల ద్వారా వయోజన విద్యాలక్ష్యాలు 'నైపుణ్యాల' అభివృద్ధితో పూర్తి చేయాలని సలహానిస్తున్నది.

ఇక ఉన్నత విద్యకు సంబంధించి అనేక సిఫార్సులను జాతీయ విద్యావిధానం ముసాయిదా ముందుకు తెచ్చింది. ఉన్నత విద్యను క్రమబద్ధీకరించడం అనేది ప్రధానాంశంగా ఉంది. ప్రపంచంలో ఉన్నత విద్యలో మనం ఇప్పుడు రెండవ స్థానంలో కొనసాగుతున్నాం అయినా అంతర్జాతీయ ప్రమాణాల కనుగుణమైన నాణ్యత మన విద్యావనరుల్లో లేదు. అందుకోసం ముసాయిదా '' సెంట్రల్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్ ఏజెన్సీ (సి.ఇ.ఎస్.ఎ)ను ప్రతిపాదించింది. ఉన్నత విద్యలో ప్రమాణాల కోసం ఇప్పటికే 'నాక్ ' 'నాబ్' సంస్థలు కృషిచేస్తున్నప్పటికీ ఇంకా కళాశాల విద్య వెనుకబడే ఉంది. ఎంపిక చేసిన 200 అంతర్జాతీయ విద్యాసంస్థలను దేశంలోని యూనివర్సిటీతో అనుసంధానించి ఉన్నత విద్యాప్రమాణాలను సాధించాలని, ఐ.సి.టి ని వినియోగించుకోవాలని ముసాయిదా సూచించింది. అంతర్జాతీయ పోటీ సవాళ్ళను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలనే లక్ష్యం ఎంతవరకు నెరవేరుతుందో కాని స్వయంప్రతిపత్తితో ఉన్న యూనివర్సిటీల అనుసంధానం కోసం కేంద్రం ''నేషనల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్.యు.ఇ. పి.ఎ)అనబడే ఓ సంస్థను ఏర్పాటు చేయబోతున్నారు. అంతర్జాతీయ సంస్థలలో నెట్‌వర్క్ జ్ఞానాభివృద్ధి సూచికగా చెప్తున్న ఒక రకంగా విద్యాకేంద్రీకరణ చర్యల్లో భాగం కానున్నాయి.

జాతీయ విద్యావిధానం ముసాయిదాలో మరో అంశం ప్రధానంగా ఉంది. 'నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఓపన్ స్కూలింగ్'' విభాగం ఇక నుండి నైపుణ్యాల అభివృద్ధి మంత్రిత్వ శాఖతో అనుసంధానం కావాల్సి ఉంటుంది. ఓపన్ స్కూల్స్ , డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రధానంగా బడిమానివేసిన పిల్లలు, పనిలో ఉన్న పిల్లల కోసం నిర్దేశించబడ్డాయి. బడి బయట పిల్లలు ఈ ముసాయిదా ప్రకారం రెగ్యులర్ పాఠశాలల మెట్లు ఎక్కే అవసరం లేదు. వాళ్ళకు ఇష్టమైన సమయంలో ఓపన్ స్కూలింగ్ విధానంలో చదువుకోవాలని ముసాయిదా స్పష్టం చేస్తున్నది. ఇదీ ఆచరణ సాధ్యం కాని మరో నిబంధనగానే మిగిలి పోనుంది. వరసగా మనదేశంలో 1968, 1986, 1992, 2016లలో నూతన విద్యావిధానం పాలసీలు రూపొందించుకొంటూ వచ్చాం. మన జి.డి.పిలో 6 శాతం విద్యకు కేటాయించాలని ఈ విధానాలన్నీ స్పష్టం చేస్తున్నా అరకొర కేటాయింపులే జరుగుతున్నాయి. ఇప్పటికీ అత్యధికంగా జి.డి.పిలో 3.5 శాతానికి మించి విద్యపై ఎప్పుడూ ఖర్చు చేయలేదు. ఎన్ని నిబంధనలు , సంస్థలు ఏర్పరుచుకున్నా వాటి మనుగడ ఆర్థిక పునాదిపైనే ఆధారపడి ఉంటుంది.

మనం 1976లోనే 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 21 చేర్చుకొని ''నిర్బందోచిత ప్రాథమిక విద్య '' లక్ష్యంగా నిర్ణయించుకొన్నాం ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ పథకం ద్వారా అనేక చట్టాలు రూపొందించుకొన్నాం. 2009లో ఏకంగా రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 21 (ఎ)చేర్చుకొని విద్యాహక్కు చట్టం తెచ్చుకొన్నాం. ఇవన్నీ 6 నుండి14 సం॥ బాలలకు విద్యను నిర్బంధ హక్కుగా గుర్తించిన ప్రధానాంశాలే. కాని మాటల్లో కోటలు దాటుతున్నా చేతలు అడుగు ముందుకు పడని పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యావిధానంలో తమ ముద్ర పేరుతో పాలకులు ఉన్న వ్యవస్థను తిరగదోడుతున్నారు. ఈ విధానం సరికాదు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండి సమాఖ్య రాజ్యాంగ లక్షణంగా నిర్వర్తించ బడుతుంది. అధికార కేంద్రీకరణ అంతిమంగా అప్రజాస్వామిక వైఖరులకు దారి తీస్తుంది. కనుక నూతన జాతీయ విద్యావిధానం2016–20 మన దేశంలోని 53శాతం యువ జనాభా నైపుణ్యాభివృద్ధికి తోడ్పడేది కావాలి. వారికి అంతర్జాతీయస్థాయి విజ్ఞానాన్ని అందించి తగిన ఉపాధిమార్గాలు కల్పించే నూతన అన్వేషణ దిశగా ఉండాలి.

* ఎన్. తిర్మల్, 9441864514

సంచార జాతులకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలి



గుంటిపల్లి వెంకట్
9494941001

ఎంబిసిలకు, సంచార జాతులకు అన్ని అంశాలలో తేడా ఉంటుంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటు విషయాలలో సంచార జాతుల నాగరిక ప్రపంచానికే దూరంగా ఉంటున్న కులాలున్నాయి. ఎంబిసిలకు వృత్తి ఉంటుంది. సంచార జాతులకు వృత్తి ఉండదు. సంచార జాతుల సంస్కృతి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఎంబిసిల కన్నా వైవిధ్యభరితంగా ఉంటాయి. ఎంబిసిలు గ్రామాల్లో ఉంటారు. సంచార జాతులు ఊరి బయట గుడారం వేసుకుని ఉంటారు. నాగరిక సమాజానికి దూరంగా ఉంటూ కేవలం యాచక, ఇతరత్రా పొట్టపోసుకునే చిరు వృత్తులపై ఆధారపడుతుంటారు. కులాల ప్రాతిపదికన ఎక్కువ సంఖ్యలో వీరు బిసి(ఎ)లో ఉన్నప్పటికీ ఏ న్యాయం జరగలేదు. సంచార జాతుల్లోని దాదాపు 50 కి పైగా కులాల్లో కనీస విద్య లేదు. 70కి పైగా కులాల్లోని వారికి పక్కా ఇళ్లు లేవు. ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు లేవు. అంతెందుకు ఇప్పటికీ దాదాపు 25 కులాలకు కనీసం కుల ధృవీకరణ పత్రాలు జారీ కాలేదు. బిచ్చగాళ్లుగా, బ్రిటిష్‌కాలం నాటి చట్టాల్లో దొంగలుగా సంచార జాతులను అభివర్ణిస్తూ అంటరాని వారుగా చూస్తున్నారు. అయితే ఇవన్నీ కొత్త ప్రభుత్వంతో చర్చించుకుని తమ సమస్యలకు పరిష్కారం సాధించవచ్చని ఈ జాతులు ఆశపడ్డాయి. కాని సంచార జాతులు ఎంబిసిల్లోనే భాగం అని చెప్పడంతో బలమైన కులాల మధ్య వీరు బతుకగల్గుతారా అనేది పశ్న. మొత్తంగా ఎటొచ్చీ బిసిలైనా, ఎంబిసిలైనా వృత్తి కులాలకే లాభం జరుగుతున్నది. కాని సంచార జాతులను సంఖ్యాపరంగా చూపించి వారంతా ఎంబిసిలేనని చెప్పడం హాస్యాస్పదంగా కనిపిస్తున్నది.

సంచార జాతుల సంస్కృతి జీవన వైవిధ్యం వేరు. ఎంబిసిల వృత్తి పోరాటం వేరు. ఫకీర్లు ఇంకా బిచ్చగాళ్ల వృత్తిని వదలడం లేదు. ఊళ్లల్లో నెత్తిన గంపనెత్తుకుని గాజులోయ్ అని తిరిగే పూసవేర్ల, పూసల కులానికి చెందిన వారి జీవన స్థితిగతులు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. ఇలా గారడోళ్ల విన్యాసాలు, పగటి బాగోతాలు కథలు, గోత్రాలు, వంశరాజులు (పిచ్చుకకుంట్ల) వైశ్యుల ఆశ్రిత కులమైన వీరభద్రీయ వీరముష్టిలు ఇప్పుడు మచ్చుకైనా ఆ వృత్తిలో లేరనే చెప్పాలి. భిక్షాటనే ప్రధాన వృత్తి గాగల మొండిపట్ల, పరిముగ్గల, కంజరభట్ట, కైకాడి, కాశీకాపుడి ఆ వృత్తికి దూరమై అంగళ్లో అమ్మకాలు చేస్తున్నారు. వేర్లు, కాయలు, వనమూలికలతో ఉండే మందులోళ్లు, జ్యోతిష్యమే వృత్తిగా ఉన్న జోషినందివాల, నైజం సర్కారుకు ఆయుధాలు తయారీ చేసిన సిక్లిగర్‌లు, కేవలం సంచార వృత్తినే నమ్ముకుని పూసలు, గాజులమ్మే పూసలోళ్ల వృత్తులు ఇవాళ కనుమరుగయ్యాయి. వారంతా చిరు వ్యాపారాలు ఎజెండాగానే బతుకులీడుస్తున్నారు. అయితే కొన్ని కులాలకు వ్యాపార ముద్రపడడంతో వారు ముందుకి వెళ్లలేక వెనక్కిరాలేక నలిగిపోతున్నారు. ఇక బండలు రాళ్లను కొడుతూ బతికే వడ్డెర్ల జీవన పరిస్థితి కూడా మరీ దారుణంగా ఉంది.

తెలంగాణ రాష్ట్రంలో వైవిధ్య భరితంగా సాగుతున్న వీరి జీవన ప్రమాణాలపై సమగ్ర అధ్యయనం జరగాల్సిన అవసరం ఉన్నది. అందుకే తాత్కాలికంగా ఆర్థిక ఫెడరేషన్లు, లెక్కల చిట్టా పద్దులు కాకుండా బిసి కమీషన్ తరహాలో సంచార జాతుల కమిషన్ వేస్తే ఆ జాతులకు గుర్తింపు ఉండడంతోబాటు, ఆ జాతుల స్థితిగతులపై అధ్యయనం చేసే అవకాశముంటుంది. బిసి కమిషన్ తరహాలో సంచార జాతులకు ప్రత్యేక కమిషన్ వేయడం ద్వారా ఆ జాతులను ప్రభుత్వం గుర్తించినట్టవుతుంది.

ముఖ్యంగా కొన్ని కులాలు ఎస్‌సి, ఎస్‌టి జాబితాలో చేరాలనుకుంటున్నాయి కాబట్టి వాటి సామాజిక, ఆర్థిక కోణాలను పునఃపరిశీలించి ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేసే అవకాశం ఉంటుంది. సంచార జాతుల పిల్లలు విద్యాపరంగా వృద్ధిలో లేరు, కనీసం నిలువ నీడలేని దైన్యపరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా వీరిని గుర్తించాలంటే ప్రత్యేక కమిషన్ వేయడమే శరణ్యం. దీంతో పాటు రాజకీయ అవకాశాల వైపు ఈ జాతులను జాగృతం చేయడంలో భాగంగా ప్రత్యేక కార్పొరేషన్ నెలకొల్పితే బాగుంటుంది.

అందుకే ప్రభుత్వ పథకాల ప్రయోగశాలగా పేరున్న తెలంగాణ ప్రభుత్వం సంచార జాతుల కోసం ఓ ప్రత్యేక కార్పొరేషన్‌ను నియమిస్తే దాదాపు 80కి పైగా అనాథ కులాలను చేరదీసినట్లవుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో సంచార విముక్త జాతులు

బిసీ(ఏ) గ్రూపు : 1. బాలసంతు,బహురూపి, 2.బుడుబుక్కల, 3.దాసరి, 4.దొమ్మర, 5.గంగిరెద్దుల, 6.జంగం, 7జోగి, 8కాటిపాపల, 9.మేదర/మహేంద్ర, 10మొండివారు, మొండిబండ, బండ 11.వంశరాజ్, 12. పాముల, 13.పార్థి, 14.పంబాల, 15.పెద్దమ్మల వాళ్లు, 16.ఎల్లమ్మలవారు, ముత్యాలమ్మలవారు, 16.వీరభద్రియ/వీరముష్టి ,17.వాల్మీకి బోయ, (బోయ, బేదర్, కిరాతనిషాది, పెద్దబోయ, తలయారి, చంద్రువాల్ల,) 18. కంజరబట్ట, 19. కెంపుమారే/రెడ్డిక 20. మొడిపట్ట, 21.పరికి ముగ్గుల, 22. యాటా 23 కైకాడి,24.జోషినందివాల, 25.వడ్డెర(వడ్డి,వడ్డెలు,వడ్డీలు), 26.మందుల, 27.కూమపులి, 28. పత్రా, 29.రాజన్నల/రాజన్నలు, 30.గోత్రాల, 31.కాశికాపడి/కాశికపుడి, 32. సిక్‌లీగర్, 33. పూసల

బిసి(బి) గ్రూపు : 1.ఆరెమరాఠీ/తోలుబొమ్మలవాళ్ళు/మరాఠీ బుడుబుక్కల; బిసి(డి) గ్రూపు : కృష్ణ బలిజ

బిసి(ఇ) గ్రూపు : ఫకీర్, అత్తర్ సాయిబులు, జింకసాయిబులు, బోరెవాలె,పత్తర్ ఫోడా,(కాశోళ్లు)తురకబుడిబడికి, ఘంటి, ధర్వేష్, గారడి సాయిబులు, గుడ్డేలుగు సాయిబువు, ఎలుగుబంటి సాయిబులు, కీలుగుర్ర సాయిబులు, బొంతల సాయిబులు, కక్కుకొట్టే సాయిబులు,

ఎస్‌సి : 1బేడబుడగ జంగం, 2. దొంభార,పైడి, పానో, డోమ్ 3.సిందోళ్లు, 4. డక్కలి, 5 మాస్ట్రీన్, 6. హోలియాదాసరి, 7. రెల్లి 8. కొలుపువాళ్లు/పంబాల, 9. గోసంగి,10.ఎల్లమ్మవారు

గుర్తింపులేని జాతులు : 1. బాగోతుల, 2. బొప్పలవారు, 3. గంజికూటి వారు, 4. శ్రీ క్షత్రియ రామజోగి, 5. ఏనూటి, 6 గుర్రపువారు, 7. అద్దపు వారు, 8. కడారి/తైదరోల్లు, 9. సరగాని, 10. ఓడ్, 11. మాసకయ్యలు/పతంవారు, 12. సాధనాసూరులు, 13. రుంజ, పనస, 15. పెక్క, 16. పాండవుల వారు, 17. గౌడజెట్టి, 18. ఆదికొడుకులు, 19. తెరచీరల, 20.కాకిపడగల, 21. గపులి, 22. బండార, 23. సన్నాయి వాళ్లు, మొదలైనవారు.

(ఆగస్టు 31 విముక్త జాతుల దినం)



గల్లీ నుంచి ఢిల్లీకి

ఎల్లలెరుగని మల్లమ్మ

చేసేది అంగన్‌వాడి కేంద్రంలో చిరు ఉద్యోగం. చేసే పనిలో అంకితభావం తన సొంతం. విధి నిర్వహణతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపట్టింది. తన సేవా గుణం నేడు జాతీయ పురస్కారం అందుకునే స్థాయికి తీసుకువెళ్లింది. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, సేవే లక్ష్యంగా అంగన్‌వాడీ బాలల రక్షణ, పర్యవేక్షణకు పాటుపడింది. అందుకే మారుమూల గ్రామం నుంచి కూడా గుర్తింపు పొంది ఢిల్లీ వరకు వెళ్లగలిగింది. అంగన్‌వాడీలో అందించే అరకొర జీతానికి సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(అంగన్ వాడి) కేంద్రంలో నిస్వార్థంతో పని చేస్తూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు అందుకున్న కడారి మల్లమ్మ, అదే స్ఫూర్తితో పనిచేస్తున్నందుకు జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. నేడు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవనంలో కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధి చేతుల మీదుగా రూ.25 వేల నగదుతో పాటు మెమెంటో,ప్రశంసా పత్రం అందుకోనుంది. మన రాష్ట్రం నుంచి ఈ అవార్డుకు ఎంపికైన ఏకైక మహిళ మల్లమ్మ మన తెలంగాణతో ఈ విషయాలు పంచుకున్నది... .

మహిళలు తలుచుకుంటే అసాధ్యమనేది లేదు. ఇంట్లో ఇల్లాలు చదువుకున్నట్లయితే, ఆ ఇంట్లో సభ్యతా సంస్కారాలు వెల్లివిరుస్తాయి. అలాంటి విద్యావంతురాలైన మహిళ నిస్వార్థంగా తన సొంత వూరిని బాగుచేయడమే లక్ష్యంగా పెట్టుకుని అహర్నిశలూ కృషిచేయడం అభినందించదగ్గ విషయం. అంగన్‌వాడి కార్యకర్తగా చిరు ఉద్యోగం చేస్తూ, అంకితభావంతో పనిచేస్తూ, ఉత్తమ అంగన్‌వాడి కార్యకర్తగా జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన కడారి మల్లమ్మ గురించి తెలుసుకుందాం...

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళ్ పల్లి గ్రామంలో దళిత, నిరుపేద కుటుంబానికి చెందిన కడారి మల్లమ్మ డిగ్రీ వరకు ఉన్నత విద్యను అభ్యసించింది. ప్రభుత్వ శాఖలలో ఉద్యోగం లభించక పోవటంతో విద్యావంతురాలు అయినందున సమాజానికి ఏదైన సేవా చేయాలని అకాంక్షతో 2000 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఆధ్వర్యంలో గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా చేరారు. నాటి నుంచి నేటి వరకు విధుల్లో చేరిన మల్లమ్మ శిశుసంక్షేమశాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు రేయింబవళ్లు శ్రమించి శాఖాపర మైన పలు కార్యక్రమాలు సక్రమంగా నిర్వర్తించారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో నేటికి 22 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే గ్రామంలో ప్రజలతో మమేకమై అంగన్ వాడి కేంద్రం అభివృద్ధికి కృషి చేశారు. అంగన్ వాడి కేంద్రానికి ప్రభుత్వాలు అందించే పౌష్టిక ఆహారాన్ని గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారు. పలు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తూ ఇబ్రహీంపట్నం శిశు అభివృద్ధి సేవా పథకంలో అందరి కంటే నిస్వార్థంతో విధులు నిర్వర్తించి శిశు సంక్షేమ శాఖ అధికారుల మన్ననలు పొందారు. అంగన్ వాడి కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ సుమారు 500మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అలాగే విధులతో పాటు గ్రామంలో మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు నిర్మూలనపై నిరక్ష్యరాసులైన ప్రజలకు అవగాహన కల్పించారు. దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న జనాభాను దృష్టిలో పెటుకొని జనాభాను అరికట్టడానికి కుటుంబ నియంత్రణపై మహిళలు అవగాహన కల్పించి 66 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించారు. గ్రామంలో బాల కార్మికులను గుర్తించి వివిధ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అంగన్ వాడీ కేంద్రంలో విద్యార్థులకు ప్రాథమిక విద్య, యోగ, ఆటపాటలతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్‌తో పాటు పరిశోధన విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



అంగన్‌వాడి బాలలతో మల్లమ్మ

స్త్రీ అభివృద్ధి-శిశు సంక్షేమ శాఖ అధికారులు అభివృద్ధిపై ఇచ్చిన శిక్షణలే స్ఫూర్తి : అంగన్‌వాడి కార్యకర్త మల్లమ్మ

ఇబ్రహీంపట్నం శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి సమక్షంలో మండలంలో అంగన్ వాడి కార్యకర్తలకు పలు మార్లు శ్రీకాకుళం జిల్లా సిర్పూర్‌పల్లి గ్రామంలో సుమారు పదిహేనురోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం ఇచ్చిన శిక్షణలను స్ఫూర్తిగా తీసుకుని మంగల్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రజల సహకారంతో అభివృద్ధి చేసి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందినట్లు అంగన్‌వాడీ కార్యకర్త కడారి మల్లమ్మ పేర్కొన్నారు.



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతులమీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఉత్తమ అవార్డును అందుకుంటున్న మల్లమ్మ

గతంలో సేవా కార్యక్రమాలకు గానూ ఉత్తమ అవార్డు....

ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న కడారి మల్లమ్మకు గతంలో పలుసేవా కార్యక్రమాలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం 2015లో రూ.1,116తో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసింది. ఈ సేవలన్నింటిని స్త్రీ అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఉన్నతాధికారులు గుర్తించి మల్లమ్మకు గురువారం ఢిల్లీలో జాతీయ పురస్కారం అందజేయనున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కడారి మల్లమ్మను ఆదర్శంగా తీసుకుంటే తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి అవకాశముంటుంది.

గడ్డం దశరథ
మనతెలంగాణ విలేకరి,
ఇబ్రహీంపట్నం, 9441118499

ఝుంకా గిరారే...





అలంకరణకు కాదేదీ అనర్హం అన్నట్లుగా రకరకాల ఫ్యాషన్లు పుట్టుకొస్తాయి. కాలి గోటి నుంచి కంటిరెప్పవరకు దేన్నీ వదలని ఫ్యాషన్ ట్రెండ్స్ ఎంత త్వరగా వస్తాయో అంతే త్వరగా మాయమౌతాయి. వీటితో సంబంధం లేకుండా ఎవర్ ఫ్యాషన్‌గా నిలుస్తాయి కేవలం మనవే అయిన ఆభరణాలు. చెవిదిద్దుల నుంచి చేతి గాజుల వరకు. ముక్కు పుడక నుంచి మెడలో వేసుకునే హారం వరకు... ఇలా చెప్పుకుంటూ పోతే ఏడు వారాల నగల వరకు చేంతాడంత లిస్టే ఉంటుంది. అవును మరి ఆభరణం ఏదైనా దానికి వాడే డిజైను మాత్రం మన సంస్కృతిని ప్రతిబింబించేదిగానే ఉంటుంది. దీనికి కొత్తా, పాతా తేడా లేదు, డిజైన్ మరింత రాటుదేలి మోడ్రన్ లుక్ సంతరించుకుంటుందంతే. ఏ డిజైన్‌కు మూలమైనా... మయూరాలు, పూలు, లతలు, సింహాలు, మకరాలు, మీనాలు, చాంద్ బాలీలు, ముత్యాలు, మామిడి పిందెలే ఉండడం మనం చూడొచ్చు... అచ్చంగా ఇట్లాంటి డిజైన్లతో కూడిన ఝుంకాలు చూస్తే మనసు గిర్ జాయేగేరే..









టేబుల్ సాల్ట్‌తో అద్భుత ప్రయోజనాలు

ఆహారం నిల్వచేయడానికి, రుచి కలిగించే టేబుల్ సాల్ట్‌తో ఎన్నో ఉపయోగాలు న్నాయి. అందాన్ని మెరుగుపరిచే గుణాలు దీనికుంది. టేబుల్ సాల్ట్‌లో క్లీనింగ్ ఏజెంట్ కూడా. అవేంటో చూద్దాం...

ఉల్లిపాయను కట్ చేసిన తర్వాత, వెల్లుల్లి పొట్టు తీసిన తర్వాత చేతులు విపరీతమైన వాసన వస్తుంటాయి. అవి త్వరగా పోవు. ఘాటైన వాసన పోవాలంటే...చేతులను కొద్దిగా తేమగా చేసుకుని ఉప్పుతో రుద్దుకోవాలి. తర్వాత రన్నింగ్ వాటర్‌లో శుభ్రం చేసుకోవాలి. అంతే వాసన మటుమాయం.

మొటిమలు నివారించడానికి చక్కని ఔషధంగా పనిచేస్తుంది టేబుల్ సాల్ట్. ఉప్పు వేసిన నీటిని ముఖాన్ని కడుక్కోవడం వల్ల మొటిమలు ముడుచుకుపోతాయి.



ఉప్పు వేసిన నీటి వల్ల నోటిలోని పుండ్లు నయం అవుతాయి.

షూ నుంచి వచ్చే వాసన చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఒక క్లాత్‌లో సాల్ట్ నింపి, షూలో చిలకరించాలి. రెండు మూడు గంటలు అలాగే ఉంచి తీసేయాలి. దీంతో షూ వాసన రాకుండా ఉంటుంది. అదేవిధంగా, కట్ చేసిన పండ్ల మీద ఉప్పు చల్లితే, పండ్లు రంగు మారకుండా తాజాగా ఉంటాయి.

అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. దాంట్లో ఒక స్పూన్ ఆయిల్ వేయాలి. ఆరంజ్ మీద ఉప్పును చిలకరించి గదిలో ఓ మూలన ఉంచితే నేచురల్ రూమ్ ఫ్రెష్‌నర్‌గా పనిచేస్తుంది.

ఖరీదైన క్లెన్సర్ల జోలికి పోకుండా, షింక్ క్లీన్‌గా ఉండాలంటే..నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి షింక్‌ను తుడవాలి. అంతేగాక, వంట చేసేటప్పుడు నూనె వల్ల స్టవ్‌పై హఠాత్తుగా మంట వస్తే, ఉప్పు చిలకరిస్తే తగ్గిపోతుంది.

వెనిగర్ , టేబుల్‌సాల్ట్, మైదా మూడింటిని కలిపి వెండి వస్తువులపై రుద్దితే కొత్తవాటిలా మెరిసిపోతాయి. అదేవిధంగా, నీళ్లలో చిటికెడు ఉప్పును వేసి దోమలు ఉన్న ప్రదేశంలో చల్లితే సరి.. దోమలు పరార్.

పిల్లల పెంపకమే ప్రధానం

పిల్లల పెంపకంలోనూ, వారి ఎదుగుదలలోనూ సోషలైజేషన్ చాలా ప్రధానమైన అంశం! పిల్లల్లో ప్రభావితం చేసే సోషలైజేషన్‌కు చెందిన అంశాలను మనం ఏ సంస్కృతిని చూసినా సులభంగా అర్థమవుతుంది. ఒక ప్రదేశాన్ని తీసుకోగానే ఆ ప్రదేశంలో జీవించే ప్రజల జీవన విధానం, అనుసరించే మతం, వారి అలవాట్లు, పండుగలు, వారు ఆధారపడే జీవన మార్గాలు ఇవన్నీ మనకు అక్కడ జరిగే సామాజికీకరణను తేటతెల్లం చేస్తాయి. ఆయా సమాజాలకు చెందిన సత్య సంధత, జీవన పరమార్థము, మంచితనం లేదా చెడుతనం వంటి లక్షణాలు మనకు ఇట్టే బోధపడతాయి. ఆయా దేశాల ప్రజలు అనుసరించే మతం, అభిమతం, అభిరుచులు, తదితర అంశాలు అక్కడ ఎదిగే పిల్లల్లో ఎటువంటి ప్రభావాన్ని కలిగి ఉంటాయో మనకు చెప్పకనే చెబుతాయి. అక్కడ నెలకొని ఉన్న సమాజంలో ఉన్న లోపాలు, అపవ్యవస్థలు పిల్లల మూర్తిమత్వంలో కనిపిస్తాయి. సామాజికీకరణానికి, పటిష్టమైన సమాజం ఉండాలి. లేకపోతే సామాజకీకరణ సవ్యంగా సాగదు. సామాజకీకరణ సవ్యంగా సాగని వాతావరణంలో పెరిగిన పిల్లలు రేపటి మెరుగైన సమాజాన్ని రూపొందించలేరు.



ఇంటి వాతావరణం – పరిస్థితులు

పిల్లల పెంపకంలో సమాజం ఎంత ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉంటుందో ఇంచుమించుగా అంతే బలమైన ప్రభావాన్ని కలిగి ఉండేది ఇంటి వాతావరణం. లేమిరికంతో పాటుపడే కుటుంబాలు పటిష్టమైన సామాజకీకరణను అందివ్వలేవు. తండ్రిని కోల్పోయిన కుటుంబాలు, లేదా తల్లి మరణించిన కుటుంబాలు పిల్లల్లో ఆరోగ్యకరమైన మనస్తత్వాన్ని ఏర్పరచలేవు. కోరికలు, అవసరాల నడుమ తీవ్రమైన అంతరం ఏర్పడడం పిల్లల ఎదుగుదలపై వైమనస్యాన్ని కలిగిస్తాయి. ఇది వారిలో దౌర్జన్యశీలతను పెంచుతాయి. అపరి పక్వ వాతావరణంలో పెరిగిన పిల్లలు పెద్దయ్యాక సామాజిక వినాశకర శక్తులుగా ఎదుగుతారు. నేర ప్రవృత్తిని కలిగి ఉంటారు. గర్భ దారిద్ర్యంలో పెరిగే పిల్లలు, ఐడెంటిటీ సమస్యలకు లోనై, తత్ఫలితంగా పలు వికార మనస్తత్వాలను ప్రదర్శిస్తారు. సామాజిక హోదా కచ్చితంగా పిల్లల ఎదుగుదలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ ప్రభావం కేవలం పిల్లల బాల్యదశలోనే కాదు వయోజన దశలో కూడా తీవ్రంగా ఉంటుంది. పుట్టినప్పుడు ఉన్న వాతావరణం మారే కొద్దీ వారి ప్రవర్తనలో కూడా మార్పు ఏర్పడుతుంది. గర్భ దారిద్ర్యంలో ఉన్న ఒక కుటుంబం, క్రమంగా ఆర్థికంగా పుంజుకున్న పరిణామంలో అదే కుటుంబానికి చెందిన తండ్రిని, ఆ తండ్రికి పుట్టిన కొడుకుని పరిశీలించినట్టయితే ఈ తేడా స్పష్టంగా అర్థమవుతుంది. తండ్రి చూపించే ప్రవర్తనా వైఖరి కన్నా కుమారుడు చూపించే ప్రవర్తనా వైఖరి కాస్తంత మెరుగ్గా కనిపిస్తుంది.

తండ్రిలో కనిపించే భయాందోళనలు, అభద్రతా భావన కుమారుడిలో కనిపించకపోవచ్చు. అందుచేత పిల్లల ఎదుగుదలపై ఇంతటి బలమైన ముద్రను వేసే అంశం పట్ల అవగాహన ఏర్పరచుకోవడం పిల్లల పెంపకంలో ప్రధాన పాత్రను పోషిస్తుంది.

కాంగ్రెస్ మునిగిపోతున్న నావ : టిఆర్ఎస్ నేత భానుప్రసాద్



మన తెలంగాణ / హైదరాబాద్ : కాంగ్రెస్ మునిగిపోతున్న నావ అని, మంత్రులు కాదు కదా గ్రామస్థాయిలోని వార్డు సభ్యులు కూడా టిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లబోరని టిఆర్ఎస్ ఎంఎల్‌సి టి.భానుప్రసాద్ అన్నారు. టిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ఉంటాయని కాంగ్రెస్ నాయకులు మల్లు భట్టి విక్రమార్క, డి.శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిఆర్ఎస్‌లో ఏముందని మంత్రులు ఆ పార్టీలో కొనసాగుతారని భట్టివిక్రమార్క అంటున్నారని, కాంగ్రెస్‌లో మాదిరిగా టిఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి లేదని భానుప్రసాద్ ఎద్దేవా చేశారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిఆర్ఎస్‌లో కోవర్టులు ఉన్నారని భట్టి విక్రమార్క చెప్పడం ఆయనలోని కోవర్టు లక్షణాన్ని బయటపెట్టిందని భానూప్రసాద్ అన్నారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా భట్టి విక్రమార్కతో పాటు రేణుక చౌదరి సమైక్యవాదులకు కోవర్టుగా పని చేశారని ఆయన ఆరోపించారు. అభివృద్ధి నిరోధక చర్యలు, కోర్టుకు వెళ్లడమే తప్ప కాంగ్రెస్ నేతలకు ఒక్క మంచి పని కూడా చేత కాదన్నారు. మరో 20 ఏళ్లు కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. రైతు సమన్వయ సమితిల ఏర్పాటు దేశ చరిత్రలో మైలు రాయిగా నిలవడం కాయమన్నారు.

25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలి

నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్

మన తెలంగాణ/హైదరాబాద్ : నర్సింగ్ కళాశాలలు, స్కూల్స్ విధిగా 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలె నిషా డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ కొన్ని కళాశాలలు, పాఠశాలలు పాటించడం లేదన్నారు. మరి కొన్ని కళాశాలలు, పాఠశాలలు ప్రవేశం కల్పించినప్పటికీ ప్రవేశం పొందిన వారి నుండి అధికంగా ఫీజులను వసూలు చేస్తున్నారని ఆమె ఒక ప్రకటనలో ఆరోపించారు. అధిక శాతం ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని నిషా డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఉద్యమాలకు, న్యాయ పోరాటం తప్పదని హెచ్చరించారు.

మిద్దె తోటకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

వాడకుండా ఇంటివద్దనే పండించుకోవాలనే కోరిక ఉంటుంది.. కాని ఎలానో తెలియదు..అసలు ఉద్యాన పంటలు అనే ప్రస్తావన వస్తే అంటే ఏమిటి అనేవారు కూడా లేకపోలేదు... ఖైదీలు కూడా సేంద్రియ సాగు చేసి కూరగాయలు పండించి సంపాదిస్తున్నారు తెలుసా... విత్తనం మొక్కగా పెరిగి, పూత పూసి, కూరగాయగా మారి మార్కెట్‌లోకి వచ్చి, మన ఇంట్లో కూరగా మారుతోంది. ఇందుకు అన్నదాత క్షేత్రస్థాయి కష్టం అంత ఇంత కాదు... ఇవ్వన్నీ తెలుసుకోవాలనుకుంటున్నారా... మీ పిల్లలకు చూపించాలనుకుంటున్నారా.. మీరు టెర్రస్‌పై సాగు మొదలుపెట్టలనుకుంటున్నారా అయితే నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన ఉద్యాన మహోత్సవాన్ని సందర్శించాల్సిందే..

రాష్ట్ర ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ఉద్యాన మహోత్సవంలో అందరినీ అమితంగా ఆకట్టుకుంటోంది రూఫ్ గార్డెన్. అంటే మేడపై సాగు.దీంతో తాజా కూరగాయలు, పండ్లు ఇంటి వద్దే పండించుకోవచ్చు. అలాగే సరైన ప్రణాళిక, నిర్వహణతో మంచి దిగుబడులు పొంది ప్రతి వారం కూరగాయల ఖర్చు ఆదా చేసుకోవచ్చు. తులసి, వస, అల్లం, బ్రహ్మి, మెంతి, వేప మొదలగు ఔషధ మొక్కలనూ పెంచుకోవచ్చు. ఇందుకు ఉద్యాన శాఖ విత్తనాలు 50 శాతం రాయితీతో ప్రతి ఇంటికి 2 యూనిట్లు సిల్పాలిన్ కవర్స్, మట్టి మిశ్రమం, విత్తన సంచి, వేప పిండి, వేపనూనె, పనిముట్లు అందిస్తోంది. అలాగే వర్టికల్ గార్డెన్స్‌తో ఇంటిని పచ్చదనంతో అందంగా అలంకరించుకోనే దానిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యాన మహోత్సవం ఈ నెల 31 తేదీతో ముగుస్తుంది.

ఇక్కడ ఏర్పాటు చేసిన నర్సరీలలో బంతి, చామంతి, గులాబీ వంటివి అనేక పూల మొక్కలు ఉన్నాయి. ఒకే మొక్కకు నాలుగైదు రంగుల్లో పూలు వికసించడం అమితంగా ఆకట్టుకుంటోంది. అనుకుంటే ఆరంభించవచ్చు కూడా. కూరగాయలు పండించే పాలీహౌజ్‌లు, వాటికి బిందుసేద్యం ఎలా చేస్తున్నారనేది కూడా వ్యవసాయ క్షేత్రంలో చేసినట్లుగానే ఏర్పాటు చేశారు. అలాగే సిఎం కెసిఆర్ పండించే రంగు రంగుల క్యాప్సికమ్‌లు ఎలా పండిస్తున్నారో తెలుసుకోవచ్చు.

జామ, మామిడి, బత్తాయి వంటి పండ్లు కూడా ఇంట్లోనే ఖాళీ స్థలం ఉంటే పెంచుకునే విధంగా ఉండే మొక్కలు ఇక్కడ లభిస్తున్నాయి. పండించిన కూరగాయలు, పూలు పాడవకుండా సోలార్‌తో పనిచేసే మైక్రో సోలార్ కోల్డ్ రూమ్ కూడా ఉదండోయ్. ఇంకా నూతన పద్ధతులు, సాగులో యాంత్రీకరణ విధానాలు స్టాల్స్ వేసి రైతులకు వివరిస్తున్నారు.

పట్టు వస్త్రాలు.. ధరించుకోవడమే తప్ప అసలు పట్టు ఎలా వస్తుందో చాలా మందికి తెలియదు. వస్త్రాలకు మూలమైన పట్టు పురుగుల పెంపకం, వాటి నుంచి పట్టును తీయడం, దారాలను ఒడకడం, వస్త్రాలను నేయడం వరకు అన్ని దశలను ఇక్కడ అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

జైలులోని ఖైదీలు పండించిన కూరగాయలు కూడా స్పెషల్ అట్రాక్షన్. అదీ కూడా సేంద్రియ పద్ధతిలో పండించనవి. సంగారెడ్డి, చర్లపల్లి, చంచల్‌గూడ జైలులోని ఖైదీలు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్నారు. అలాగే మన రాష్ట్రంలో 31 జిల్లాలలో ఏయే జిల్లాలో ఏ పంట సాగవుతుందో చూపే ప్రదర్శన కూడా ఆకట్టుకుంటుంది.

రైతులకు ఉద్యాన పంటల సాగు, దిగుబడి, ఇతర రైతుల విజయాలు వంటి వాటిపై ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్. వెంకట్రామ్ రెడ్డి, ఇతర అధికారులు వివరిస్తున్నారు. పంటలకు వచ్చే చీడ, పీడల నివారణపై సూచనలు ఇస్తున్నారు. రైతులు, పట్టణ వాసులు ఉద్యాన మహోత్సవాన్ని సందర్శించాలని ఆయన కోరారు.

నవంబర్‌లో ఆధార్ కేసు విచారణ

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. ఆధార్ అనుసంధానానికి తుది గడువు (సెప్టెంబరు 30)ను దివాన్ గుర్తు చేసినపుడు, ఈ గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నట్లు వేణుగోపాల్ చెప్పారు. అటార్నీ జనరల్ ఈ మేరకు ఇచ్చిన వివరణకు ఆయన సంతృప్తి చెందారు. ఆధార్‌పై లేవనెత్తిన అన్ని అభ్యంతరాలపై నిర్ణయాన్ని అంతిమంగా సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం తీసుకుంటుందని జులై 7న త్రిసభ్య ధర్మాసనం వెల్లడించింది.

అదే నెల 12న గోప్యత హక్కు సహా ఆధార్ సంబంధిత అంశాలపై ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపడుతుందని కోర్టు తెలిపింది. గోప్యత హక్కుపై నిర్ణయానికి ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ ఒక తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తూ అదే నెల 18న నిర్ణయం తీసుకుంది. కాగా, ఈ నెల 24న ఆ తొమ్మిది మంది న్యాయమూర్తుల బెంచ్ గోప్యత హక్కు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కేనంటూ తీర్పు ఇచ్చింది.

అందువల్ల ఆధార్ సంబంధిత పిటిషన్లపై ఒక యుక్తమైన బెంచ్ విచారణ చేపట్టాలని దివాన్ కోర్టును కోరారు. గోప్యత హక్కు రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ కింద జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగంగా పరిరక్షించబడుతుందని రాజ్యాంగ ధర్మాసనం తన తీర్పు సందర్భంగా పేర్కొన్న సంగతి తెలిసిందే. పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడానికి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. కాగా, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్‌ను తప్పనిసరి చేయొద్దంటూ సుప్రీంకోర్టు గతంలో కేంద్ర ప్రభుత్వానికి, దాని సంస్థలకు కొన్ని ఆదేశాలు జారీ చేసిన సంగతి విదితమే. కానీ, ఎల్‌పిజి సబ్సిడీ, జన్‌ధన్ పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థ లాంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడానికి ప్రజల నుండి ఆధార్‌ను స్వచ్ఛందంగా కోరేందుకు కేంద్రానికి అవకాశం కల్పించింది.

రైల్‌రోకో కేసు కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

ఆస్తులకు ఎలాంటి నష్టం కలుగకుండా శాంతియుతంగా ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఆనాటి ఉద్యమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఆత్మగౌరవమే ఊపిరిగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, బంగారు తెలంగాణే తమ లక్ష్యమన్నారు. తమపై పెట్టిన కేసులను కొట్టివేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

భూగర్భ జలమట్టాల పెంపునకు

రోడ్డు బ్రిడ్జిల వద్ద చెక్‌డ్యాంలు

రూ. 2782 కోట్లతో 532 చోట్ల నిర్మాణం



మన తెలంగాణ / హైదరాబాద్ : రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్లో రూ. 2782 కోట్లతో 532 బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో కొన్ని నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభించారు. చెక్‌డ్యాంలతో కూడిన వంతెనల నిర్మాణాల వల్ల భూగర్భ నీటి మట్టాలను పెంచుకోవడంతో పాటు రహదారిని మెరుగుపర్చుకున్నట్లు కాగలదని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలోనే రోడ్డు బ్రిడ్జ్‌కి ఆనుకునే ఎగువ భాగంలో నీటి నిల్వకు అనుకూలంగా ఉన్న 174 ప్రదేశాలను చెక్‌డ్యాంల నిర్మాణం కోసం ఎంపిక చేశారు. వాగుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉండడం, వంపులు లేని ప్రవాహ క్రమం, నీటి నిలువ పరిణామం ఇరువైపులా ఉండే పొలాలు ముంపునకు గురి కాకుండా ఉండేలా బ్రిడ్జిల కింద ఈ చెక్‌డ్యాం నిర్మాణ స్థలాలను ఎంపిక చేశారు. ఈ చెక్ డ్యాంల నిర్మాణం పూర్తి అయితే భూగర్భజల మట్టాలు పెరడడమే కాకుండా, వ్యవసాయానికి, పశుపక్షాదులకు సమృద్ధిగా నీటి నిల్వలను ఉంచుకోవచ్చని మంత్రి తుమ్మల నాగశ్వరరావు అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో చేపట్టిన ఇలాంటి ప్రయోగం విజయవంతం కావడంతో మన రాష్ట్రానికి చెందిన ఒక ఉన్నత స్థాయి బృందం ఆ రాష్ట్రాన్ని అధ్యయనం చేసి వచ్చింది. ఈ బృందం తెలంగాణలో నిర్మిస్తున్న బ్రిడ్జిలను పరిశీలించి 174 బ్రిడ్జిలు మహారాష్ట్ర తరహాలో చెక్‌డ్యాంలకు అనుకూలంగా ఉన్నాయని నివేదికలు సమర్పించింది. ఈ నివేదికల ఆధారంగా బ్రిడ్జిలకు ఎగువన చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలుపుతూ నిర్మాణానికి కానున్న అంచనాలను వెల్లడించింది.


జిల్లాల వారీగా చేపట్టే చెక్‌డ్యాంలు ఇవే.. : ఖమ్మం జిల్లాలో వినాయకపురం..కుక్కనూరు వంతెనపై చెక్‌డ్యాం కోసం (రూ. 6.05 కోట్లు), ఖమ్మం..బోనకల్లు వంతెనపైన (రూ. 2.30 కోట్లు), ముదిగొండ.. వల్లభి(రూ.5 కోట్లు), వైరా నదిపై రాయపట్నం..ఇల్లూరు(15.50 కోట్లు), లింగపాలెం..గురుభట్ల గూడెం(రూ.5.70 కోట్లు), సత్యనారాయణపురం..డోర్నకల్ (రూ. 3 కోట్లు), పాలేరు.. మర్రిపెడ(రూ.2.32 కోట్లు), వినాయకపురం..కుక్కనూరు(రూ.4.50), బీరాపల్లి.. బేతుపల్లి(రూ. 5.50 కోట్లు), ఆదిలాబాద్ జిల్లాలో భైంసా..పెద్దిపర్తి(రూ.7.96 కోట్లు), శాంతినగర్..సోన్(రూ. 2.40 కోట్లు), నిగ్వా.. దివిసి(2.82 కోట్లు), కుబీర్..తోటంబ రహదారిలో (రూ. 3.23 కోట్లు), తాండూర్.. భీమిని (రూ. 4.65 కోట్లు), సిర్పూర్..బెజ్జూర్ (రూ. 5.20 కోట్లు), బాసర..లక్సెట్టిపేట(రూ. 2.40 కోట్లు), ఉట్నూర్..ఆసిఫాబాద్ (రూ. 3.85 కోట్లు), నిర్మల్ పట్టణ పరిధిలో (రూ.2.85 కోట్లు), కరీంనగర్ జిల్లాలో లోకపేట..పెద్దపల్లి(3.45 కోట్లు), మహబూబ్‌నగర్ జిల్లాలో ఊకసెట్టివాగుపై వనపర్తి.. ఆత్మకూరు వద్ద(రూ. 9.25 కోట్లు), మహబూబ్‌నగర్.. మన్ననూరు(రూ. 7.75 కోట్లు), జోగులాంబ జిల్లాలో గద్వాల..రాయచూరు మార్గంలో (రూ. 4.40 కోట్లు), బొంకూరు వాగు నుండి వైఐఎ రోడ్డు వరకు (రూ. 10.60 కోట్లు), మెదక్ జిల్లాలో జాతీయ రహదారి9 నుండి సంగారెడ్డి మార్గంలో (రూ. 2 కోట్లు), నారాయణ్‌ఖేడ్..మాసాన్‌పల్లి (రూ. 2 కోట్లు), ముదుగుంతల్ చప్టా ఎక్స్‌రోడ్ (రూ.1.80 కోట్లు), మల్చెల్మ..గోవిందాపూర్ (రూ. 2.90 కోట్లు), నిజామాబాద్ జిల్లాలో జానకంపేట్..నవీపేట్.. నందిపేట మార్గాల్లో (రూ. 2.39 కోట్లు), ఘన్‌పూర్..పాత వర్ని (రూ. 2.62 కోట్లు), జుక్కల్.. మద్నూర్ (రూ. 3.05కోట్లు), రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్.. తాండూరు మార్గంలో (రూ.15.30 కోట్లు), తాండూరు..కోటపల్లి (రూ. 8.90 కోట్లు), నల్గొండ (లింగగిరి.. కమల చెరువు(రూ.7.25 కోట్లు), మహబూబ్‌నగర్..నల్గొండ రహదారిలో (రూ.3.90 కోట్లు), వరంగల్ జిల్లాలో భూపాలపల్లి..పస్రా (రూ. 7.67 కోట్లు), ఆకేరువాగు కల్లెడ..కొత్తూరు (రూ. 8.50), గొల్లచెర్ల..ముల్కపల్లి(రూ.1.80 కోట్లు), గురింపల్లి..మొరంచాపల్లి(రూ.8 కోట్లు)గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఆదాయాన్ని బట్టే బ్యాంకులలో రిజర్వేషన్లు

కేంద్రం కీలక నిర్ణయం.. ఒబిసి క్రీమీలేయర్ వర్తింపు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, బీమా కంపెనీల్లో ఉద్యోగాలను ఒబిసి క్రీమీలేయర్ పరిధిలోకి తీసుకువచ్చారు. బుధవారం ఇక్కడ జరిగిన కేంద్ర మంత్రి మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనితో పాటు మంత్రి మండలి ఆమోదించిన పలు నిర్ణయాల గురించి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులకు వివరించారు. నిర్దిష్ట ఉద్యోగాలకు సంబంధించి ఆదాయ పరిమితిని కొలమానంగా తీసుకోవడం ద్వారా సంబంధిత వ్యక్తులు ఒబిసి కోటా పరిధిలో ఈ ఉద్యోగాలు పొందడానికి వీల్లేదు. ఒబిసి క్రిమీలేయర్ పరిమితి దాటిన వారికి సంబంధిత సంస్థలలో ఒబిసి కోటాను మినహాయించే నిర్ణం తీసుకున్నారు. దీని మేరకు సామాజికంగా పురోగమించిన వర్గాలు, వ్యక్తులకు ఒబిసి కేటగిరి ప్రయోజనాలు వర్తించవు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో సమతుల్యత తీసుకువచ్చేందుకు ఈ చర్య తీసుకున్నారు. 23 ఏళ్ల క్రితం 1993లో ఉద్యోగులు, శిక్షణ వ్యవహారాల శాఖ వెలువరించిన ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలలో ఇతర వెనుకబడిన వర్గాలకు 27 శాతం కోటాను కల్పించారు. అంతేకాకుండా ఇదే సమయంలో అనుబంధంగా ఆదాయ పరిమితికి సంబంధించిన క్రిమీలేయర్‌పై కూడా నిర్దిష్ట నిబంధనావళిని రూపొందించారు. ఇప్పుడు ఈ కోటా పరిధిలోకి రావాలంటే ఖచ్చితంగా క్రిమీలేయర్ పరిధిలోనే ఉండాల్సి ఉండే విధంగా తాజాగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి అన్నికార్యానిర్వాహక ఉద్యోగాలు, బోర్డుల స్థాయి అధికారులు, మేనేజర్ల స్థాయి పదవులను ప్రభుత్వ ఉద్యోగాలలోని గ్రూప్ ఎ పోస్టులతో సమానంగా పరిగణిస్తారు. ఈ మేరకు క్రిమీలేయర్‌ను వర్తింపచేస్తారు.బ్యాంకులు, బీమా కంపెనీలు, ఇతర ఆర్థిక సంస్థలలో జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేలు 1, దానికి ఎగువ స్థాయిలో ఉండే ఉద్యోగాలను కూడా ప్రభుత్వ విభాగాలలోని గ్రూప్ ఎ ఉద్యోగాలతో సమానంగా పరిగణిస్తారు. ఇక పిఎస్‌బిలలో క్లర్కులు, ప్యూన్లు ఉద్యోగాలకు సంబంధించి ఎప్పటికప్పుడు వారి ఆదాయాన్ని సమీక్షిస్తూ ఒబిసి కోటా వర్తింపు ఉంటుంది. దీనికి సంబంధించి విస్తృత స్థాయి మార్గదర్శకాలు బ్యాంకులు, పిఎస్‌యులు, బీమా సంస్థలు తమ పాలకమండలి సమావేశంలో చర్చించుకుంటాయి. పోస్టుల వారిగా కోటాపై నిర్ణయం తీసుకుంటాయని అధికార ప్రకటనలో తెలిపారు. ఒబిసి కోటాలో ఉద్యోగాలు, ప్రయోజనాలను ఖచ్చితంగా వారివారి ఆదాయ పరిమితిని బట్టి ఖరారు చేయడం ద్వారా నిర్ధిష్టంగా మేలు జరగాల్సిన వారికి మేలు జరిగేలా చేసే ఉద్ధేశంతోనే కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.

కార్లపై 25 శాతం జిఎస్‌టి సెస్సు..ఆర్డినెన్స్‌కు ఆమోదం



మధ్యస్థ, భారీ, విలాసవంతమైన కార్లపై, ఎస్‌యువిలు, హైబ్రిడ్ కార్లపై జిఎస్‌టి సుంకాన్ని 25 శాతానికి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఈ సెస్సు 15 శాతంగా ఉంది. దీనికి సంబంధించి ఆర్డినెన్స్‌కు కేంద్ర మంత్రి మండలి బుధవారం నాటి సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ జిఎస్‌టి సుంకం పెరుగుదలతో ఇక కార్ల ధరలు మరింతగా పెరుగుతాయి. జులై 1 న జిఎస్‌టి అమలులోకి వచ్చిన తరువాత కార్ల ధరలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని సాధారణ వినియోగ వస్తువుల ధరలు జిఎస్‌టి తరువాత విపరీతంగా పెరగడం, కార్ల ధరలు జిఎస్‌టి పరిధిలో తక్కువగానే ఉండటాన్నిగమనించి ఈ హెచ్చుతగ్గులను సవరించేందుకు ఇప్పుడు ఈ కొత్త ఆర్డినెన్స్‌ను జారీ చేయనున్నారు. ఈ కార్యానిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్రాలకు సంబంధించిన పరిహారాల నిర్ధేశిత జిఎస్‌టి కి సవరణలకు వీలేర్పడుతుంది. దీనితో రాష్ట్రాలు గరిష్టంగా జిఎస్‌టి సెస్సును వసూలు చేయడానికి వీలేర్పడుతుందని జైట్లీ తెలిపారు. అయితే వివిధ రకాల వాహనాలపై ఎంత మేరకు సెస్సు ఉంటుంది? దీనిని ఎప్పటి నుంచి అమలులోకి తీసుకురావాలనేది వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరిగే జిఎస్‌టి మండలి భేటీలో ఖరారు చేస్తారని మంత్రి స్పష్టం చేశారు. జైట్లీ అధ్యక్షతన , అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం ఉన్న జిఎస్‌టి మండలి భేటీలో ఈ అంశాలన్ని పరిశీలనకు వస్తాయి.కేంద్రం ఆమోదించిన జిఎస్‌టి సంబంధిత ఆర్డినెన్స్‌కు పద్ధతి ప్రకారం ఆరు నెలల వ్యవధిలో పార్లమెంట్ ఆమోదం దక్కాల్సి ఉంది. వచ్చేపార్లమెంట్ సమావేశాలు నవంబర్ చివరిలో కానీ డిసెంబర్‌లో కానీ జరుగుతాయి.

ఇతర కీలక నిర్ణయాలు : భారత ఎన్నికల సంఘం ఇతర దేశాల ఎన్నికల సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు, ఇతర దేశాల ఇంటలిజెన్స్ సంస్థలతోమన నిఘా సంస్థల మధ్య ఏర్పడ్డ అవగావహనా ఒప్పందాలకు కేబినెట్ ఆమోదం దక్కింది. భారత్ కెనడా సంబంధాలను, దీపావళి పండుగను పురస్కరించుకుని రెండు పోస్టల్ స్టాంపులు విడుదల చేస్తారు. ఇండో ఇజ్రాయెల్, ఇండో మయన్మార్ ఎంవోయూలకు ఆమోదం.

అంతా పారదర్శకం

(మొదటిపేజీ తరువాయి)

కూడా వ్యవసాయిక ప్రధాన ప్రాంతమే కాకుండా ఇక సమశీతోష్ణ వాతావరణం ఉండడం వల్ల పంటలు బాగా పండుతాయి. రాబోయే సంవత్సరం నుంచి కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు పుష్కలంగా లభ్యం అవుతాయి. చెరువులు నింపుకుంటాం. దీని ద్వారా పూర్వపు ఏడు జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు ఉపయోగం లోకి వస్తాయి. పంటలు బాగా పండడంతో అన్ని రకాల ప్రజలు, రైతులు బాగుంటారు. పహాణీలో కూడా ఎక్కువ కాలమ్స్ అవసరం లేదు. సులభంగా కష్టతరం లేకుండా ఉండాలి. భూ రికార్డుల ప్రక్షాళన ఈ నేపథ్యంలో జరుగుతున్నది. దీని కొరకు 1,193 బృందాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క బృందానికి 9 గ్రామాలు కేటాయించి, మొత్తం రికార్డు ప్రక్షాళన, సవరణ చేయడానికి మూడు నెలల వ్యవధి పడుతుంది. మనకున్న 31 మంది జిల్లా కలెక్టర్లకు ఏ ఏ గ్రామాలు, ఏఏ టీములకు కేటాయించాలనే అధికారం ఉంటుంది. ఇది ప్రధానంగా భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం, ఇందులో భాగంగా రికార్డులలో ఉండే చిత్రవిచిత్రమైన చిక్కులు, వివాదాలు తలెత్తే అంశాలన్నీ పోవాలి. రికార్డుల్లో ఉన్న అస్తవ్యస్త లెక్కలు చిక్కులకు, వివాదాలకు దారి తీస్తున్నాయి. రైతుకు న్యాయపరమైన చిక్కులు పోయి ప్రశాంతంగా వ్యవసాయం చేసుకోవాలి'' అని సిఎం చెప్పారు.

''కోట్లాది బ్యాంకు ఖాతాలను పకడ్బదీగా నిర్వహిస్తున్న కోర్ బ్యాంకింగ్ విధానాన్ని భూ రికార్డులకు అనుసరించాలి. రికార్డుల ప్రక్షాళన జరిగిన తరువాత మార్పులకు అనుగుణంగా కంప్యూటర్ నిక్షిప్తం చేయాలి. ఆన్‌లైన్‌లో ఎటువంటి సమాచారమైన పట్టాదారులకు లభ్యం అయ్యే విధంగా రికార్డుల్లో ఉండాలి. భూ ప్రక్షాళన ఒకవైపు జరుగుతుండగా అది పూర్తయ్యే సరికి ఐటి ఆఫీసర్ల నియామకం, కంప్యూటర్లు, సర్వర్ల కొనుగోలు, కంప్యూటర్ల అనుసంధానం పూర్తి కావాలి. ముటేషన్ ప్రక్రియ రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఎప్పటికప్పుడు జరిగిపోవాలి. బ్యాంకులలో రైతుల పాస్ బుక్కులు కుదువ పెట్టించుకునే విధానం పోవాలి. ఆన్‌లైన్ రికార్డుల ఆధారంగా రైతులకు రుణాలు మంజూరు చేయాలి. భూ ప్రక్షాళన, రికార్డుల సవరణకు సంబంధించి పకడ్బందీగా త్వరితగతిన పని పూర్తి చేసే తహశీల్దార్, ఆర్‌డిఒ అధికారులకు,జిల్లా అధికారులకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు ఇవ్వాలి. త్వరలోనే రాష్ట్రంలోని తహశీల్దార్‌లందరితో సమావేశం ఏర్పాటు చేయాలి'' అని సిఎం కెసిఆర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

మిషన్ డైరెక్టర్‌గా వాకాటి కరుణ నియామకం : కుటుంబ సంక్షేమ కమిషనర్ వాకాటి కరుణ (2004 ఐఎఎస్ బ్యాచ్) ను భూ రికార్డుల ఆధునీకరణ ప్రాజెక్టు మిషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి అద నపు బాధ్యతలతో ఈ విధులను నిర్వర్తిస్తారు. ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ రూపకల్పన విధులను నాంపల్లిలోని సిసిఎల్ఎ కార్యాలయం నుంచి నిర్వహిస్తారు.

నేడు జిల్లా కలెక్టర్ల సమావేశం : ప్రగతి భవన్‌లో గురువారం 31 మంది జిల్లా కలెక్టర్లతో భూ ప్రక్షాళన అనే ఏకైక ఎజెండాతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సిఎం జిల్లా కలెక్టర్లకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు.

శిశువును బలిగొన్న వైద్యుల వైరం

(మొదటిపేజీ తరువాయి)

గైనకాలజిస్ట్ అశోక్ నైన్‌వాల్, అనస్తీసియా నిపుణుడు ఎంఎల్ టక్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని ఆస్పత్రి నిర్వహకుడు ఎస్ఎన్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ అమిలాల్ భట్ చెప్పారు. వాగ్వాదం సందర్భంగా ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఆపరేషన్ థియేటర్ నుండి బయటకు వెళ్లిపోయారని ఆయన తెలిపారు. పల్స్ రేటు పడిపోవడంతో శిశువు మరణించిందని ఆయన అన్నారు. కాగా, డెలివరీ రూమ్‌లోనే ఉన్న ఒకరు వైద్యుల బూతుల పర్వాన్ని వీడియోలో రికార్డు చేసి బయటకు వదలడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఇద్దరు వైద్యుల్లో ఒకరిని సస్పెండ్ చేశామని, మరొకరి ఫైలును జైపూర్‌లో సిబ్బంది శాఖకు నివేదించామని భట్ తెలిపారు. ఈ ఘటనపై విచారణకు ఒక కమిటీని కూడా నియమించామని ఆయన చెప్పారు. బాధిత మహిళను అనితగా గుర్తించారు. ఆమెను మంగళవారం ఉదయం ఆస్పత్రిలో చేర్పించారు. లేబర్ గదిలో ఆమెను పరీక్షించిన వైద్యుడు ఆమెకు తక్షణమే సిజేరియన్ ఆపరేషన్ చేయాలని సిఫార్సు చేశారు.

వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

గార్ల, తల్లాడ, ఘన్‌పూర్, డోర్నకల్‌లో 3, జూలూరుపాడు, కంపాసాగర్, ఇల్లందు, చేవెళ్ల, రెంజల్, పాలెం, సారంగాపూర్, జూరాల ప్రాజెక్టు, ఎంకూరు, టేకులపల్లి, నల్లగొండ, నవీపేట, అసిఫాబాద్, అశ్వాపురం, కూసుమంచి, దుమ్ముగూడెం, ఉట్నూరులో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్గి, పరిగి, నందిపేట, కొత్తగూడెం, వికారబాద్, దోమ, జక్రాన్‌పల్లి, నారాయణపేట, చింతకం, మహబూబ్‌నగర్, నిర్మల్, జడ్చర్ల, పోచంపాడు, బోథ్, కొందుర్గు తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షం కురిసింది.

రానిది తక్కువే

(మొదటిపేజీ తరువాయి)

రూ.3,421 కోట్లుగా ఉన్న ముద్రణా వ్యయం 2016–17లో రెండింతలకు పైగా అంటే రూ.7,965 కోట్లకు పెరిగిపోయింది. కొత్త రూ.500, రూ.2000 నోట్లతో పాటు ఆర్‌బిఐ ఇటీవల రూ.200 నోట్లను కూడా ముద్రించిన సంగతి విదితమే. దేశంలోని నల్లధనాన్ని వెలికితీసే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గత నవంబరు 8న రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. పాత నోట్లను బ్యాంకులు, పోస్టాఫీసుల్లో జమ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే అసాధారణ రీతిలో నగదు డిపాజిట్లు జరిగాయని ఆదాయపు పన్ను శాఖ (ఐటి) గుర్తించింది. పాత రూ.500 స్థానంలో కొత్త ఐదు వందల నోటును తీసుకొచ్చినప్పటికీ, వెయ్యి నోటు స్థానంలో మాత్రం కొత్త నోటును ప్రవేశపెట్టలేదు. దానికి బదులుగా ఇటీవల రూ.2000 నోటును ఆర్‌బిఐ కొత్తగా ముద్రించింది. అయితే నోట్ల రద్దు గణాంకాలపై ఆర్‌బిఐ విడుదల చేసిన తాజా నివేదికపై విపక్షాలు పలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. రద్దు చేసిన రూ.15.44 లక్షల కోట్లలో రూ.16000 కోట్లు అంటే 1 శాతం మాత్రమే తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి రాలేదని ఆర్‌బిఐ చెబుతోంది. ఇది నోట్ల రద్దుకు సిఫార్సు చేసిన ఆర్‌బిఐకి సిగ్గుచేటని మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం విమర్శించారు. ఆర్‌బిఐ రూ.16 వేల కోట్లు మిగుల్చుకుంది. అయితే కొత్త నోట్ల ముద్రణకు రూ.21 వేల కోట్లు వెచ్చించింది. ఈ లెక్కల వెనుక ఆర్థికవేత్తలు నోబెల్ బహుమతికి అర్హులంటూ ఆయన ఎద్దేవా చేశారు.

సర్కారు బ్లాక్‌మనీ గొప్పలకు చెక్

ఆర్‌బిఐ నివేదికపై సురవరం




న్యూఢిల్లీ : రద్దయిన పెద్దనోట్ల డిపాజిటు గురించి ఆర్‌బిఐ వెల్లడించిన నివేదికపై సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి ఓ ప్రకటన వెలువరించారు. పెద్దనోట్ల రద్దుతో భారీ స్థాయిలో నల్లధనం కనుగొన్నట్లు చేసిన ప్రభుత్వం చేసిన అసత్య ప్రచారం, కట్టుకథల గురించి ఈ వార్షిక నివేదికతోనే నిజాలు వెల్లడి అయ్యాయని తెలిపారు. ఆర్‌బిఐ నివేదిక మేరకు రద్దయిన పాత పెద్ద నోట్లలో 99 శాతం వరకూ తిరిగి ఆర్‌బిఐకి చేరడం, కొత్త కరెన్సీ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కేవలం 8900 కోట్ల రూపాయల విలువ చేసే వేయి రూపాయల నోట్లు బ్యాంకులలో జమకాలేదని వెల్లడైంది. ఇందులో సగభాగం సకాలంలో తమ వద్ద ఉన్న డబ్బులను బ్యాంకులలో జమ చేయలేని ఎన్నారైలదే అయి ఉంటుందని భావించుకోవచ్చు. సుప్రీంకోర్టు సముచిత సూచనలు వెలువరించినా ప్రభు త్వం పేదలు, కష్టపడి సంపాదించుకున్న వారి డబ్బును జమచేసుకునే అవకాశం కల్పించలేదు. పాతనోట్లకు , కొత్త కరెన్సీకి మధ్య వ్యత్యాసమే నల్లధనంగా భావించుకుంటే , ఇక ప్రభుత్వం వెలికితీసినట్లుగా చెపుతున్న భారీ నల్లధనం ఎక్కడుంది? శేఖర్ రెడ్డి ,ఇతరుల కన్నా ముందుగానే తమ వద్ద ఉన్న పాతనోట్లను మార్చుకున్న వారి నల్లధనం సంగతి ఏమైందని సురవరం ప్రశ్నించారు. ఉగ్రవాదులకు అందే నిధులను ఆటకట్టామని చెపుతు న్న మొత్తం ఎక్కడికి వెళ్లింది? కరెన్సీలో ఇది ఒకటి అరశాతంగానే ఉందా? ఇక ఆర్‌బిఐ కొత్త నోట్ల ముద్రణకే 7965 కోట్ల వ్యయం అయింది. ఇది భారీ స్థాయి వృధాగానే మా రింది. పెద్దనోట్ల రద్దుతో ప్రభుత్వం చెపుతున్నట్లుగా బ్లాక్‌మనీ వెలికితీత ఏమీ జరగలేదని ఆర్ బిఐ నివేదికతో స్పష్టం అయిందని , అంతేకాకుండా నోట్లరద్దును ఉన్నట్లుండి చేపట్టడంతో సామాన్యులు నానా కష్టాలు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఈ అవిజ్ఞత చర్యకు ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి జైట్లీ జాతికి క్షమాపణ చెప్పాల్సి ఉందని సురవరం స్పష్టం చేశారు.

సైన్యంలో భారీ సంస్కరణలు

(మొదటిపేజీ తరువాయి)

సిఫార్సులు చేసింది. అన్ని పక్షాలతో సంప్రదింపులు జరిపిన తర్వాత వాటిలో రక్షణ శాఖ 65 సిఫార్సులకు పచ్చ జెండా ఊపిందని జైట్లీ చెప్పారు. వాటిని డిసెంబరు 31, 2019 కల్లా అమలు చేస్తామని ఆయన అన్నారు. ఆర్మీ సామర్థ్యాన్ని పెంచే దిశగా సాయుధ దళాల్లోని వివిధ



విభాగాల్లో సాధారణ పౌరులను తిరిగి నియమించుకుంటామని ఆయన చెప్పారు. ఆర్మీలో సంస్కరణలకు రక్షణ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్‌కు తెలిపామని ఆయన అన్నారు. షెకాత్కర్ కమిటీని గతేడాది మేలో నియమించగా అది తన సిఫార్సుల నివేదికను డిసెంబరులో సమర్పించింది. తొలిదశ సంస్కరణల్లో భాగంగా...అధికారులు, జూనియర్ అధికారులు, ఇతర హోదా అధికారులతో పాటు పౌరులకు సంబంధించి దాదాపు 57 వేల పోస్టులను తిరిగి భర్తీ చేయడం జరుగుతుంది. సిగ్నళ్ల వ్యవస్థలను ఆదర్శంగా తీర్చిదిద్దడం, శాంతియుతమైన ప్రాంతాల్లోని మిలిటరీ ఫాంలు, సైనిక తపాలా కార్యాలయాల మూసివేత లాంటివి కూడా చేపట్టనున్నారు. 39 మిలిటరీ ఫాంలను దశలవారీగా మూసివేయడానికి భద్రతపై ఏర్పాటు చేసిన కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మూసివేత ప్రక్రియ మొదలైందని రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు గుమాస్తా ఉద్యోగాలు, డ్రైవర్ల నియామకాలకు సంబంధించిన ప్రమాణాలను కూడా మరింత కఠినతరం చేయనున్నారు.



అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం : మంత్రి మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్/ఎల్‌బినగర్ : దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మాత్యులు పి. మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలాపూర్ మండలంలోని మల్లాపూర్‌లో రూ.233 కోట్ల 55 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మంత్రి పట్నం మహేందర్ రెడ్డి చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానిక శాసన సభ్యులు తీగల కృష్ణారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువిశాలమైన 15 ఎకరాల స్థలంలో 25 బ్లాక్‌లతో 2700 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేస్తున్నామని, ఇట్టి నిర్మాణాలు కేవలం 11 నెలల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఇందులో ఆసుపత్రి, షాపింగ్ మాల్, కమ్యూనిటీ హాల్, కృష్ణానీటి సరఫరా జరుగుతుందన్నారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యులు విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రతి సంవత్సరం 21.7 శాతం వృద్ధి రేటును సాధించి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఎంఎల్‌ఎ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఏమి చేయాలనేది తమకు తెలుసని, కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటూ అసత్య ప్రకటనలు చేస్తున్నారన్నారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు మోక్షమెన్నడో!

- రెండేళ్లయినా ముందుకు సాగని నిర్మాణపు పనులు
- సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులు
- అటువైపు కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు, అధికారులు
- పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టండి : రైతులు



మన తెలంగాణ/ దామరచర్ల : తెలంగాణలో విద్యుత్ కొరత సమస్యను అధిగమించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ. 25,099,42 కోట్ల వ్యయంతో 4000 మెగావాట్ల సామర్థ్యం కల్గిన యాదాద్రి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ముఖ్యమంత్రి కెసిఆర్ 2015 జూన్ 8న శంకుస్థాపన చేసి రెండేళ్లు గడిచినా నిర్మాణ పనుల ఊసేలేదు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో 800 మేగావాట్ల సామర్థ్యం కల్గిన బొగ్గు ఆధారిత సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటు 5 యునిట్ల ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటునకు ప్రభుత్వం నిర్ణయించింది.

2015లో పైలాన్ ఆవిష్కరణ

అనుకున్నదే తడవుగా 2015 జనవరి 2న ఎన్టిపిసి ఆధ్వర్యంలో జెన్‌కోతో కలిసి పరిశ్రమ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై ఓ బృందాన్ని ప్రభుత్వం నియమించింది. దీంతో 2015 జనవరి 17న 10 గ్రామంచాయతీల పరిధిలోని అటవీ భూముల బదలాయింపు కోరుతూ గ్రామ సభలు ఆమోదం తెలిపాయి. 2015 ఫిబ్రవరి 23న ఏరియల్ సర్వేకు వచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ అదే రోజు విద్యుత్ రంగ నిపుణులతో చర్చించి 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఫిబ్రవరి 26 నుంచి జిపిఎస్ విధానంతో వారం రోజుల పాటు అటవీభూముల ప్రాథమిక సర్వే నిర్వహించి, 4,676 ఎకరాల అటవీ భూమిని సేకరించి అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. సర్వే సందర్భంగా అధికారులను బాధిత గ్రామాల ప్రజలు అడ్డుకుని తమ నిరసన తెలిపారు. ఒక దశలో పైలాన్ పనులను పరిశీలించేందుకు వచ్చిన టిజెన్‌కో ఉన్నతాధికారులను బాధిత రైతులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. 2015 జూన్ 8న ముఖ్యమంత్రి పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించి, శంకుస్థాపన చేశారు.

వాస్తవ సరిస్థితులపై అధ్యయనం

2015 డిసెంబర్ 5న కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన 5 సభ్యుల బృందం డిఆర్ బాబు నేతృత్వంలో ప్లాంట్ పరిధిలో వాస్తవ సరిస్థితులను అధ్యయనం చేసేందుకు పరిశ్రమ ప్రతపాధిత ప్రాంతాన్ని పరిశీలించింది. జెన్‌కో అధికారులను నుంచి వివరాలు సేకరించడంతోపాటు పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలతో సమీపంలోని అన్నమేరు వాగు, కృష్ణా నదికి ప్రమాదం ఉంటుందా అనే కోణంలో నిజాలు తెలుసుకునేందుకు కాలినడకన 6 కిలోమీటర్లు నడిచి నది పరిసరాలను పరిశీలించారు. 2016 జనవరిలో పరిశ్రమ నీటి అవసరాల కోసం 6 టిఎంసిల నీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు , ఇంటికో ఉద్యోగం, ఇండ్లు కోల్పోతున్న సుమారు 1,300 మంది రైతులకు విడతల వారీగా పరిహారం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావడంతో పరిశ్రమకు వ్యతిరేకంగా ఉన్న బాధితులు, ప్రజలు అనుకూలంగా మారారు.

డిపిఆర్‌పై అభ్యంతరాలు

2016 జనవరి మొదటి వారం నుంచి ప్రాథమిక పనులను బిహెచ్ఇఎల్ నిర్మాణరంగ సంస్థ చేపట్టి 11 డ్రిల్లింగ్ యంత్రాలతో రాయి, మట్టి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపింది. ఇదిలా ఉండగా 2016 మేలో కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ టిజెన్‌కో అందజేసిన ప్రాజెక్ట్ డిపిఆర్(డిటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను పరిశీలించి తీవ్రంగా తప్పుబట్టింది. డిపిఆర్‌లోని 16 అంశాలపై అభ్యంతరాలను వ్యక్తం చేసింది. 650 పేజీల నివేదిక తమిళనాడులోని బస్తాలు తయారు చేసే ప్రాజెక్ట్ నకలుగా ఉందని, బొగ్గు రవాణాపై స్పష్టతలేదని, ప్రాజెక్ట్‌కు అవసరమైన నీటి లభ్యతపై పలు సందేహాలను వ్యక్తం చేసింది. కాలుష్యం బారిన పడే ప్రాంతాల పరిరక్షణ చర్యలు, విపత్తులను అధిగమించేందుకు తీసుకునే చర్యలపై పర్యావరణ కమిటీ అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో యాదాద్రి పనులు నిలిచిపోయాయి.

సర్వం కోల్పోయిన బాధితులు

అరకొర నష్టపరిహారంతో భూమి నుంచి వైదొలిగిన రైతు కుటుంబాలకు చేసేందుకు పనులులేక చేతిలోని పరిహారం డబ్బులు ఖర్చై ఉపాధికోసం వెతుకుంటున్నారు. ఏ పట్టా లేకుండా పోడు వ్యవసాయం చేసుకునేవారికి ఇంత వరకూ పరిహారం అందలేదు. అయితే పరిహారం అందని బాధిత రైతులు సుమారు 200 మందికి చెందిన సుమారు 700 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 5,07,000ల వంతున పరిహారం అందజేయనున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. మోదుగులతండా , కపూరాతండాలో జనావాసాలు కోల్పోతున్న 110 కుటుంబాల వారికి పునరావాసం కల్పిస్తామని, నూతనంగా గృహాలు నిర్మించుకున్న ప్రాంతానికి రవాణా ఖర్చులు సైతం ఇస్తామని చెప్పగా పనులు మొదలుకాకపోవడంతో వారిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఇదిలా ఉంటే యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మానానికి సంబంధించి ఇటీవల పర్యావరణ అనుమతు వెలువడిన నేపథ్యంలో గత నెల 25న ముఖ్యమంతి కెసిఆర్ బిహెచ్ఇఎల్ అధికారులతో ఢిల్లీలో సమావేశమై ప్లాంట్‌కు సంబంధించిన అన్ని యూనిట్లను త్వరలో ప్రారంభించి, అనుకున్న సమయానికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించినందున పరిహారం ఇవ్వని రైతులకు పరిహారం అందించి, త్వరలో నిర్మాణ పనులను మొదలుపెట్టన్నుట్లు అధికారులు చెబుతున్నారు.

పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టండి

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టేందుకు పర్యావరణ అనుమతులు వచ్చి పనులను చేపట్టనున్న తరుణంలో ప్లాంట్ కింద భూములు, ఇండ్లు కోల్పోతున్న తమకు పరిహారం అందజేశాకే నిర్మాణం పనులు చేపట్టాలని పలువురు బాధిత రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రానికి వెలుగొస్తుందేమోకాని మా జీవితాల్లో చీకటి రావడం ఖాయమని, తమకు నష్ట పరిహారం ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని కపూరాతండాకు చెందిన రూపావత్ బిచ్చానాయక్ వాపోయాడు. థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణంలో ఏ ఆధారంలేని అటవీభూముల్లో సేద్యంచేసుకుంటూ జీవిస్తున్న రైతులకు పట్టా భూములతో సమానంగా పరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలి. పునావాస కేంద్రాలకు వారిని తరలించి అనువైన చోట ఇండ్లు కట్టించి ఇవ్వాలని సిపిఐ దామరచర్ల మండల కార్యదర్శి రాయికిందిసైదులు డిమాండ్ చేశారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి సినారె

మన తెలంగాణ/ హైదరాబాద్/ఉస్మానియా యూనివర్శిటీ: నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో బహుముఖ ప్రజ్ఞాశాలిగా సినారె ఎదిగారని ఉస్మానియా యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్. రామచంద్రం పేర్కొన్నారు. ఓయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ''సినారె సాహితీ వైభవం'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 57లో బుధవారం ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఓయూ తెలుగుశాఖకు సినారె వల్ల ప్రాముఖ్యత వచ్చిందని, సినారె సాహిత్య ఆశయాలను సాధించేందుకు సాహిత్యకారులు కృషి చేయాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్. గోపి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సినారె విశిష్టతను వివరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ సినారె సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. సదస్సుకులో ఓ.యూ తెలుగు శాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.టి.కృష్ణారావు, డా. పగడాల నాగేందర్, కళాశాలల ప్రొఫెసర్లు, సాహిత్యకారులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.



'డబుల్'కు టెండర్ల పూర్తి

- రూ. 8, 225 కోట్ల వ్యయంతో లక్ష ఇండ్ల నిర్మాణానికి ముందడుగు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ.8, 225 కోట్ల వ్యయంతో లక్ష డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో ప్రధాన అంకం బుధవారం పూర్తయింది. మొత్తం లక్ష డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించడం ద్వారా మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) నూతన అధ్యయనం సృష్టించింది. ప్రస్తుతం ఉన్న 33 బస్తీలను ఖాళీ చేయించి తిరిగి కొత్త ఇళ్లను నిర్మిస్తున్నారు. ఈ బస్తీలలో కొందరికి 30 గజాలు, మరి కొందరికి 150 గజాల వరకు స్థ లాలు ఉన్నవారు కొందరు కోర్టును ఆశ్రయించడంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో ప్రత్యేక స్వచ్ఛ సంస్థలను నియమించి, బస్తీవాసులను ఒప్పించడంలో జిహెచ్‌ఎంసి సఫలీకృతమవడంతో ఈ ఇళ్ల నిర్మాణాకు అడుగుపడింది.

మిషన్ భగీరథకు 134 దేశాల ప్రశంసలు

మనతెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : స్వీడన్‌లో మంగళవారం నుంచి జరుగుతున్న 'వరల్డ్ వాటర్ వీక్–2017' సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. దానకిశోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండి తెలంగాణ ప్రజలందరికీ ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన గోదావరి, కృష్ణ జలాలను అందించే మిషన్ భగీరథ ప్రాజెక్ట్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంతి కెసిఆర్ ఈ ప్రాజెక్ట్‌ను రూపకల్పన చేసినట్లు ఎండి వివరించారు. ఈ సందర్భంగా ఒక రాష్ట్ర ప్రభుత్వం 43 వేల కోట్లు ఖర్చుతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి చేస్తున్న కృషిని వివిధ దేశాల ప్రతినిధులు ప్రశంసించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మన తెలంగాణ/ఘట్‌కేసర్ : డిసిఎం ఢీకొని బి–ఫార్మసీ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఎదులాబాద్‌లోని గుర్రం బాల్‌నర్సింహ్మా కళాశాలలో బి–ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువున్న బల్ల రాజేశ్(19) బుధవారం తన స్నేహితుడు గడ్డం ప్రసన్నకుమార్‌తో కలసి బైక్ (టిఎస్07ఇబి1644)పై నల్లనర్సింహ్మారెడ్డి కళాశాలలో పరీక్ష రాసి తమ కళాశాలకు తిరిగి వస్తుతుండగా కొర్రెముల సమీపంలోని డప్పోనివాగు వంతెన వద్ద ప్రమాదవశాత్తు ఎదురుగా వచ్చిన డిసిఎం (ఎపి37వి7736) ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలైన రాజేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, ప్రసన్నకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు రాజేశ్ నిజామాబాద్ జిల్లా పద్మానగర్ కాలనీకి చెందినవాడు కాగా, ఘట్‌కేసర్ మైసమ్మగుట్టలోని ఎస్‌సి బాలుర హాస్టల్‌లో ఉంటు న్నాడు.

మిషన్ భగీరథ టార్గెట్ డిసెంబర్ 31

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



మన తెలంగాణ/ వరంగల్‌బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పనులను డిసెంబర్ 31వరకు పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను, మిషన్‌భగీరథ ఏజెన్సీలను ఆదేశించారు. 2018 జనవరి 1న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధి జలాలను అందించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నారని అందుకు అనుగుణంగా అధికారులు, ఏజెన్సీలు పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. బుధవారం హన్మకొండ నందన గార్డెన్‌లో మిషన్ భగీరథ, చేప పిల్లల పంపిణీ, రైతు సమన్వయ సమితి ఏర్పాట్లపై ఉపముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాల వారిగా,నియోజకవర్గాల వారిగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఏజెన్సీలను మిషన్ భగీరథలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఎండి పనులు నత్తనడక జరగడంపై సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు, మిషన్ భగీరథ అధికారులపై కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌ఎండి పనులపై వరంగల్ అర్బన్ కలెక్టర్, కమిషనర్ కలసి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ వారం వారం అధికారులతో, ప్రతి 15రోజులకు ఒకసారి ప్రజాప్రతినిధులతో, నెలకు ఒకసారి ఓవరాల్‌గా సమీక్ష నిర్వహించుకుంటూ పనుల వేగం పెంచాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ గ్రామాలలో సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ, మండల రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయాలని కడియం వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. పార్టీలకు అతీతంగా ఎవరైతే వ్యవసాయం చేస్తారో వారినే కమిటీలో సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. సెప్టెంబర్ 3 నుంచి చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి వారం పది రోజులలో పూర్తి చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శాసన మండలి విప్ బొడకుంటి వెంకటేశ్వర్లు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ, పార్లమెంటు సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, పసునూరి దయాకర్, ఎంఎల్‌ఎలు అరూరి రమేష్, దాస్యం వినయ్‌భాస్కర్, కొండా సురేఖ, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బానోత్ శంకర్‌నాయక్,వడితల సతీష్, శాసన మండలి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్లు కాట అమ్రపాలి, ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఆకునూరి మురళీ, ప్రీతి మీనా, శ్రీదేవసేనాతోపాటు వ్యవసాయశాఖ జెడిలు, మత్స్యశాఖ అధికారులు, మిషన్ భగీరథ ఎస్‌ఇ ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతు సమితులతో అన్నదాతలకు మేలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ/ మేడ్చల్ జిల్లా: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, బతుకమ్మ చీరల పంపిణీ, మిషన్ భగీరథపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఈ సమీక్షలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ఎకరానికి రూ.8,000 నగదుతో పాటు, రానున్న రోజుల్లో రైతాంగానికి పలు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేందుకు రైతు సమన్వయ సమితులు దోహదం చేస్తాయని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమితులను ఏర్పాటు చేస్తారని చెప్పారు. ప్రతి కమిటీలో 30 శాతం మహిళా రైతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరుకు జిల్లాలోని 104 గ్రామాలలో ఇంటింటికి నల్లాల ద్వారా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దసరా కానుకగా జిల్లా వ్యాప్తంగా 6,00,435 మందికి చీరల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఎంవి రెడ్డి మాట్లాడుతూ రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు సమయం తక్కువగా ఉన్నందున విధి విధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రైతు సమగ్ర సర్వే ద్వారా జిల్లాలో 15,926 మంది రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. గ్రామ స్థాయిలో తహసీల్దార్, ఎంపిడిఒ ఆధ్వర్యంలో, మండల స్థాయిలో ఆర్‌డిఒ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా స్థాయిలో కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో కమిటీల సభ్యుల ఎంపిక ప్రక్రియను చేపడతామన్నారు. బతుకమ్మ చీరల పంపిణీకి ప్రజా ప్రతినిధుల సహాకారం అవసరమని అన్నారు. చీరలు భద్రపరిచేందుకు వీలుగా జిల్లాలో కీసర, కాప్రా, కుత్బుల్లాపూర్ ప్రాంతాలలో గోదాములను గుర్తించామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చీరల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కులవృత్తులకే ప్రాధాన్యం

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మన తెలంగాణ/ సంగారెడ్డి ప్రతినిధి : కులవృత్తుల అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని పశుసంవర్ధక శాఖమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ జలాశయంలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి వెళ్తూ.. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపపిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ సిఎం మానస పుత్రిక పథకాలని, గత సంవత్సరం 22కోట్ల చేప పిల్లలను జలాశయాలలో వదిలితే ఈ సంవత్సరం 70 కోట్ల వరకు వదలడం జరుగుతుందన్నారు. రానున్న రెండు,మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా చేపలు దొరుకుతాయంటే తెలంగాణ అని చెప్పుకునేలా ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. అంతేకాకుండా ఇప్పటికే 15,35,709 గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సంగారెడ్డిలో రూ. 50లక్షలు, సదాశివపేటలో రూ. 25లక్షలతో చేపల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ రాజమణి, జెసి వాసం వెంకటేశ్వర్లు, ఫిషరీష్ కమిషనర్ సువర్ణ, ఎంఎల్‌ఎ చింతాప్రభాకర్ పాల్గొన్నారు.



'భగీరథ' అద్భుతం

- గజ్వేల్‌లో నిర్మాణ పనులను సందర్శించిన మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం



మన తెలంగాణ/ గజ్వేల్ : తెలంగాణ రాష్ట్రానికే ప్రతిష్టాత్మకంగా ఉన్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ మిషన్ భగీరథ పథకం అమలు దేశంలోని వివిధ రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. ఒక రకంగా ఈ పథకం ఆదర్శనీయంగా మారింది. ఈ దశలో వివిధ రాష్ట్రాల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికే ఇక్కడకు వచ్చి సందర్శించిపోతున్నారు. ఈనేపథ్యంలో బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జల నిగమ్ ఇంజినీర్ల అధికార బృందం గజ్వేల్‌ను సందర్శించింది. గజ్వేల్‌కు సమీపంలోని కోమటిబండ గుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్ నిర్మాణాలను, వివిధ పంపు, సంపు హౌజ్‌లను, భారీ ఓవర్‌హెడ్ ట్యాంకులను ఈ బృందం పరిశీలించింది. ప్రజల తాగునీటికి ఇంత భారీ ఖర్చుతో పాటు నిరంతరం నీటిని అందుబాటులో ఉంచుతూ ఇంటింటికీ సరఫరా చేయటం అద్భుతమైన విషయమని అధికారుల బృందం ప్రశంసించింది. నీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలను మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి ప్రధాన సంపుల నుంచి నీటిని ఆయా మండలాల గ్రామాలకు పైపుల ద్వారా ఎలా పంపిస్తున్నదీ స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ డిఇఇ రాజయ్య వివరించారు .ఈ పథకం లక్ష్యాలను, ప్లాంటు సామర్థ్య తదితర వివరాలను జిల్లా ఈఈ విజయ్ ప్రకాష్ వారికి తెలిపారు. బుధవారం గజ్వేల్ మిషన్ భగీరథ ప్లాంటును పరిశీలించిన మధ్య ప్రదేశ్ ప్రభుత్వ ఇంజినీర్ల అధికారుల బృందంలో జబల్‌పూర్ ఎస్‌ఈ ఎస్‌కె శ్రీవాత్సవ, భూపాల్ జనరల్ మేనేజర్(ఇఇ) రఘువంశి, ప్రధాన కార్యాలయానికి చెందిన మరో జనరల్ మేనేజర్ పంకజ్ విజయ్ వార్గియాతో పాటు ఎఈలు జిపి గనోటే, సంజయ్ వాధ్వా,శ్యాంవర్మ, ప్రశాంత్ శర్మ, విశాల్ మెహ్రా, ప్రదీప్ సిన్హా తదితరులున్నారు.

హాంకాంగ్‌లోనూ అదరగొడుతోంది

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్ నటించిన 'దంగల్' మూవీ ఏ రేంజ్‌లో సంచలనం సృష్టించిందో తెలిసిందే. దేశంలోనే అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన చిత్రంగా ఇది రికార్డు సృష్టించింది. 'బాహుబలి2'ను దాటేసి భారీ కలెక్షన్లను సాధించింది ఈ చిత్రం. చైనాలో 100 మిలియన్ డాలర్లు వసూలు చేసిన తొలి విదేశీ చిత్రంగా సెన్సేషనల్ రికార్డును కూడా నమోదు చేసుకుంది దంగల్. ఇప్పుడు ఈ సినిమాను హాంకాంగ్‌లో రిలీజ్ చేయగా అక్కడ కూడా అదరగొట్టేస్తోంది. ఈ నెల 24న హాంకాంగ్‌లో ఈ సినిమాను రిలీజ్ చేశారు. పెయిడ్ ప్రివ్యూల రూపంలో 85 వేల డాలర్లు వసూలు చేసిన ఈ చిత్రం శుక్రవారం రోజున 1.09 లక్షల డాలర్లను కలెక్ట్ చేసింది. ఆతర్వాత శనివారం నాటికి అన్ని చోట్ల థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ అయిపోయాయి. శనివారం నాడు 2.15 లక్షల డాలర్లు, ఆదివారంనాడు 2.15 లక్షల డాలర్లు వసూలు చేసి మొత్తంగా వీకెండ్ ముగిసే సరికి 7.02 లక్షల డాలర్ల మార్క్‌ను అందుకుంది 'దంగల్'. మరికొన్ని రోజుల్లో ఈ సినిమా మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకోవడం ఖాయమని అంటున్నారు.


అమీర్‌ఖాన్


ఎన్‌టిఆర్

సెప్టెంబర్ 10న ట్రైలర్ లాంచ్

వరుస విజయాలతో దూసుకుపోతున్న ఎన్‌టిఆర్ హీరోగా అతని సోదరుడు కళ్యాణ్‌రామ్ నిర్మిస్తున్న చిత్రం 'జై లవ కుశ'. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఎన్‌టిఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్నాడు. కె.ఎస్.రవీంద్ర (బాబీ) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాశీఖన్నా, నివేద థామస్ కథానాయికలు. ఇటీవల విడుదలై సినిమా టీజర్‌లకు సోషల్ మీడియాలో రికార్డు స్థాయి వ్యూస్ వచ్చాయి. ఈ చిత్రం ఆడియోను సెప్టెంబర్ 3న డైరెక్ట్‌గా మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. తొలుత భారీ స్థాయిలో ఆడియో ఫంక్షన్‌ను ప్లాన్ చేసినప్పటికీ... భారీ వర్ష సూచన, వినాయక నిమజ్జనంలో పోలీస్ శాఖ నిమగ్నమై ఉండటంతో ఆడియోను నేరుగా మార్కెట్లోకి విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించాడు. అయితే సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో అభిమానుల మధ్య 'జై లవ కుశ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చిత్ర నిర్మాత కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ ''సోదరుడు ఎన్‌టిఆర్‌తో 'జై లవ కుశ' చిత్రాన్ని నిర్మిస్తుండటం ఎంతో ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో, అత్యుత్తమ సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నాం. ఆడియోను నేరుగా మార్కెట్లోకి విడుదల చేస్తున్నాం. కానీ ట్రైలర్‌ను మాత్రం అభిమానుల మధ్య సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో విడుదల చేస్తాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః చోటా కె.నాయుడు, ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు, ఆర్ట్ః ఏ.ఎస్.ప్రకాష్, విజువల్ ఎఫెక్ట్స్ః అనిల్ పాదూరి.

వెంకటేశ్-విజయ్ దేవరకొండల మల్టీస్టారర్



సీనియర్ స్టార్ వెంకటేష్ నటించిన 'గురు' మూవీ రిలీజ్ అయి నాలుగు నెలలు దాటిపోయింది. అయితే ఇప్పటివరకు ఆయన కొత్త సినిమా విషయంలో అధికారిక ప్రకటన రాలేదు. రెండు, మూడు ప్రాజెక్టుల గురించి చర్చలు జరిగినా అవేమీ వర్కవుట్ కాలేదు. ఇప్పుడు వెంకటేష్ హీరోగా కొత్త సినిమా ఖాయమైందని అంటున్నారు. అది కూడా ఓ మల్టీస్టారర్ మూవీ కావడం విశేషం. సూపర్ స్టార్ మహేశ్‌తో 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమా చేసి మల్టీస్టారర్ ట్రెండ్‌కు తెరతీసిన వెంకటేష్... ఆతర్వాత పవన్‌కళ్యాణ్‌తో కలిసి 'గోపాల గోపాల' సినిమా చేశారు. ఇప్పుడు యంగ్ హీరో విజయ్ దేవరకొండతో కలిసి వెంకటేష్ ఓ సినిమాలో నటించేందుకు ఓకే అన్నాడని తెలిసింది. భాస్కర్ దర్శకత్వం వహించే ఈ చిత్రానికి ఇప్పటికే స్క్రిప్ట్ సిద్ధం కాగా.. త్వరలో సినిమా గురించి ప్రకటన కూడా వచ్చే అవకాశం ఉందట. అయితే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన 'అర్జున్ రెడ్డి' రిలీజ్‌కు ముందే విజయ్ దేవరకొండ ఈ సినిమా చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. సినిమాలో ఇద్దరు హీరోలకు తగిన రీతిలో ప్రాధాన్యం ఉంటుందట. ఇప్పుడు అర్జున్ రెడ్డి చిత్రం ఘన విజయం సాధించడంతో ఈ మల్టీస్టారర్ మూవీలో విజయ్ దేవరకొండ స్పెషల్ అట్రాక్షన్ కానున్నాడు. రాక్‌లైన్ వెంకటేశ్ ఈ మూవీకి నిర్మాతగా వ్యవహరించనున్నాడు.


బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే

పొల్లాచ్చి వెళ్తున్న బెల్లంకొండ చిత్రం

శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా ఓ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు అభిషేక్ నామా. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో షూటింగ్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర బృందం త్వరలో పొల్లాచ్చి వెళ్లనుంది. అక్కడ ఒక పల్లెటూరి సెట్‌లో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత అభిషేక్ నామా మాట్లాడుతూ ''బలమైన కథ, కథనాలతో శ్రీవాస్‌బెల్లంకొండ శ్రీనివాస్‌ల కాంబినేషన్‌లో టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. నెక్స్ట్ పొల్లాచ్చిలో 15 రోజుల భారీ షెడ్యూల్ జరుగనుంది. అందుకోసం విండ్ టర్బైన్స్‌తో కూడిన ఓ భారీ సెట్‌ను రూపొందించాం.

పీటర్ హెయిన్స్ నేతృత్వంలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశాం. శ్రీవాస్ దర్శకత్వంలో ఈ చిత్రం డిఫరెంట్ మూవీగా తెరకెక్కుతోంది. దాదాపు 40 శాతం షూటింగ్ పూర్తయింది'' అని అన్నారు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెల కిషోర్, రవికిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఆర్థర్ ఎ.విల్సన్, మ్యూజిక్ః దేవిశ్రీ ప్రసాద్, ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వరరావు, ఆర్ట్ః ఏ.ఎస్.ప్రకాష్.

'వివేకం' దర్శకుడితో నాలుగో సినిమా


అజిత్

తమిళ్ స్టార్ హీరో అజిత్ నటించిన వివేగం (తెలుగులో వివేకం) మూవీ ఇటీవల విడుదలై రికార్డు కలెక్షన్లను వసూలు చేస్తోంది. ఈ చిత్రం అతి వేగంగా 100 కోట్ల మార్క్‌ను అందుకొని కోలీవుడ్‌లో కొత్త రికార్డును సృష్టించింది. వివేగం చిత్రం అభిమానులను ఇంతగా ఆకట్టుకోవడానికి కారణం అందులో ఉన్న యాక్షన్ కంటెంట్. రెండున్నర గంటల సినిమాలో గంటన్నరకు పైగా యాక్షన్ ఎపిసోడ్స్‌ను పిక్చరైజ్ చేయడం విశేషం. యాక్షన్ సీన్లు అన్నీ హాలీవుడ్ రేంజ్‌లో తీర్చిదిద్దడంతో ప్రేక్షకులను మైమరపిస్తున్నాయి. వీరం, వేదాళం చిత్రాల తర్వాత దర్శకుడు శివతో వివేగం చిత్రాన్ని చేశాడు అజిత్. ఇవన్నీ మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు అదే ఊపులో అజిత్‌శివ కాంబినేషన్‌లో నాలుగో సినిమా రాబోతుందని తెలిసింది. అయితే ఈసారి మాత్రం యాక్షన్ సినిమా కాకుండా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కానీ చారిత్రాత్మక చిత్రం కానీ చేయాలని భావిస్తున్నారట అజిత్, శివ. చారిత్రాత్మక చిత్రం చేసేందుకే ఎక్కువగా అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్ టాక్. ప్రస్తుతం అజిత్ కోసం స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నాడు శివ. ఈ స్క్రిప్ట్ రెడీ అయ్యే లోగా అజిత్ మరో సినిమా చేస్తాడు.

'సాహో'లో మందిరా బేడి



'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేస్తున్న సినిమా కావడంతో 'సాహో'పై దేశంలోని అన్ని చిత్ర పరిశ్రమల ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ప్రేక్షకుల భారీ అంచనాలను దృష్టిలో పెట్టుకొని ఫిల్మ్‌మేకర్స్ సినిమాను భారీ స్థాయిలో... అందరూ మెచ్చే విధంగా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ తారాగణంలో ఎక్కువ మందిని బాలీవుడ్ నుండే తీసుకుంటున్నారు. ఇప్పటికే హీరోయిన్‌గా శ్రద్ధాకపూర్‌ను తీసుకోగా విలన్‌లుగా నీల్ నితిన్ ముఖేష్, చంకీ పాండే, జాకీ ష్రాఫ్, టిన్ను ఆనంద్‌లను ఎంపికచేశారు. ఇప్పుడు మరో బాలీవుడ్ నటి మందిరా బేడీని కూడా ఈ సినిమాలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ భామ నెగటివ్ పాత్రలో కనిపిస్తుందని సమాచారం. అయితే ఈ విషయంపై 'సాహో' టీమ్ నుండి ప్రకటన రావాల్సి ఉంది. సుమారు 150 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్లు పనిచేస్తున్నారు. 'రన్ రాజా రన్' ఫేం సుజిత్ సింగ్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

భయపెట్టబోతున్న షాలిని



స్వర్ణ ప్రొడక్షన్స్ పతాకంపై ఆమోగ్ దేశపతి, అర్చన, శ్రేయవ్యాస్ హీరోహీరోయిన్‌లుగా 'పార్సిల్' ఫేమ్ షెరాజ్ దర్శకత్వంలో పి.వి.సత్యనారాయణ నిర్మించిన హర్రర్, థ్రిల్లర్ 'షాలిని'. సాయి వెంకట్ సమర్పిస్తున్న ఈ ఈ లవ్ ఎంటర్‌టైనర్ అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో దర్శకుడు షెరాజ్ మాట్లాడుతూ ''ఇటీవల విడుదలైన సినిమా ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. ఒక పల్లెటూరి నుంచి వచ్చిన యువతీయువకులు నగరానికి వచ్చినప్పుడు వారికి ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి, ఎలాంటి భయాందోళనలకు గురయ్యారు... వారిలో అసలు దెయ్యంగా ఉన్నది ఎవరు అనే ముఖ్య కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే విధంగా సినిమా కథ ఉంటుంది''అని అన్నారు. నిర్మాత పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ''షెరాజ్ చెప్పిన కథ బాగా నచ్చడంతో ఈ సినిమాను నిర్మించాం. ఈ సెప్టెంబర్ 2న తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో దాదాపు 80 నుంచి 100 థియేటర్‌లలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని తెలిపారు. చిత్ర సమర్ప కుడు సాయి వెంకట్ మాట్లాడుతూ ''ప్రేక్షకులను భయపెట్టే చిత్రం షాలిని. ఈ సినిమా లైన్ బాగుండడంతో సమర్పకుడిగా మారడం జరిగింది. ఇటీవలే వైజాగ్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించగా మంచి స్పందన వచ్చింది. సినిమాకు కూడా మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నాం''అని చెప్పారు.


అలియాభట్

వారితో ముద్దు పెట్టించుకుంది

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అలియా భట్ వరుస హిట్లతో ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ భామకు బాలీవుడ్‌లో భారీ క్రేజ్ ఉంది. అయితే తాజాగా అలియాభట్ ముంబయ్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై తనను ముద్దు పెట్టుకునే అవకాశాన్ని కల్పించిందట కొందరికి. అయితే ఈ ఛాన్స్ దక్కింది మాత్రం చిట్టిపొట్టి చిన్నారులకే. చిన్నారులంటే ఎంతో ఇష్టపడే అలియాభట్ ఓ ప్రైవేట్ ప్రోగ్రాంకు హాజరైంది. అక్కడ పిల్లలతో సరదాగా ఆడుతూ పాడుతూ గంతులేసింది. వాళ్లు చెప్పే కబుర్లన్నీ విని వాళ్లతో హ్యాపీగా గడిపింది. ఇందులో భాగంగానే ముద్దుగా ఉండే పిల్లలు కొందరికి తనను ముద్దు పెట్టుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ ఛాన్స్ దక్కిన పిల్లలు క్యూలో నిలబడి తమ ఫేవరేట్ హీరోయిన్‌ను ముద్దు పెట్టుకున్నారట. ఆరకంగా చిన్న పిల్లల కార్యక్రమానికి వచ్చి చిన్న పిల్లలా మారిపోయి వాళ్లతో హాయిగా ఎంజాయ్ చేసింది అలియాభట్. ఈ ఏడాది ఇప్పటికే 'బద్రినాథ్ కీ దుల్హనియా'తో ఈ భామ ఖాతాలో ఓ హిట్ వచ్చి పడింది. ప్రస్తుతం అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణAబీర్ కపూర్‌కు జోడీగా 'డ్రాగన్', జోయా అఖ్తర్ డైరెక్షన్‌లో రణవీర్ సింగ్ పక్కన హీరోయిన్‌గా 'గల్లీ బాయ్' చేస్తోంది ఈ యంగ్ బ్యూటీ. దీంతో పాటు తన తొలి సినిమా హీరో వరుణ్ ధావన్‌తో ముచ్చటగా మూడో సినిమా కూడా చేస్తోంది. కరణ్ మల్హోత్రా డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న 'శుద్ధి' సినిమాలో మరోసారి వీరిద్దరూ జంటగా నటిస్తున్నారు.

రూ.11 వేల కోట్ల బైబ్యాక్‌కు విప్రో వాటాదారుల ఆమోదం

న్యూఢిల్లీ: దాదాపు రూ.11 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రకటనకు వాటాదారులు ఆమోదం తెలిపారని బుధవారంనాడు దేశీయ మూడో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ విప్రో ప్రకటించింది. బెంగళూరుకు చెందిన కంపెనీ సెప్టెంబర్ 15 తేదీ బైబ్యాక్ ఆఫర్‌కు రికార్డు తేదీ అని పేర్కొంది. కంపెనీ వాటాదారుల నుంచి 343.75 మిలియన్ షేర్లను బైబ్యాక్ చేపట్టనున్నట్టు కంపెనీ గత నెలలోనే ప్రకటించింది. ఒక్కో షేరును రూ.320తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకు గానూ కంపెనీ రూ. 11వేల కోట్లను వాటాదారులకు చెల్లించనుంది. దీనిపై మదుపర్ల నుంచి అభిప్రాయం తెలుసుకునేందుకు పోస్టల్ బ్యాలెట్, ఈ ఓటింగ్ పెట్టినట్లు సంస్థ పేర్కొంది. ఆగస్టు 28న పూర్తయిన ఈ అభిప్రాయసేకరణలో బైబ్యాక్‌కు అనుకూలంగా 99.68శాతం ఓట్లు వచ్చినట్లు సంస్థ వెల్లడించింది. వాటాదారులకు ఇచ్చిన షేర్లను తిరిగి వారి నుంచే కంపెనీ కొనుగోలు చేయడాన్ని బైబ్యాక్ అంటారు. ఇప్పటికే టిసిఎస్, ఇన్ఫోసిస్ లాంటి దిగ్గజ కంపెనీలు ఈ బైబ్యాక్‌ను తీసుకొచ్చాయి. టిసిఎస్ రూ.16వేల కోట్లతో చేపట్టగా, ఇన్ఫోసిస్ రూ.13వేల కోట్ల విలువ గల షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. ఇంకా పలు కంపెనీలు ఇదే బాటలో నడిచేందుకు సిద్ధమవుతున్నాయి.

ఆర్‌బిఐకి ఇది సిగ్గుచేటు



- రద్దు చేసిన నోట్లలో 1 శాతం మాత్రమే వెనక్కి రాలేదు
- నల్లధనాన్ని తెల్ల ధనంగా మార్చేందుకేనా ఈ నోట్ల రద్దు నిర్ణయం?
- విమర్శలు గుప్పించిన మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం

న్యూఢిల్లీ: నోట్ల రద్దు అనంతరం ఆర్‌బిఐ విడుదల చేసిన నివేదికపై మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం తీవ్ర విమర్శలు గుప్పించారు. రద్దు చేసిన నోట్లలో 1 శాతం నోట్లు మాత్రమే సెంట్రల్ బ్యాంకుకు రాలేదని, ఇది ఆర్‌బిఐకి సిగ్గుచేటు అని అన్నారు. నల్లధనాన్ని తెల్ల ధనంగా మార్చుకునేందుకేనా నరేంద్ర మోడీ ప్రభుత్వం డిమానిటైజేషన్ నిర్ణయం తీసుకున్నది? అని చిదంబరం ప్రశ్నించారు. ప్రభుత్వ ధారుణంగా విఫలమైందని, నోట్ల రద్దు కారణంగా 104 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, దీనికి ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. '99 శాతం నోట్లు చట్టబద్ధంగా మార్పి చేశారు, నల్లధనాన్ని తెల్ల ధనంగా మార్చుకునేందుకే నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నారా?' అని ట్విట్టర్ ద్వారా చిదంబరం ప్రశ్నించారు. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేందుకే నోట్ల రద్దు ప్రక్రియ పనికొచ్చిందని విమర్శించారు. ఆర్‌బిఐ పొందినది రూ.16 వేల కోట్లు, అయితే కొత్త నోట్ల ముద్రణలో కోల్పోయింది రూ.21 వేల కోట్లు అని.. రిజర్వ్ బ్యాంక్ ఆర్థికవేత్తలకు నోబెల్ పురస్కారం ప్రకటించాలని చిదంబరం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రద్దయిన పెద్ద నోట్ల లెక్కల వివరాలను బుధవారం ఆర్‌బిఐ వెల్లడించిన కొద్దిసేపటికే చిదంబరం వరుస ట్వీట్లతో విరుచుకుపడ్డారు. 'మొత్తం రూ.15.44 లక్షల కోట్ల విలువైన కరెన్సీని రద్దు చేశారు. తిరిగి బ్యాంకుల్లోకి చేరకుండా మిగిలింది కేవలం ఒక్క శాతం అంటే రూ.16వేల కోట్లు! నిజంగా ఇది ఆర్‌బిఐకి సిగ్గుపడాల్సిన విషయం' అని విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన రణదీప్ సూర్జేవాలా మాట్లాడుతూ, డిమానిటైజేషన్‌తో ఒరిగిందేమీ లేదని, ఇదో విధ్వంసం అని, దీని కారణంగా 104 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కాగా పెద్ద నోట్ల రద్దు లక్ష్యం డబ్బు జప్తు చేయడం కాదని, నల్లధనాన్ని వెలికితీయడమని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రత్యక్ష పన్నుల వాటా, పరోక్ష పన్నుల వాటా విస్తరించిందని అన్నారు.

నోట్ల రద్దు కథాకమామిషు...

డిమానిటైజేషన్(నోట్ల రద్దు) నిర్ణయం ప్రకటించిన తర్వాత ఎంత నగదు వెనక్కి వచ్చింది, వాటి గణాంకాలను బుధవారం ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) విడుదల చేసింది. ఆర్‌బిఐ వార్షిక నివేదికలో.. మొత్తం రూ.15.44 లక్షల కోట్లకు గాను 99 శాతం అంటే రూ.15.28 లక్షల కోట్లు వచ్చాయని వెల్లడించింది. నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 2017 జూన్ 30 మధ్య కాలంలో గణాంకాలు ఈవిధంగా ఉన్నాయని తెలిపింది. రూ.8900 కోట్ల విలువ చేసే రూ.1000 నోట్లు ఆర్థిక వ్యవస్థలోకి రాలేదని ఆర్‌బిఐ నివేదిక పేర్కొంది. గత ఏడాది నవంబర్ 9న నోట్ల రద్దు ప్రకటన చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలు తేదీల వారీగా చూద్దాం.

2016 నవంబర్ 9–10: ప్రధాని నరేంద్ర మోడీ డీమానిటైజేషన్(నోట్ల రద్దు) ప్రకటన చేశారు. ఆ తర్వాత వ్యవస్థలో అవసరమైన మార్పులకు సిద్ధం చేయడం కోసం బ్యాంకులు, ఎటిఎంలను మూసివేశారు. 2.5 లక్షల రూపాయల కంటే ఎక్కువ బ్యాంకు డిపాజిట్లు చేస్తే పన్ను, పెనాల్టీలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది.

2016 నవంబరు 14: ప్రభుత్వ ప్రయోజనాలు, ఇంధన చెల్లింపుల కోసం పాత నోట్లు అంగీకరించేందుకు గడువును నవంబర్ 24 వరకు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఖాతాదారులకు నగదు ఉపసంహరణ పరిమితి వారానికి రూ.50,000కు కేంద్రం పెంచింది. ఎటిఎం లావాదేవీలపై ఛార్జీలు డిసెంబరు 30 వరకు రద్దు చేశారు. నగదు కొరత సమస్య తారా స్థాయికి చేరుకుంది.

2016 నవంబర్ 16 : 7 రోజుల్లో దాదాపు రూ. 1,14,139 కోట్లు డిపాజిట్లు వచ్చాయని ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ప్రకటించింది.

2016 నవంబర్ 21: నవంబరు 10 నుంచి నవంబర్ 18 వరకు బ్యాంకుల నివేదిక ఎక్స్ఛేంజ్, డిపాజిట్లు రూ. 5,44,571 కోట్లు ఉండగా.. దీనిలో రూ.33,006 కోట్లు మారకం ద్వారా, 5,11,565 కోట్లు డిపాజిట్ ద్వారా వచ్చాయి. కౌంటర్లో లేదా ఎటిఎం ద్వారా తమ



ఖాతాల నుంచి ప్రజలు దాదాపు రూ.1,03,316 కోట్లు ఉపసంహరించుకున్నారని కూడా నివేదిక తెలిపింది.

2016 నవంబర్ 24: పాత కరెన్సీ నోట్ల మారకానికి సంబంధించి డిసెంబరు 15 అర్ధరాత్రి వరకూ మినహాయింపు గడువును పొడిగించింది.

2016 నవంబర్ 26: కేవలం 14 రోజుల్లోనే జన్ ధన్ ఖాతాల్లోకి డిపాజిట్లు రూ.27,200 కోట్లు నుంచి ఒక్కసారిగా పెరిగి రూ.72,834.72 కోట్లకు చేరాయి.

2016 నవంబరు 27: డిమానిటైజేషన్ నిర్ణయం ప్రకటించినప్పటి నుంచి పోస్ట్ ఆఫీసులలోకి దాదాపు రూ. 32,631 కోట్ల డిపాజిట్లు వచ్చాయి.

2016 నవంబరు 28: దాదాపు రూ. 8.45 లక్షల కోట్ల విలువచేసే పాత నోట్లు బ్యాంకుల్లోకి వచ్చాయని రిజర్వు బ్యాంక్ ప్రకటించింది.

2016 డిసెంబరు 7: నోట్ల రద్దుతో జిడిపిపై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. జిడిపి పెరుగుదల మీద డిమానిటైజేషన్ ప్రభావం కేవలం 15 బేసిస్ పాయింట్ల మాత్రమే ఉంటుందని పేర్కొంది. వ్యవస్థలోకి రూ .11.55 లక్షల కోట్లు లేదా 76 శాతం రద్దయిన కరెన్సీ నోట్లు వచ్చాయని ఆర్‌బిఐ ప్రకటించింది.

2016 డిసెంబరు 13: డిసెంబరు 10వ తేదీ వరకూ దాదాపు రు.12.44 లక్షల కోట్ల రద్దయిన కరెన్సీ బ్యాంకుల్లోకి వచ్చాయని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఆర్ గాంధీ ప్రకటించారు.

2017 జనవరి 18: డిపాజిట్ అయిన బ్యాంకు నోట్లపై అడిగిన ప్రశ్నలకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ సమాధానాలు ఇవ్వలేకపోయారు. అయితే నవంబరులో నిషేధించిన నోట్ల స్థానం భర్తీ చేసేందుకు గాను దాదాపు రూ.9.2 లక్షల కోట్ల విలువచేసే కొత్త కరెన్సీని ఆర్‌బిఐ విడుదల చేసినట్టు ఆయన నిర్ధారించారు.

2017 జూలై 4: వాస్తవ కారణాలరీత్యా పాత రూ. 500, రూ.1000 నోట్లను మార్పిడి చేయలేకపోయిన వారికి ఒక విండోను మంజూరు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వం, ఆర్‌బిఐలను ఆదేశించింది.

2017 జూలై 13: పార్లమెంటు ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ ముందు హాజరైనన ఆర్‌బిఐ గవర్నర్ పటేల్ సమాధానమిచ్చారు. డిమానిటైజేషన్ తర్వాత డిపాజిట్ అయిన నోట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతుందని అన్నారు.

2017 ఆగస్టు 2 :పాత నోట్ల లెక్కింపు ప్రక్రియను ఆర్‌బిఐ చేపడుతోందని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. నకిలీ నోట్లను తొలగించిన తర్వాత తుది గణాంకాలతో వస్తామని చెప్పారు.

2017 ఆగస్టు 11: ఆర్థిక సర్వే–2లో దేశీయ ఆర్థిక వ్యవస్థపై డిమానిటైజేషన్ ప్రభావం గురించి ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ వివరిస్తూ ఆర్థిక వ్యవస్థలో నగదు 20 శాతం తగ్గుముఖం పడుతుందని అన్నారు.

2017 ఆగస్టు 15 : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ పాత నోట్లను నిషేధించడం వల్ల రూ.3 లక్షల కోట్ల అప్రకటిత ఆధాయం బ్యాంకింగ్ వ్యవస్థలో వచ్చిందని అన్నారు.

2017 ఆగస్టు 16: నల్లధనంపై మోడీ తీరుపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. బ్యాంకింగ్ వ్యవస్థలో అదనంగా రూ.3 లక్షల కోట్లు వచ్చాయని ప్రకటించారని, ఆ తర్వాత రూ .1,25,000 కోట్ల నల్లధనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారని అన్నారు.

2017 ఆగస్టు 27: ఆర్‌బిఐ వెబ్‌సైట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం, రూ.1,000 నోట్లలో దాదాపు 99 శాతం కరెన్సీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయి.

2017 ఆగస్టు 29: పార్లమెంటరీ కమిటీకి చెందిన పలువురు సభ్యులు డిమానిటైజేషన్‌పై ముసాయిదా నివేదికను తిరిగి రూపకల్పన చేయాలని కోరారు. రూ.500, రూ.1000 నోట్ల సంఖ్యతో సహా కొన్ని కీలకమైన వివరాలను ఆర్‌బిఐ ఇప్పటికీ ఇంకా సమర్పించలేదని అన్నారు.

ఆర్‌బిఐ నివేదిక ప్రకారం...


చలామణిలో ఉన్న కరెన్సీ(2017 నవంబర్ 4)	**రూ.17.97 లక్షల కోట్లు**
రద్దు చేసిన కరెన్సీ (2017 నవంబర్ 8)	**రూ.15.45 లక్షల కోట్లు**
వెనక్కి వచ్చిన కరెన్సీ (2017 జూన్ 30)	**రూ.15.28 లక్షల కోట్లు**



పన్ను ఎగవేతదార్లపై వేటు తప్పదు

☞ కరెన్సీ కట్టడికే నోట్ల రద్దు ☞ బ్లాక్‌మనీ వెలికితీతకు భరోసా ☞ ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ పన్నుల విధానం మంచికి మంచి, చెడుకు చెడుగా ఉంటుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. పన్నుల వ్యవస్థ బలోపేతానికి, నల్లధనం వెలికితీతకు, నగదు అత్యధిక చలామణి అవకతవకల అదుపునకు పెద్ద నోట్ల రద్దును చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పన్నుల వ్యవస్థ దేశానికి వెన్నెముక అని, దీనికి అనుగుణంగానే తమ సంవిధానం ఉంటుందని తెలిపారు. జిఎస్‌టి అమలు తరువాతి దశలు నిర్ధిష్టంగా పన్నుల వ్యవస్థలో నెలకొన్నాయని, జిఎస్‌టి వచ్చిన దశలో ఇప్పుడు పన్ను ఎగవేతదార్ల ఆటలు సాగబోవని హెచ్చరించారు. ఆదాయ వ్యయ ఇన్వాయిస్‌లకు అనుగుణంగా పన్నుల చెల్లింపులు ఉండకపోతే అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జైట్లీతెలిపారు. ఇక్కడ వోల్టెర్స్ క్లువెర్ ప్రచురణ సంస్థ వెలువరించిన ఓ పుస్తక ఆవిష్కరణ సభలో ఆర్థిక మంత్రి ఇక్కడ వివిధ అంశాలపై స్పందించారు. నల్లధనం గురించి ఇంతకు ముందు చర్యలు తీసుకోని వారు పెద్దనోట్ల రద్దు వల్ల ప్రయోజనం ఏం జరిగిందనే ప్రశ్న వేస్తున్నారని , నల్లధనంతో ఆర్థిక వ్యవస్థలోకి చేరిన ధనాన్ని పోలుస్తున్నారని, అయితే వారికి నల్లధనం గురించి సరైన చర్యలు తీసుకునే ధైర్యం లేదు, నోట్ల రద్దుపై వారికి సరైన ఇంగిత జ్ఞానం లేదని తెలిపారు. పెద్ద నోట్ల రద్దుకు బ్లాక్ మనీ వెలికితీతకు సంబంధం ఏమిటని అవగాహన లేని వారు ప్రశ్నించారని , అయితే నిజాయితీగల వారికి మేలు జరుగుతుంది. ఎగవేతదార్ల భరతం పడుతుందని ఇదే ఐటి నినాదం అవుతుందని జైట్లీ స్పష్టం చేశారు. గత రెండు మూడుసంవత్సరాల వ్యవధిలో తమ ప్రభుత్వం తీసుకుంటూ వస్తున్న చర్యలతో పన్నుల ఎగవేత తగ్గిందని, ఇది చాలా మందికి కంటగింపుగా మారిందని గుర్తు చేశారు. ఇప్పుడు జిఎస్‌టి అమలులోకి రావడంతో పన్నుల సంస్కరణల్లో కొత్త ఘట్టం మొదలైందని తెలిపారు. ప్రత్యక్ష పన్నుల స్థాయి విస్తరణ ఉంటుందని, పరోక్ష పన్నుల వసూళ్లతో ఇది సమన్వయంగా పెరుగుతుందని వెల్లడించారు. ఇప్పటికి జిఎస్‌టికి సంబంధించి ప్రభుత్వం తొలిదశలో స్వచ్ఛంద వెల్లడి ప్రక్రియనే చేపట్టారని, అయితే బిల్లుల సమర్పణ సమయంలో ఇప్పుడు దాఖలు చేసిన దానికి తరువాతి దానికి తేడాలు ఉంటే ఈ స్వచ్ఛంద వెల్లడి ఎంతమేరకు వాస్తవికంగా జరిగిందనేది స్పష్టం అవుతుందని, ఈ మేరకు చర్యలు ఉంటాయని జైట్లీ తెలిపారు. జిఎస్‌టి అమలు తరువాత ఒకటి రెండు నెలలు పన్నుల చెల్లింపుదార్లకు కల్పించిన వెసులుబాటు ప్రక్రియ వారి విశ్వసనీయత, నిజాయితీని ఎంచేందుకు, పెంచేందుకు అని , నిజాలు తెలిపిన వారికి ఇది మంచి మంత్రం అవుతుందని లేకపోతే వికటిస్తుందని విశ్లేషించారు. విశ్వసనీయత వల్ల ఫలితం దక్కుతుందని, తప్పొప్పులు వ్యాపారవేత్తలు సమర్పించే వోచర్లు, నివేదికలతోనే స్పష్టం అవుతుందని తెలిపారు. బ్యాంకులలో డిపాజిటు అయిన నల్లధనం చట్టబద్ధతను పొందబోదని జైట్లీ స్పష్టం చేశారు. విచ్చలవిడి డబ్బును అదుపులో పెట్టడమే పెద్దనోట్ల రద్దు ప్రక్రియ లక్ష్యం అని, ఇక తమ తదుపరి లక్ష్యం రాజకీయ నిధుల ప్రక్షాళన అని జైట్లీ స్పష్టం చేశారు. పెద్దనోట్ల రద్దుతో ఉగ్రవాదులకు, తీవ్రవాదులకు నిధుల పంపిణీ వ్యవస్థకు గండిపడిందని, ఈ అంశం జమ్మూ కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ వంటి చోట్ల జరిగిన ఘటనల తగ్గుముఖంతో స్పష్టం అయిందని తెలిపారు. పన్ను ఎగవేసే ధోరణి ని భారతీయులు విడనాడాల్సి ఉందని, పన్నుల ఎగవేతతో దేశానికి ఏటా భారీ స్థాయిలో నష్టం జరుగుతోందని, ఇది చివరికి ప్రజలకు భారంగా మారుతుందని తెలిపారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టితో దేశంలో ఐటి మదింపుల గణనీయంగా పెరిగిందని వెల్లడించారు.



నేడు పాన్–ఆధార్ అనుసంధానం

గడువుపై కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ: పాన్(శాశ్వత ఖాతా సంఖ్య)తో ఆధార్ అనుసంధానం చేసేందుకు గడువు నేటి(ఆగస్టు 31)తో ముగియనుంది. అయితే ఆర్థిక మంత్రిత్వశాఖ గడువుపై ప్రకటన చేయనుంది. ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అనుసంధానం ప్రక్రియకు గడువు ఈ నెలాఖరేనని, పొడిగింపు ఉండబోదని రెండు రోజుల క్రితం యుఐడిఎఐ సిఇఒ అజయ్‌భూషన్ పాండే స్పష్టం చేశారు. ఈ అనుసంధానం పూర్తి చేయకుండా ఆగస్టు 5 నాటికే మీరు రిటర్ను దాఖలు చేసినా దానిని ఆదాయపన్ను (ఐటి) శాఖ పరిగణలోకి తీసుకోదు. ఫలితంగా రిటర్ను ఫైలు చేయనట్లు భావిస్తారు. దీంతో తదనంతర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సెక్షన్ 142(1) ప్రకారం రిటర్న్‌ను సమర్పించాలని ఐటీ శాఖ నోటీసులు జారీ చేస్తుంది. దీనికి అదనంగా అసెస్‌మెంట్ అధికారి రూ.5,000 అపరాధ రుసుం కూడా విధించవచ్చు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 31 నాటికి ఆధార్‌తో పాన్ జత చేయాల్సి ఉంటుంది.

పాన్‌తో ఆధార్ అనుసంధానం ఎలా?

☞ incometaxindiaefiling.gov.in. లాగిన్ కావాలి. ఇది తప్పనిసరేమీ కాదు.. లాగిన్ కాకుండా మీరు డైరెక్టుగా స్టెప్–2కు వెళ్లవచ్చు. ఐటి శాఖ వెబ్‌సైట్ ద్వారా చాలా సులువుగా ఆధార్‌తో పాన్ లింక్ చే యవచ్చు.
☞ 'లింక్ ఆధార్' అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
☞ డైరెక్టుగా లింక్ ఆధార్ అంటే పాప్ అప్ విండో ఒకటి ఓపెన్ అవుతుంది. అక్కడ ఆధార్ నెంబర్, పాన్ నంబర్ ఎంట్రీ చేయాలి.
☞ కాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి, 'లింక్ ఆధార్'పై క్లిక్ చేయాలి.
☞ పుట్టిన తేదీ, ఇంటిపేరు, పేరు, ఆధార్, పాన్‌తో సరిపోలితే వెంటనే ఆధార్‌తో పాన్ విజయవంతంగా అనుసంధాన మైనట్టుగా ఒక మెసేజ్ వస్తుంది.



మోటొరోలా నుంచి మోటో జి5ఎస్ ప్లస్



న్యూఢిల్లీ: మోటొరోలా నూతన స్మార్ట్‌ఫోన్లు మోటో జి5 ఎస్, జి5 ఎస్ ప్లస్ దేశీయ మార్కెట్లోకి విడుదలైంది. జి5 ఎస్ ప్లస్ ఫోన్ ధర రూ.15,999 గా, మోటో జి5ఎస్ ధర రూ.13,999గా కంపెనీ నిర్ణయించింది. మోటో జి5ఎస్ ప్లస్ ఫీచర్లు చూస్తే 5.5 ఇంచ్ ఫుల్ హెచ్‌డి డిస్‌ప్లే, 1920 x 1080 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్, 2 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెస్, 4 జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్, 128 జిబి ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 7.1 నౌగట్, డ్యుయల్ సిమ్, 13 మెగాపిక్సల్, 8 మెగాపిక్సల్ల సెల్ఫీ కెమెరా, వాటర్ రీపెల్లెంట్ నానో కోటింగ్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జి విఒఎల్‌టిఇ, బ్లూటూత్ 4.2, 3000 ఎంఎహెచ్ బాటరీ సామర్థ్యం కల్గి ఉన్నాయి.

డానోన్ ఇండియా నుంచి నియోకేట్



ముంబయి : డానోన్ ఇండియా దేశీయ మార్కెట్లోకి గ్లోబల్ బ్రాండ్ నియోకేట్ లాంఛ్ చేసింది. శిశువులు, చిన్నారుల్లో సాధారణంగా ఉండే ఫుడ్ అలర్జీ నిర్వహణ కోసం ఈ ప్రోడక్ట్‌ను వినియోగిస్తారు. ఆవు పాల అలర్జీ నిర్వహణలో భాగంగా సరికొత్త ఫార్ములాతో దీనిని రూపొందించారు.

ఒడిశాకు రూ.466 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: ఒడిశా కంపెనీ దాదాపు రూ.466 కోట్ల విలువచేసే పెట్టుబడి ప్రతిపాదనను పొందింది. డెరాస్‌లో సీఫుడ్ పార్క్ వద్ద యూనిట్ల ఏర్పాటు కోసం ఈ ఆర్డర్‌ను పొందింది. దీనికి సంబంధించిన భూమి ఇప్పటికే 20 సంస్థలకు కేటాయించారు. ఐడిసిఒ(ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) దాదాపు రూ.134 కోట్లతో సీఫుడ్ పార్క్‌ను అభివృద్ధి చేస్తోంది.

హీరో ఎలక్ట్రానిక్స్ మలేసియా, సింగపూర్‌ల నుంచి కొనుగోళ్లు

న్యూఢిల్లీ: రెండు వ్యాపారాలకు సంబంధించిన కొనుగోళ్లు చెపట్టినట్టు హీరో ఎలక్ట్రానిక్స్ ప్రకటించింది. 5 బిలియన్‌ల హీరో గ్రూప్‌కు చెందిన సంస్థ హీరో ఎలక్ట్రానిక్స్ మలేసియా నుంచి, అలాగే సింగపూర్ సంస్థల నుంచి కొనుగోళ్లు చేపట్టనుంది.

స్టాక్ మార్కెట్



ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31750.82	154.76	0.49%
నిఫ్టీ	9912.80	55.75	0.57%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28240	30203.21	0.88%
ముంబై	29250	31283.42	1.99%
ఢిల్లీ	28550	30534.76	1.96%
కోల్‌కతా	28660	30652.41	0%
కేరళ	27650	29572.19	0.36%
బెంగళూరు	27850	29786.10	1.27%
హైదరాబాద్	28240	30203.21	0.25%
గల్ఫ్	1393.85	1490.75	1.36%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42000.00	41900.00	0.24
ముంబై	42000.00	41900.00	0.24
ఢిల్లీ	42000.00	41900.00	0.24
కోల్‌కత్తా	42000.00	41900.00	0.24
హైదరాబాద్	42000.00	41900.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

ఆస్పత్రి నుంచి ప్రియాంక వాద్రా డిశ్చార్జి : ఎస్‌జిఆర్‌హెచ్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కుమార్తె ప్రియాంక వాద్రా ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రి అధికారులు వెల్లడించారు. వారం క్రితం డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న ఆమె చికిత్స నిమిత్తం సర్ గంగా రామ్ హాస్పటల్ (ఎస్‌జిఆర్‌హెచ్)లో చేరారు. ఆస్పత్రి సీనియర్ వైద్యులు అరూప్ బసు పర్యవేక్షణలో డెంగ్యూ జ్వరానికి చికిత్స పొందిన ప్రియాంకా కోలుకోవడంతో ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్టు ఎస్‌జిఆర్‌హెచ్ చైర్మన్ డిఎస్ రానా పేర్కొన్నారు. ప్రియాంకకు ఇంకా విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్టు ఆయన చెప్పారు. మున్సిపల్ శాఖ సమాచారం ప్రకారం.. ఢిల్లీ నగరంలో ఈ సీజన్‌లో ఇప్పటికే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలిన నేపథ్యంలో ఆగస్టు 19 వరకు కనీసం 657 డెంగ్యూ కేసులు నమోదయినట్టు నివేదిక తెలిపింది. ఈ నెలలో డెంగ్యూ జ్వరంతో ఎస్‌జిఆర్‌హెచ్‌లో చేరిన 12 ఏళ్ల బాలుడు మృతిచెందగా, ఈ సీజన్‌లో ఇదే తొలి డెంగ్యూ మరణంగా పేర్కొంది. జులై 1 నుంచి ఈ నెల 16 మధ్య డెంగ్యూ కేసులు 59 వరకు నమోదయినట్టు ఎస్‌జిఆర్‌హెచ్ అధికారులు తెలిపారు. మొత్తం మీద ఈ సీజన్‌లో 945 మందికి డెంగ్యూ వ్యాప్తి చెందినట్టు మున్సిపల్ నివేదిక విడుదల చేసింది.

స్కూళ్లలో బుక్‌స్టాల్స్‌కు అనుమతి

న్యూఢిల్లీ: ఇకపై స్కూళ్లు కూడా పుస్తకాల దుకాణాలను తెరవవచ్చు. ఈ మేరకు సిబిఎస్‌ఇ తగు అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వెలువరించిన ఆదేశాలను సవరించింది. తాజా ఉత్తర్వుల మేరకు స్కూళ్ల ప్రాంగణంలో ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు వంటి సామాగ్రి అమ్మే స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఎప్రిల్‌లోనే మాధ్యమిక విద్యా కేంద్రీయ మండలి అయిన సిబిఎస్‌ఇ వారు స్కూళ్లల్లో వాణిజ్య సముదాయాలను నిర్వహించరాదని, పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించరాదని పేర్కొంది. అయితే సవరించిన ఆదేశాల మేరకు ఈ షాపులలో ఎన్‌సిఆర్‌టి పుస్తకాలు అమ్ముకోవచ్చు. స్కూళ్లకు అవసరమైన పుస్తకాల కోటాను నేరుగా తమ వెబ్‌సైట్‌కు ఇండెంట్ పెట్టడం ద్వారా తీసుకోవచ్చునని ,వాటిని కేవలం తమ స్కూళ్ల విద్యార్థులకు అమ్మవచ్చునని ప్రకటనలో తెలిపారు. చిన్నపాటి బుక్‌స్టాల్స్‌ను తెరవడానికి వీలుగా సవరించిన ఆదేశాలు ఇప్పుడు అమలులోకి వచ్చాయి.

మంత్రి ఆస్తుల కేసులో ఐటి దాడులు



బెంగళూరు: కర్నాటక మంత్రి డికె శివకుమార్‌కు చెందిన వివిధ ఆస్తులకు సంబంధించిన కేసులో బెంగళూరు, చెన్నై, కర్నాటకలోని పది ప్రాంతాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ నెల మెదటివారంలో మంత్రి ఆస్తులకు సంబంధించి వివరాలను సేకరించేందుకు ఐటీ తనిఖీలు చేపట్టింది. ప్రధాన నగరాలైన బెంగళూరు, చెన్నై, కర్నాటలోని పది ప్రాంతాల్లో సోదాలు, సర్వేలను జరుపుతున్నట్టు ఐటీ శాఖ వెల్లడించింది. కెపిసిసి సభ్యుడు విజయ్ మల్లంద్ నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు జరిపినట్టు అధికారులు తెలిపారు. వరుసగా మూడురోజుల పాటు దేశవ్యాప్తంగా 66 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా, రూ. 15 కోట్ల విలువైన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. కాగా, ఈ తనిఖీలు ఎప్పుడూ పూ ర్తియ్యే విషయంలో ఐటీ శాఖ అధికారక ప్రకటన ఇంకా వెల్లడి కాలేదు.

వీరభద్రసింగ్‌కు డాక్యుమెంట్లు ఇవ్వండి



న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్, ఇతరులకు సంబంధిత పత్రాలను తిరిగి ఇవ్వాలని ప్రత్యేక కోర్టు సిబిఐని ఆదేశించింది. చార్జిషీట్‌తో జత చేసిన వివిధ రకాలైన పత్రాలు తమకు అందలేదని వీరభద్రసింగ్, ఆయన భార్య ప్రతిభాసింగ్, ఇతరులు కోర్టుకు తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ తమకు పత్రాలు అందలేదని తెలిపారు. ఇతర కేసులలో పరిశోధనా అధికారి నిమగ్నమై ఉండటంతో డాక్యుమెంట్లను ఇవ్వడం ఆలస్యమవుతోందని సిబిఐ తెలిపింది. ఈ కేసు పై విచారణ జరిపిన ప్రత్యేక జడ్జి వీరేంద్ర కుమార్ గోయల్ నిందితుల పత్రాలు తిరిగి వారికి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. తాము అరెస్ట్ కాలేదని, తమకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని వీరభద్ర సింగ్ దంపతులు కోర్టును అభ్యర్థించారు. దీనిపై స్పందనను తెలియజేయాలని ప్రత్యేక కోర్టు సిబిఐని ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను అక్టోబరు 31న చేపట్టనుంది. సిబిఐ చార్జిషీట్ దాఖలు చేయడంతో నిందితులకు మే 8న కోర్టు సమన్లు జారీ చేసింది. ఇతర నిందితులు కోర్టుకు హాజరై సరైన సమాధానం ఇవ్వడంతో వారికి మే29న కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వీరభద్ర సింగ్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆదాయానికి మించి దాదాపు రూ.10 కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆయనపై సిబిఐ అభియోగాలు నమోదు చేసింది.

అనుమానాస్పద మృతి

బికనేర్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఎఫ్) సహాయక్ సిబ్బందిలో ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బరాక్‌కు సమీపంలో బికనేర్ జిల్లాలోని నాల్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పంజాబ్‌లోని అకాల్గఢ్‌కు చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (47) మృతదేహాన్ని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వారెంట్ అధికారి రాజపాల్ సిం గ్ రాజ్‌పుట్ మంగళవారం గుర్తించినట్టు పోలీసులు వెల్లడించారు. ఐఎఫ్‌లో సహాయక్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుఖ్‌దేవ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు నాల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ధరమ్ పునియా పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ జరుపుతున్నట్టు చెప్పారు.

మరోసారి పాక్ కాల్పులు

జమ్మూ: కశ్మీర్‌లోని రాజౌరి జిల్లాల్లో పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. నియంత్రణ రేఖ సమీపంలోని సైనిక స్థావరాలు, గ్రామాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడింది. నౌషేరా సెక్టార్‌లో ఉదయం 10.35 గంటలకు పాక్ దళాలు కాల్పులు జరిపాయి. పాక్ దళాలు జరిపిన కాల్పులను భద్రతా బలగాలు తిప్పికొట్టినట్లు అధికారులు తెలిపారు. ఇరు వర్గాలు జరిపిన కాల్పుల్లో ఎవరికి గాయాలు కాలేదని పేర్కొన్నారు. ఈ ఏడాది పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి నౌషేరా సెక్టార్‌తోపాటు రాజౌరి, పూంచ్ జిల్లాల్లోని ఇతర సెక్టార్లలో దాడులను ఉధృతం చేసింది. నియంత్రణ రేఖ సమీపంలో పాక్ కాల్పులు జరుపుతుండటంతో వేలాది మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఆగస్టు 27న పూంచ్ జిల్లాలోని షాపూర్ సెక్టార్‌లో పాక్ కాల్పులు జరపడంతో ఐదుగురు పౌరులు గాయపడ్డారు. 2016లో పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కేసులు 228 ఉండగా, ఈ ఏడాది ఆగస్టు1 నాటికి 285కు చేరినట్లు సైనికాధికారులు తెలిపారు.

మిజోరంలో ఏడుగురు పార్లమెంటరీ కార్యదర్శుల రాజీనామా

ఐజ్వాల్: మిజోరంలో ఏడుగురు పార్లమెంటరీ కార్యదర్శులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా లేఖలను బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి లాల్ థన్‌హవ్లాకు సమర్పించారు. అనంతరం వారి రాజీనామాలను సిఎం లాల్ ధృవీకరించారు. కెఎస్ థాంగ, హెచ్ జోథాంగ్ లియానా, లెఫ్టినెంట్ కల్నల్ జడ్‌ఎస్ జ్వాల, కె. లాల్‌రిన్‌థాంగ, టిటి జోథాన్‌సంగ, హిమింగ్దైలోవ ఖీంగ్తే, జోసెప్ లాల్‌హింపియా ఏడుగురు పార్లమెంటరీ కార్యదర్శులుగా ఉన్నారు. ఇటీవల పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలపై 2004 చట్టం కింద (నియామకం, జీతభత్యాలు, వివిధ నియమాలు) చట్టబద్ధమైనవి కాదంటూ తీర్పును వెలువరించిన నేపథ్యంలో వీరంతా రాజీనామాలు చేశారు. అసోం శాసనసభ కార్యదర్శులు పార్లమెంటరీ కార్యదర్శుల పదవులకు యోగ్యులు కారంటూ జస్టిస్ జె చలేమేశ్వర్, జస్టిస్ ఆర్‌కె అగర్వాల్, జస్టిస్ ఎఎమ్ సప్రేతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. అసోంలో పార్లమెంటరీ సెక్రటరీల నియామకం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే సిఎం థన్‌హవ్లా మిజోరం పిసిసి అధ్యక్షుడు కూడా కావడంతో మాజీ పార్లమెంటరీ కార్యదర్శులందరినీ సాధారణ కార్యదర్శులుగా నియమించారు. వచ్చే ఏడాది అఖరిలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పార్టీని బలపేతం చేసే దిశగా ఎంపిసిసి సాధారణ కార్యదర్శులను నియమించినట్టు కాంగ్రెస్ ఒక ప్రకటనలో పేర్కొంది. మాజీ మంత్రులు కె. లాల్‌రిన్‌లియానా సెయిలో, నిహార్ కాంటి చక్మ ఇద్దరూ కూడా జనరల్ కార్యదర్శులుగా నియమితులైనట్టు ప్రకటన వెల్లడించింది.

తేరుకుంటున్న ముంబయి

రోడ్డు, రైల్వే రవాణా సర్వీసులు పునః ప్రారంభం
కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు : వాతావరణ శాఖ



ముంబయి: భారీ వర్షాలు ముంచేత్తడంతో అతులాకుతలమైన ముంబయి మహానగరం నెమ్మదిగా తేరుకుంటోంది. భారీవర్షాలతో స్తంభించిపోయిన జనజీవనం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఊపిరిపీల్చుకుంటోంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు చేరవేసే సబర్బన్ రైళ్లు పరుగులు కూత మొదలుపెట్టాయి. మంగళవారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వరద ఉధృతి కారణంగా ఇళ్లు కూలిపోగా నలుగురు మృతిచెందారు. ముంబయిలోని మరికొన్నిప్రాంతాలకు వర్ష ప్రభావం ఉందని, ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) హెచ్చరించింది. 6.5 మిలియన్ల మంది ప్రయాణికులు ఆధారపడిన సబర్బన్ రైళ్ల సర్వీసులు బుధవారం ఉదయం నుంచి మూడు రైల్వేమార్గాల్లో పాక్షికంగా పునః ప్రారంభమయ్యాయి. సెంట్రల్‌రైల్వే హార్బర్, ప్రధాన రైల్వే మార్గాలతో పాటు స్థానిక సర్వీసులు కూడా నెమ్మదిగా కొనసాగుతున్నాయి. రోడ్లపై నిలిచిపోయిన వరద నీరు క్రమంగా తగ్గిపోవడంతో రోడ్డు ట్రాఫిక్ సాధారణ స్థితికి వస్తోంది. అయితే మహారాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు నగర పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థలు ముందు జాగ్రత్త చర్యగా మూసివేయాలని రాష్ట్ర పరిపాలన విభాగం ప్రకటించింది. బుధవారం ఉదయం నుంచి నగర శివారు ప్రాంతాల్లో ఎక్కడా కూడా గణనీయమైన వర్షపాతం నమోదు కాలేదు. రంగంలోకి దిగిన నేవీ సహాయక బృందం వర్షంలో చిక్కుకున్న ప్రయాణికుల కోసం కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఫుడ్ కౌంటర్లను కూడా తెరిచివుంచారు. మరోవైపు రైల్వే సర్వీసులకు అంతరాయం ఏర్పడటంతో ప్రఖ్యాత ముంబయి దాబాలు నుంచి నగరంలోని పలు కార్యాలయాలకు డెలివరీ అయ్యే రెండు లక్షల కొద్ది టిఫిన్ పదార్థాలు బుధవారం రద్దు చేశారు. బలమైన విదురుగాలులతో కురిసిన కుండపోత వర్షానికి ముంబయి నగరంలో రైల్వే, రోడ్డు, విమాన సర్వీసులకు త్రీవ అంతరాయం ఏర్పడగా, పలు ప్రాంతాల్లోని చెట్లు కూలిపోయాయి. పలు ఇళ్లు తడిసిముద్దయ్యాయి. మెగాపోలిస్, సాటిలైట్ పట్టణాల్లో మోకాళ్ల లోతు నీళ్లు వచ్చి చేరాయి. వివిధ ప్రాంతాలోని రైళ్ల స్టేషనల్లో వందలాది మంది ప్రయాణికులు ఉండిపోవడంతో రద్దీగా మారాయి. నేవీ, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు హెలికాప్టర్లల ద్వారా మంగళవారం సాయంత్రం వరకు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. సబర్బన్ విఖ్రోలిలో ఇళ్లు కూలిపోయిన ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. థానెలో 32 ఏళ్ల మహిళ సహా ఒక చిన్నారి మృతిచెందగా, వరద ఉధృతి కారణంగా మరో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు

331.4 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం

2005 నుంచి పరిశీలిస్తే ముంబయిలో మంగళవారం 331.4 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైనట్టు భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) వెల్లడించింది. దశాబ్ద కాలంలో నగరంలో జులై 26, 2005లో 944 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, 1997 ఆగస్టు 23న 346.2 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదు అయింది. అయితే. ఒక్క రోజులో అత్యధిక వర్షపాతం నమోదు కావడం ఇది రెండో సారి. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం 8.30 ఉదయం వరకు నమోదైన అత్యధిక వర్షపాతం 331.4 మిల్లీమీటర్లుగా శాంటాక్రూజ్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో 110 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఐఎమ్‌డి పేర్కొంది. పొరుగుప్రాంతమైన థానె నగరంలో 247 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, పల్ఘహార్ ప్రాంతంలో 280 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం ముంబయి ప్రాంతంలో 250 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదు అవుతుందని ఐఎమ్‌డి ప్రకటనలో వెల్లడించింది.

హర్యానా, పంజాబ్‌లు ప్రశాంతం

చండీగఢ్: డేరా కేసులో ఇటీవల హింసాత్మక ఘటనలతో అట్టుడికిపోయిన హర్యానా, పంజాబ్‌లలో ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యా సంస్థలు, దుకాణాలు బుధవారం తెరుచుకున్నాయి. సున్నిత ప్రాంతాలలో రవాణ సేవల్ని పునరుద్ధరించారు. అయినప్పటికీ ఈ రెండు రాష్ట్రాలలో భద్రతా బలగాలు ఇంకా అప్రమత్తంగానే ఉన్నాయి. సిబిఐ కోర్టు డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు కారాగార శిక్ష విధించాక ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు సమాచారం అందలేదు. గుర్మీత్(50)ని రోహ్‌తక్ జిల్లాలోని సునరియా జైలులో ఉంచారు. దాని చుట్టు ప్రక్కలా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. హర్యానాలో సిర్సాలో ఉండే డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంకు వెళ్లే మార్గం తప్పించి అంతటా కర్ఫ్యూను ఎత్తేశారు. ముందస్తు జాగ్రత్త చర్యగా సిర్సా పట్టణంలోని వివిధ నాకాలలో సైన్యం, పారా మిలిటరీ బలగాలు, పోలీసులను మోహరించి ఉంచారు. సిర్సా జిల్లా పాలక యంత్రాంగం మంగళవారం 650 మందిని డేరా నుంచి వారి ప్రాంతాలకు పంపించేశారు. 18 ఏళ్ల లోపు 18 మంది బాలికలను డేరా నుంచి బయటికి రప్పించారు. హర్యానా రాష్ట్ర బస్సులను నడపేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్టు హర్యానా రవాణా శాఖ మంత్రి కిషన్ లాల్ పన్వర్ చెప్పారు. సిర్సా, ఫతేహబాద్ తప్పించి హర్యానాలోని అన్ని ప్రాంతాలకు బస్సులు నడుస్తాయని తెలిపారు. దీనికి ముందు శాంతిభద్రతల పరిస్థితి కారణంగా హర్యానాలోని 16 జిల్లాల్లో బస్సు సర్వీసులను రద్దు చేశారు. పరిస్థితులు చక్కబడ్డాక సిర్సా, ఫతేహబాద్‌లకు కూడా బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తామని కిషన్‌లాల్ పన్వర్ చెప్పారు. పంజాబ్‌లో మొబైల్ డేటా సర్వీసులను పునరుద్ధరించారు. పంజాబ్‌లో అధికారులు కర్ఫ్యూను ఎత్తివేశారు.

ఢిల్లీ హైకోర్టుకు 'రెరా' కేసులు

బదిలీకి కేంద్రం వినతి

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్(రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం(రెరా) చెల్లుబాటును సవాలు చేస్తూ వివిధ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన వినతిని సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ కేసు విచారణను వచ్చే వారం చేపట్టనున్నట్లు తెలిపింది.రెరా చట్టాన్ని సవాలు చేస్తూ 21 పిటిషన్లు దేశంలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం, ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు అమితవ రాయ్, ఎ.ఎం.ఖాన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనానికి తెలిపింది. న్యాయ నిర్ణయం(అడ్‌జుడికేషన్) కోసం ఈ పిటిషన్లన్నింటిని హైకోర్టుకు బదిలీ చేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ మహిందర్ సింగ్ ధర్మాసనానికి చెప్పారు. ఈ విషయంలో వ్యాజ్య బహుళత్వాన్ని తప్పించేందుకు బాంబే, కర్నాటక హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులతో సహా అన్నింటిని ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఈ కేసును సెప్టెంబర్ 4న విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది. రెరా చట్టాన్ని పార్లమెంటు ఆమోదించిన సంవత్సరం తర్వాత మే 1న అది అమలులోకి వచ్చింది. రెరా చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ బిల్డర్లు, ప్రమోటర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు సహా అనేక మంది పిటిషనర్లు వివిధ కోర్టుల్లో కేసులు వేశారు. రెరా చట్టంలోని వివిధ అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లకు ప్రతిస్పందన తెలుపాలని బాంబే హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

జిఎస్‌టిపై భయాలు నిర్హేతుకమైనవి

21వ 'ప్రగతి' సమావేశంలో ప్రధాని



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లోకి వచ్చి రెండు నెలల పూర్తి కావొస్తున్న నేపథ్యంలో దానిపై ఇప్పటివరకు నెలకొన్న భయాలు, ఆందోళనలు నిర్హేతుకమైనవిగా రుజువయ్యాయని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం అన్నారు. జిఎస్‌టి ఇపుడు సజావుగా అమలవుతోందని ఆయన చెప్పుకొచ్చారు. జిఎస్‌టి కింద రిజిస్ట్రేషన్లను పెంచడంతో పాటు ఈ దిశగా మరో నెల రోజుల్లో అద్భుత వృద్ధిని సాధించేందుకు కృషి చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆయన కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) ఒక ప్రకటనను విడుదల చేసింది. ఆయన అధ్యక్షతన 21వ 'క్రియాశీల పాలన, సకాల అమలు (ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్–ప్రగతి)' 21వ సమావేశం బుధవారం జరిగింది. ప్రగతి సమావేశంలో ఆయన ప్రతినెలా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని రాష్ట్రాల ఉన్నతాధికారులతో పలు ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తుంటారు. గత 20 సమావేశాల్లో మొత్తం రూ.8.79 లక్షల కోట్ల విలువైన 183 ప్రాజెక్టులపై ప్రధాని సమీక్షించారని పిఎంఒ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు 17 రంగాల్లో ప్రభుత్వానికి ఎదురైన సమస్యల పరిష్కారానికి తీసుకున్న నిర్ణయాలను కూడా ఆయన సమీక్షించారు. తాజా సమావేశంలో రైల్వేలు, రహదారి, విద్యుత్, ఆయిల్ పైప్‌లైన్, ఆరోగ్య రంగాలకు సంబంధించిన రూ.56 వేల కోట్లకు పైగా విలువైన కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ప్రధాని సమీక్షించారు. అలాగే ఢిల్లీ–ముంబై పారిశ్రామిక కారిడార్ (డిఎంఐసి), ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి, పశ్చిమ్‌బెంగాల్‌లోని కల్యాణి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, యుపిలోని గోరఖ్‌పూర్‌లలో నిర్మిస్తున్న నాలుగు కొత్త ఎయిమ్స్ ఆస్పత్రులు సహా పలు ప్రాజెక్టులపై కూడా ఆయన సమీక్షించారు. స్మార్ట్ నగరాల ప్రాజెక్టు, అటవీ హక్కుల చట్టం పురోగతిపై కూడా ఆయన సమీక్షించారని పిఎంఒ తెలిపింది. ప్రభుత్వ ఇ–మార్కెట్ ప్లేస్ (జిఇఎం) పోర్టల్ వల్ల పారదర్శకత మరింత పెరిగిందని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వ సేకరణల్లో జిఇఎంకి ప్రాధాన్యతను ఇవ్వాలని ఆయన అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కోరారు.

రాజ్‌నాథ్‌తో అన్నాడిఎంకె నేతల భేటీ

న్యూఢిల్లీ: తమిళనాడులోని అధికార అన్నాడిఎంకె నేతల బృందం బుధవారం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసింది. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలను మరింత మెరుగుపరుచుకునే ఉద్దేశంతోనే మంత్రిని తమ పార్టీ నేతలు కలిశారని అన్నాడిఎంకె నాయకుడు, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం.తంబిదురై చెప్పారు. తమ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల గురించి కేంద్ర మంత్రితో చర్చించలేదని ఆయన అన్నారు. ఇతర కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అరుణ్ జైట్లీని కూడా వారు మంగళవారం కలిసిన సంగతి తెలిసిందే. తమిళ సిఎం పళనిస్వామి, మాజీ సిఎం పన్నీర్ సెల్వం నాయకత్వాల్లోని అన్నాడిఎంకె వైరి వర్గాలు ఇటీవల విలీనమైన నేపథ్యంలో ఆ పార్టీ నేతలు కేంద్ర మంత్రులను కలుసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 'కేంద్రంతో స్నేహపూర్వక సంబంధాన్ని కొనసాగించేందుకు, పెండింగ్‌లో ఉన్న నిధులు, ప్రాజెక్టులను సాధించుకునే ఉద్దేశంతోనే మేము కేంద్ర మంత్రులను కలుస్తున్నాం' అని నాయకుల బృందానికి సారథ్యం వహించిన తంబిదురై అన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల గురించి మంత్రులతో చర్చించలేదని ఆయన చెప్పారు.

స్టెప్నీ శాటిలైట్‌కు కౌంట్‌డౌన్

నేడు పిఎస్‌ఎల్‌వి నుంచి ఐఆర్‌ఎస్ ప్రయోగం



బెంగళూరు: నౌకాయాన దిక్సూచీ ఉపగ్రహం ఐఆర్‌ఎన్‌ఎస్ఎస్–1 హెచ్ ప్రయోగానికి 29 గంటల కౌంట్ డౌన్ ఆరంభం అయింది. గురువారం ఈ ఉపగ్రహాన్ని శ్రీహరి కోట లోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం(షార్) నుంచి పిఎస్‌ఎల్‌వి –సి 39 రాకెట్ నుంచి ప్రయోగిస్తారు. 'నావ్ ఐసి సముదాయానికి చెందిన ఏడు ఉపగ్రహాల ప్రయోగ ప్రక్రియను వేగవంతం దిశలో భాగంగా ఈ శాటిలైట్‌ను రాత్రి ఏడు గంటలకు షార్‌లోని రెండవ లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగిస్తారని ఇస్రో వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ప్రయోగిస్తున్న శాటిలైట్ ఇప్పటికే కక్ష్యలో ఉన్న ఐఆర్‌ఎన్‌ఎస్ఎస్–1 స్థానంలో కక్ష్యలో ప్రవేశపెడుతున్నారు. నౌకాయానంలో కీలక సమాచారం అందించేందుకు ఇప్పటికే ఏడు ఉపగ్రహాలు పరిభ్రమిస్తున్నాయి. అయితే వీటిలో 1ఎ శాటిలైట్‌కు చెందిన అత్యంత ప్రామాణికమైన ఆటామిక్ వాచ్‌లు పనిచేయకుండా పోవడంతో ప్రత్యామ్నాయంగా ఈ శాటిలైట్‌ను పంపిస్తున్నారని ఇస్రో వర్గాలు బుధవారం తెలిపాయి. దీనికి సంబంధించిన సన్నాహక చర్యలు బుధవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఆరంభం అయ్యాయి. వాతావరణ పరిస్థితి, ఇతరత్రా అంశాలను బేరీజు వేసుకున్న తరువాత ప్రయోగ సంసిద్ధత కమిటీ (ఎంఆర్‌ఆర్), ప్రయోగ అధీకృత నిర్వాహక మండలి (లాబ్) కౌంట్‌డౌన్ ఉత్తర్వులు వెలువరించాయి. ఇక ఇస్రోకు నమ్మినబంటుగా ఉన్న పిఎస్‌ఎల్‌వి ప్రయోగవాహక శ్రేణి నుంచే దీనిని పరీక్షిస్తున్నారు. ఈ పిఎస్‌ఎల్‌వి –సి39 పిఎస్‌ఎల్‌వికి అధునాతన శ్రేణిగా రూపొందింది. ఆరు సముదాయాలుగా ఒక్కొక్కటి 12 టన్నుల సామాగ్రిని తీసుకువెళ్లే సామర్థ్యంతో ఈ ప్రయోగ నౌక బలాన్ని సంతరించుకుంది. నౌకా యానంతో పాటు ప్రాదేశిక సమాచారం, విపత్తు నిర్వహణ, వాహనాల నిఘా, దళాల నిర్వహణ, వాయిస్ నేవీగేషన్ వంటి ప్రత్యేకతలు గల ఈ ఉపగ్రహ శ్రేణిని నావ్ ఐసిగా వ్యవహరిస్తున్నారు. ఈ శ్రేణికి చెందిన ఏడు ఉపగ్రహాల ప్రయోగానికి అయ్యే వ్యయం రూ. 1,420 కోట్ల వరకూ ఉంటుందని ఇస్రో అధికారులు వెల్లడించారు.

అవినీతిపై సివిసి ఉద్యమం

- బ్యాంకులు, సంస్థలకు చైతన్య బాధ్యత
- విద్యాసంస్థలు, గ్రామ సభలలో ప్రచారం
- మీడియా, ప్రజల భాగస్వామ్యం

న్యూఢిల్లీ: దేశంలో అవినీతిని పారద్రోలేందుకు కేం ద్ర నిఘాసంస్థ (సివిసి) రంగంలోకి దిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, బీమా కంపెనీలు అవినీతి, లంచాల వ్యవహారాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం కల్గించే బాధ్యతను చేపట్టాలని ఆదేశించింది. స్కూళ్లు, కాలేజీలు, గ్రామసభలలో అవినీతి నిర్మూలనపై తగు ప్రచారం నిర్వహించేందుకు లక్ష్యాలను ఖరారు చేసుకోవాలని సూచించింది. అవినీతిపై కీలక నిఘా సంస్థ అయిన సివిసి దీనికి సంబంధించి ఇటీవలే బ్యాంకులు ఇతర సంస్థలకు ఉత్తర్వులు వెలువరించింది. బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలు, బీమా కంపెనీలకు ఇందులో భాగంగా నిర్ధిష్టంగా నగరాలను కేటాయించారు. విద్యాసంస్థలలో అవినీతి వ్యతిరేక ప్రచారం ఉధృతం చేయడం ద్వారా విద్యార్థులలో చైతన్యం తీసుకురావడానికి వీలేర్పడుతుంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థలు అదనంగా ఈ చైతన్య బాధ్యతను తీసుకోవాలని సివిసి ఆదేశించింది. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు కనీసం రెండు మూడు స్కూళ్లలో దీనిపై చైతన్యం కల్పించే బాధ్యతను తీసుకోవల్సి ఉంటుంది. దీనికి సంబంధించి మొత్తం 163 నగరాలు, పట్టణాలను ఎంపిక చేశారు. 96 సంస్థలను కూడా ఎంచుకున్నారు. ప్రత్యేకించి స్కూళ్లల్లో నైతికతను ప్రబోధించే కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటిని క్రమం తప్పకుండా కొంతకాలం అయినా నిర్వహించాలి. యువతరం మనస్సుల్లో నైతిక విలువలు అందులో ప్రత్యేకించి లంచానికి వ్యతిరేకంగా ఆలోచనలు నాటుకునేలా చేయడానికి రంగం సిద్ధం చేయాల్సి ఉంటుందని సివిసి ఆదేశించింది. ఇక గ్రామసభలలో అవినీతి జాడలు లేకుండా చేసేందుకు ఉద్యమస్థాయి కార్యక్రమం చేపట్టాలని సూచించారు. దీని వల్ల గ్రామీణ, పట్టణ స్థాయిలలో దీనిపై తగు విధంగా స్పందనకు వీలేర్పడుతుంది. ఇక సంస్థలే కాకుండా ప్రజలు కూడా సంఘాల ద్వారా విడిగా కూడా ప్రతి ప్రాంతంలో సెమీనార్లు, చైతన్యవేదికలను ఏర్పాటు చేసేందుకు కూడా వీలు కల్పించాలని సివిసి నిర్ణయించింది. ఇక బ్యాంకుల ద్వారా చైతన్య కార్యక్రమాలను ప్రజలందరి వద్దకు ఎక్కువగా తీసుకువెళ్లేందుకు వీలేర్పడుతుందని సంకల్పించారు.వివిధ రకాల ప్రచార మాధ్యమాలను విరివిగా వినియోగించుకోవాలని, పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమం, టోకు సంక్షిప్త సందేశాలు(ఎస్‌ఎంఎస్), ఇ మెయిల్ వంటి వాటి ద్వారా అవినీతికి వ్యతిరేకంగా ప్రచారం తీవ్రతరం చేయవచ్చునని సివిసి స్పష్టం చేసింది. సివిసి ఆదేశాల మేరకు ఇప్పటికే ఎస్‌బిఐ వారు ఢిల్లీ, పాట్నా, గయ, రాయ్‌పూర్ వంటి 50 నగరాలను తమ వేదికలుగా ఎంచుకుంది. అవినీతి వ్యతిరేక ప్రచారానికి సిద్ధం అయింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా ఈ క్రమంలో కార్యక్రమాలకు సిద్ధం అయ్యాయి. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 4 వరకూ సాగే విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగానే సివిసి ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టింది.

ఎంబిబిఎస్‌పై కేంద్రానికి సుప్రీం షాక్

న్యూఢిల్లీ: మెడికల్ కోర్సులో విద్యార్థులను చేర్చుకోరాదని డెహ్రాడూన్‌కు చెందిన మెడికల్ కాలేజ్‌ను డిబార్ చేస్తూ కేంద్ర జారీ చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు బుధవారం కొట్టేసింది. 2017–18 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్‌లో చేర్చుకోడానికి ఆ కాలేజికి 150 సీట్ల అనుమతిని ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ప్రభుత్వాన్ని, భారతీయ వైద్య మండలి(ఎంసిఐ)ను ఆదేశించింది. ఓ ట్రస్ట్ పెట్టుకున్న పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు తీర్పు చెప్పింది. కోర్టు తన తీర్పు భారతీయ వైద్య మండలికి ఆటంకం కాదని తెలుపుతూ కాలేజ్ వ్యవహారాలను కావాలనుకున్నప్పుడు తనిఖీచేసి లోటుపాట్లను పరిశీలించుకోవచ్చని స్పష్టం చేసింది. ఏవైనా కొరతలున్నట్లయితే చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఎంసిఐకి ఉంటుందని తెలిపింది.



1న తిరుమలకు రాష్ట్రపతి రాక

అమరావతి: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరుమల తిరుపతిని సందర్శించనున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి రెండు రోజుల పాటు కోవింద్ తిరుమలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రపతి కోసంప్రత్యేకమైన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. సెప్టెంబర్ 1న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కోవింద్ తిరుపతికి చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుచానూర్‌లోని పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, సిఎంచంద్రబాబుతో కలిసి ఆయనకు స్వాగతం పలకనున్నారు. అనంతరం కోవింద్ శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైనెన్స్‌కు వెళ్లనున్నారు. ఆ తరువాత ఓ ఆస్పత్రి భవనాన్ని కూడా కోవింద్ ప్రారంభించనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో కోవింద్‌ను రాష్ట్ర ప్రభుత్వం సన్మానించనుంది. బిఆర్ అంబేద్కర్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 'స్టాండ్ అప్ ఇండియా' కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కోవింద్ ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 7 గంటలకు శిల్పారావంలో ప్రభుత్వ విందుకు రాష్ట్రపతి హాజరవుతారు. అనంతరం అక్కడి నుంచి తిరుమల కొండకు కోవింద్ పయనమవుతారు. ఆ రాత్రి అక్కడే బస చేసి మరుసటి రోజు ఉదయం స్వామి వారిని దర్శించుకుంటారు.

ఐటిఐలకు అధిక మొత్తంలో నిధులు

ప్రతాప్ రూఢీని కోరిన మంత్రి దత్తాత్రేయ

మన తెలంగాణ/న్యూఢిల్లీ : పరిశ్రమలలో నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని 26 ఐటిఐలకు అధిక మొత్తంలో నిధులు ఇవ్వాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూఢీని బుధవారం ఆయన కార్యాలయంలో కలిసిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి దత్తాత్రేయ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించిన దత్తాత్రేయ సమావేశానికి సంబంధించిన విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న ఐటిఐ లను మోడల్ ఐటిఐలుగా మార్చాలని కేంద్ర స్కిల్ డెవలప్ మెంట్ మంత్రిని కోరానన్నారు. దీనిలో భాగంగా ఎపికి 2కోట్ల80లక్షలు, తెలంగాణకు 1కోటి 22లక్షలు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకు 6కోట్ల 79లక్షల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. అదేవిధంగా తెలంగాణలో అవసరమున్నచోట పలు కొత్త ఐటిఐలు ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర మంత్రి రాజీ ప్రతాప్ రూఢీని కోరాన్నా న్నారు. దీంతో పాటుగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల నుండి పెద్దమొత్తంలో విడుదలయిన నిధుల వివరాలను కూడా వెల్లడించారు. ఎస్‌సి స్కాలర్ షిప్ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి చెందిన 9లక్షల 14వేల 281మంది విద్యార్థులకు 567కోట్ల 96లక్షల నిధులను విడుదల చేశామని దత్తాత్రేయ తెలిపారు.

విమోచన దినాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తాం

మన తెలంగాణ /న్యూఢిల్లీ: తెలంగాణ విమోచన దినాన్ని బిజెపి పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి దత్తాత్రేయ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గతంలో అన్ని పార్టీలు డిమాండ్ చేశాయని బుధవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపకపోవడం చాలా దారుణం, బాధాకరం అన్నారు.సెప్టెంబర్ 1 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. సెప్టెంబర్ 2న తాను పర్కాలలో అమరవీరుల స్మారక చిహ్నం సందర్శిస్తానని వెల్లడించారు. తెలంగాణ విమోచన దినం ఏ మతానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. విమోచన దినోత్సవం మైనారిటీలకు వ్యతిరేకం అన్న భావనలో అధికార టిఆర్ఎస్ పార్టీలో ఉందని కేంద్రమంత్రి దత్తాత్రేయ స్పష్టంచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని టిఆర్ఎస్ పై ధ్వజమెత్తారు.

లైంగిక వేధింపుల కేసులో ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్



మన తెలంగాణ/హాలియా : విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాడన్న ఫిర్యాదుపై నల్గొండ జిల్లా అనుముల మండలం హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని అధికారులు సస్పెండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తిని విద్యార్థినుల ఫిర్యాదు మేరకు సిసిఎ రూల్ 1, 1991 ప్రకారం సస్పెండ్ చేస్తున్నట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే విచారణ కమిటీని ఏర్పాటు చేసి విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయుడిని ఎఫ్ఎసి చార్జ్ అప్పగించి పాఠశాల సజావుగా నడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిరంతరం విద్యార్థులకు చక్కటి విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, విద్యార్థులు ఎలాంటి సమస్య ఉన్నా బయటపడకుండా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు దాసా వెంకన్న తదితరులు ఉన్నారు.

చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యుల విచారణ: పాఠశాల విద్యార్థులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వార్తాపత్రికల ద్వారా తెలుసుకున్న జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు బుధవారం సాయంత్రం హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి బాలికల తల్లి అదే విధంగా 8, 9 తరగతి విద్యార్థినులచే విచారణ నిర్వహించారు. బాలికలకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా 1098కు ఫోన్ చేస్తే తక్షణమే స్పందిస్తామని సభ్యులు తెలిపారు. బాలికల తల్లి, విద్యార్థినుల వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నామని దీనిని జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. చైల్డ్ హెల్ లైన్ సభ్యులు చిట్టి, రేవతిలు విచారణ నిర్వహించారు.

పావలా వడ్డీ రుణాలు మంజూరు

మన తెలంగాణ/హైదరాబాద్ : వడ్డీ లేని రుణా లు, పావలా వడ్డీ నిధులు రూ. 192 కోట్లకు సం బంధించి ప్రభుత్వంపరిపాలనఅనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం వ్యవసా య కార్యదర్శి సి. పార్థసారధి ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు బాబుతో టిడిపి నేతల భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి సిఎం చంద్రబాబుతో టిడిపి నేతలు గురువారం అమరావతిలో భేటీ కానున్నారు. సింగరేణి ఎన్నికలు, భూసర్వే, రైతు సమన్వయ సమితులపై పార్టీ తీసుకోవాల్సిన కార్యక్రమాలు, తాజా రాజకీయ పరిణామాలపైచర్చించి నిర్ణయ ం తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలోనే రాష్ట్ర కమిటీ ఫైనల్ చేయనున్నట్లు తెలిసింది.

నియోజకవర్గాల నేతలతో భేటీ : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం నియోజకవర్గాల నేతలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల బలోపేతంపై చర్చించారు. ముఖ్యంగా సింగరేణి ఎన్నికలలో అ నుసరించాల్సిన వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.జిల్లాలలో టిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీని బలోపేతం చేసే విధంగా చర్చించారు.

'నేరెళ్ల'పై అధికారుల నివేదికలు సిద్ధం కౌంటర్‌కు సమయం ఇవ్వండి

మన తెలంగాణ/ హైదరాబాద్ : నేరెళ్లలో దళితులపై వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల నివేదికలు సిద్ధంగా ఉన్నాయని, వాటి ఆధారంగా కౌంటర్ వ్యాజ్యాలు వేసేందుకు వ్యవధి కావాలని తెలంగాణ ఎజి డి. ప్రకాష్ రెడ్డి హైకోర్టును కోరారు. సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురం గ్రామస్థులపై పోలీసులు దాడి చేసిన ఘటనపై సిబిఐ విచారణ చేయించాలని పౌర హక్కుల సంఘం నేత లక్ష్మ ణ్, ఈ ఘటన దారుణమంటూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ రాసిన లేఖలను హైకోర్టు పిల్స్‌గా పరిగణించి విచారణ చేస్తున్న విషయం విదితమే. వీటిపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ ఘటనలో ఎస్‌ఐ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినందునే సస్పెండ్ చేశామని, బాధితులు ఆరుగురిలో ఇద్దరికి వైద్యం అందించబోతే మిగిలిన నలుగురితో కలిసే తాము వైద్యం పొందుతామని మొండికేస్తున్నారని ఎజి తెలిపారు. నిజానికి ఆ నలుగురికీ వైద్య సేవలు అవసరం లేదన్నారు. బాధితుల్ని జైలుకు తీసుకువెళ్లినప్పుడు వారికి గాయాలున్నాయని, అందుకే జైలు అధికారి వారిని జైల్లోకి తీసుకునేందుకు నిరాకరించారని చెప్పారు. ఈ నివేదికలపై కౌంటర్ కాపీని పిటిషనర్ లాయర్‌కు అందజేయాలని, ఆ తర్వాత ఇరువురి వాదనల్ని సెప్టెంబర్ 5న విచారిస్తామని బెంచ్ వెల్లడించింది.

ఇది ఆరంభం మాత్రమే

● జపాన్‌పై తాజా క్షిపణి పరీక్షను సమర్థించుకున్న ఉత్తర కొరియా

సియోల్: జపాన్‌ను గురిపెట్టి మరిన్ని ఖండాంతర క్షిపణి దాడులను జరపుతానని ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్–యున్ ప్రకటించారు. తాజాగా సోమవారం జరిపిన క్షిపణి దాడి కేవలం 'కర్టెన్ రైజర్' మాత్రమే అని కూడా ఆయన పేర్కొన్నారు. జపాన్ మీదుగా దూసుకెళ్లి సముద్రంలోపడిన తాజా క్షిపణి పాటవ పరీక్షకుగాను ఉత్తర కొరియా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవలసి ఉంటుందని ఐక్యరాజ్య సమితి, అమెరికా హెచ్చరించినప్పటికీ కిమ్ కవ్వింపు ప్రకటనలు మానుకోకుండా జపాన్‌పై క్షిపణి యుద్ధ ప్రకటన తాజాగా చేశారు. ఆ దేశం జపాన్‌పై ప్రయోగించిన తాజా క్షిపణి హాసాంగ్ – 12 ఇంటర్మీడియెట్ రేంజ్‌కి చెందినది. ఈ పాటవ పరీక్షతో ఉత్తర కొరియా అణ్వాయుధ కార్యక్రమాలపట్ల ఈసరికే నెలకొన్న ఉద్రిక్తత తీవ్ర స్థాయికి చేరింది. కొద్ది వారాల క్రితం అమెరికా భూభాగమైన గువాంగ్ దీవిపై క్షిపణి దాడి జరుపుతామని కిమ్ కవ్వింపు ప్రకటన చేశారు. అందుకు ప్రతిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేస్తూ, ఉత్తర కొరియాను మాడ్చి మసి చేస్తామని గర్జించారు. అమెరికా ఆ దేశపు తాజా కవ్వింపుపై తీవ్రంగా ప్రతిస్పందిస్తూ అన్ని మార్గాంతరాలు పరిశీలనలో ఉన్నాయని ప్రకటించారు. ఉత్తర కొరియా కీలక మిత్రదేశం చైనాతో పాటు రష్యా కూడా ఐరాసలో అమెరికా రూపొందించిన తీర్మానాన్ని బలపరిచాయి.

ఐరాస తాజా హెచ్చరిక : ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఉత్తర కొరియా తాజా దాడిపై అత్యవసర రహస్య సమావేశం జరిపి చర్చించింది. అణ్వాయుధాల కార్యక్రమాన్ని ఆ దేశం తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఉత్తర కొరియా చర్యలు కేవలం ఆ ప్రాంతానికేకాక మొత్తం ఐరాస సభ్యత్వ దేశాలన్నింటికీ ప్రమాదకరమని తీర్మానంలో ఐరాస విమర్శించింది. ఇంతకు ముందు ఐరాస భద్రతా మండలి ఉత్తర కొరియాపై ఏడు దఫాల ఆంక్షలు విధించింది. ఉత్తర కొరియాలో జపాన్‌ను గురిపెట్టి చేసిన తాజా క్షిపణి దాడి తాలూకు 20చిత్రాలతో అధికార పార్టీ పత్రిక రోడోంగ్ సిన్‌మున్ వార్త ప్రచురించింది. మరిన్ని క్షిపణి దాడులు జరుపుతామని కిమ్ అన్నట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

ఇటువంటి ప్రకటన ఇదే మొదటిది : జపాన్‌పై క్షిపణి ప్రయోగం జరిపామని బాహాటంగా బుధవారం నాటి తాజా ప్రకటనలోనే ఉత్తర కొరియా ఒప్పుకొంది. ఇంతకు ముందు 1998, 2009లో జపాన్‌పైకి రాకెట్లు ప్రయోగించింది. అయితే అవి రోదసీ వాహనాలని వివరణ ఇచ్చింది. దాడి జరిపామని బాహాటంగా ఆ దేశం ఒప్పుకోవడం ఇదే ప్రథమం.

అమెరికా దాడికి సమయం మించిపోయింది: బ్యానన్ : ఉత్తర కొరియాపై అమెరికా ముందుగా దాడి చేసే అవకాశాలు ఇప్పుడు లేవని అమెరికా ప్రభుత్వాధికారులు రహస్యంగా చెప్పారు. అందుకు సమయం మించిపోయిందని మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బ్యానన్ అన్నారు. ఆ సమస్యకు సైనిక చర్య పరిష్కారం కాబోదని ఆయన వ్యాఖ్యానించారు.

అమెరికా రక్షణ పరీక్ష

జపాన్ ప్రయోగాత్మక క్షిపణి అమెరికా కూల్చివేత



హవాయి దీవిని గురిపెట్టి జపాన్ రక్షణ తర్ఫీదుగా ప్రయోగించిన మీడియం రేంజ్ ఖండాంతర క్షిపణిని అమెరికా సైన్యం కూల్చివేసింది. ఈ కూల్చివేత పరీక్షలో భాగం. బుధవారం తెల్లవారు జామున జపాన్ ఈ క్షిపణి పరీక్ష జరిపింది. ఉత్తర కొరియా కవ్వింపు చర్యల నుంచి రక్షణకు ఈ ప్రయోగాన్ని జపాన్ జరిపింది. ఈ పరీక్షను అమెరికా క్షిపణి రక్షణ సంస్థ (ఎండిఎ), అమెరికా నౌకాదళం కలిసి నిర్వహించాయి. ఉత్తర కొరియా జపాన్‌ను గురిపెట్టి క్షిపణిని ప్రయోగించిన మరునాడు అమెరికా ఈ క్షిపణి విధ్వంసక ప్రయోగాన్ని జరిపింది.

భారత్ పాఠాలు నేర్వాలి : చైనా

● 'ఇండియా వైదొలగడం వల్లనే సమస్య పరిష్కారం'

బీజింగ్: భారత దేశం తన సైనిక బలగాలను డోక్లాం నుంచి ఉపసంహరించుకోవడంతో 73 రోజుల ప్రతిష్టంభనకు తెరపడినట్లు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఇ బుధవారం నాడు ప్రకటించారు. ఈ ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకొని భవిష్యత్తులో అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని భారత ప్రభుత్వాన్ని చైనా కోరింది. భారతీయ బలగాల అతిక్రమణ వల్ల ఏర్పడిన సరిహద్దు ప్రతిష్టంభన తొలగిందని వాంగ్ మీడియాకు తెలిపారు. చైనా ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ఆగస్టు 28 మధ్యాహ్నం భారతీయ బలగాలు అక్కడి నుంచి వైదొలగినట్లు వాంగ్ తెలిపారు. అయితే మీడియా అనేక ఊహాగానాలు ప్రచారం చేసినా అధికారికంగా వాస్తవం అదేనని ఆయన చెప్పారు. వచ్చే వారం జియామెన్ నగరంలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సభ పై ఈ విలేకరుల గోష్ఠి ఏర్పాటు అయింది. అందులో ఇరుదేశాల మధ్య డోక్లాం వివాదం వల్ల ఏర్పడిన భేదాభిప్రాయాల గురించి వాంగ్ మాట్లాడుతూ, ఇరు దేశాలు పెద్ద దేశాలు కాబట్టి అటువంటి సమస్యలు పరస్పర కార్యాచరణలో సహజమని అన్నారు. చైనా ప్రకటనపై భారత విదే శ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార్లు తక్షణం ఎటువంటి వ్యాఖ్య చేయలేదు.

బిఎస్ఎన్ఎల్ వెల్‌కం ఆఫర్

మన తెలంగాణ / హైదరాబాద్ : బిఎస్ఎన్ఎల్ బుధవారం నుండి తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషనల్ వెల్‌కం ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్‌లో కొత్త వినియోగదారులు, ఎంఎన్‌పి ద్వారా పోర్ట్ ఇన్ అయిన వినియోగదారులకు 350 ఎంబి ఉచిత డాటా ఇవ్వనున్నట్లు తెలిపింది. మొదటి 30 రోజులలోపు ఈ డాటా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, ఈ ఆఫర్ పరిమితం కాలమే ఉంటుందని బిఎస్ఎన్ఎల్ తెలంగాణ సర్కిల్ సిజిఎం అనంతరాము ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు బిఎస్ఎన్ఎల్ టోల్ ఫ్రీ నెం. 1503 లేదా 18001801503కి ఫోన్ చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

మెరుగైన సేవలకు ఎయిర్‌టెల్‌తో టెలినార్ ఎంఓయూ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతర్గత సర్కిల్ పరిధిలో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఎయిర్‌టెల్‌తో టెలినార్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నూతన ఒప్పందం ద్వారా అర్హులైన చందాదారులు ఇక నుండి ఇంటరాప్షన్స్ లేని ఫోన్ కాల్స్, 3జి, 4 జి ఇంటర్‌నెట్ సేవలతో పాటు హై స్పీడ్ ఇంటర్‌నెట్‌ను వినియోగదారులు ఈ రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణిస్తున్నప్పుడు, లేదా తమ స్వరాష్ట్రంలోనూ ఉన్నప్పుడు పొందేలా చూడనున్నట్లు టెలినార్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కిల్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ కొటియన్ వెల్లడించారు. డాటా, వాయిస్ కాల్ సేవలను మరింత సజావుగా పొందే వీలు కల్గుతుందన్నారు. రూ. 9 నుండి మొదలుకొని రూ. 349 వరకు నెలకు 28 జిబి వరకు డాటాను అందించే టారీఫ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

ముషర్రఫ్‌కు హత్య కేసు నుంచి ఊరట

కరాచి: బెలూచిస్థాన్ హైకోర్టులో పాకిస్థాన్ మాజీ నియంత పర్వేజ్ ముషర్రఫ్‌కు ఊరట లభించింది. బలోచ్ నేషనలిస్టు నేత నవాబ్ అక్బర్ ఖాన్ బుగ్తిని 2006లో సైనిక చర్య ద్వారా చంపించిన కేసు నుంచి ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాలు చేసే అపీల్‌ను కోర్టు బుధవారం నాడు కొట్టివేసింది. బెలూచిస్థాన్‌కు రాజకీయ స్వయం ప్రతిపత్తి కోసం గిరిజన ఉద్యమాన్ని బుగ్తి నడిపారు. ఆ రాష్ట్రంపైకి సైన్యాన్ని ముషర్రఫ్ 2005లో పంపారు.

విదేశాల్లో జిహాదీ పాకిస్థానీలపై ఆరా

● సమాచారాన్ని సేకరిస్తున్న పాక్

ఇస్లామాబాద్: టెర్రర్ గ్రూపులతో కలిసి విదేశాల్లో జిహాదీ పోరాటాన్ని సాగించడానికి ప్రయత్నిస్తున్న తమ దేశం వారి బోగట్టాను పాకిస్థాన్ సేకరిస్తోంది. ఈ విషయాన్ని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఇరాక్‌లో ఐఎస్ ఉగ్రవాదుల ఓటమి వల్ల ప్రతికార చర్యగా అటువంటి జిహాదీ పోరాటం విదేశాల్లో సాగే ప్రమాదం ఉండడంతో పాకిస్థాన్ ఈ చర్య తీసుకుంటోంది. మధ్యప్రాచ్యంలో భీకర ఐఎస్ టెర్రర్ గ్రూప్ మొదలయినప్పటి నుంచి కనీసం 100 మంది పాకిస్థానీలు ఇరాక్, సిరియాలకు వలసపోయారు. వారందరి సమాచారాన్ని కౌంటర్ టెర్రరిజం అథారిటీ సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

లూయిసియానాకు వ్యాపించిన తుపాను బీభత్సం

- **హార్వే మళ్లీ తాండవం: నేడు భారీ వర్షం?**
- **హూస్టన్‌లో 30 మంది దుర్మరణం**
- **వందలాది మంది ఇండియన్ – అమెరికన్లకు అందుతున్న సహాయం**



హూస్టన్: టెక్సాస్‌ను అల్లకల్లోలం చేసిన ఐదు రోజుల తర్వాత హార్వే తుఫాను వల్ల బుధవారం నాడు రెండవ దఫా విధ్వంస తాండవం లూయిసియానాకు వ్యాపించింది. 2005 నాటి కత్రినా హరికేన్ నుంచి ఇంకా కోలుకోని ఆ రాష్ట్రం తాజా తుఫాను తాకిడికి తల్లడిల్లింది. కేమరోన్ పట్టణానికి పశ్చిమంగా హార్వే నేలను తాకింది. దీని ప్రభావంతో భీకర వర్షాలు కురిసి వరదలు టెక్సాస్, పొరుగునగల లూయిసియానాలలో చాలా ప్రాంతాలను నీట ముంచాయి. హార్వే టెక్సాస్‌ను రికార్డు స్థాయి వర్షపాతంతో తీవ్రంగా ముంచెత్తిన తర్వాత మళ్లీ సంభవించింది. దీని ప్రభావంతో రోడ్లు మడుగులుగా మారాయి. అమెరికాలోని నాలుగవ పెద్ద నగరం హూస్టన్‌లో వేలాది మంది నిరాశ్రయుల య్యారు. లూయిసియానాలో హార్వే ప్రభావంతో గంటకు 45 మైళ్ల (72 కి.మీ.) వేగంతో గాలులు వీచాయి. ఈ ప్రాంతాన్ని మరో 10 అంగుళాల (13 నుంచి 25 సెం.మీ.) వర్షపాతం ముంచెత్తుతుందని హెచ్చరికలు వెలువడ్డాయి. నేడో రేపో హార్వే క్రమంగా బలహీనపడుతుందని అధికారులు భావిస్తున్నారు. న్యూ ఆర్లీన్స్ ఇప్పటికీ హార్వే ప్రమాదంలోనే ఉంది. ఈ నగరం 12 ఏళ్ల క్రితం కత్రినా మిగిల్చిన విధ్వంసం నుంచి ఇప్పటికీ కోలుకోలేదు. జాజ్, రకరకాల వంటకాలకు ఈ నగరం ప్రసిద్ధి. ఆగ్నేయ లూయిసియానా, దక్షిణ మిసిసిపిలకు భారీ వర్ష సూచన గురువారం దాకా కొనసాగవచ్చు. టెక్సాస్‌లో అత్యవసర సహాయక సిబ్బంది వందలాది మంది బాధితులను చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నిరంతర సహాయక చర్యలు సాగుతున్నాయి. హార్వే వర్షపాతం విషయంలో పాత రికార్డులను అధిగమించిందని జాతీయ వాతావరణ సేవల కేంద్రం (ఎన్‌డబ్ల్యుఎస్) తెలిపింది. హూస్టన్‌లో మంగళవారం రాత్రంతా కర్ఫ్యూ కొనసాగింది. తెల్లవారిన తర్వాత సహాయక సిబ్బంది బాధితుల కోసం గాలింపు సాగించారు. నీట మునిగిన హూస్టన్ నగరంలో ఒక వంతెన కూలిపోయింది. ఈ నగరంలో నీరు నిలిచి ఉండడంతో ఎంతమంది మరణించినదీ, ఎంత విధ్వంసం జరిగినదీ అంచనా వేయడం కుదరడం లేదు. కనీసం 30 మంది ఈ నగరంలో మరణించారని ఒక అధికారిక అంచనా. ఈ సంఖ్య పెరిగే సూచన కూడా ఉంది. హూస్టన్ నగరంలో 24 ఏళ్ల భారతీయ విద్యార్థి బుధవారం నాడు ఆసుపత్రిలో మరణించాడు. అతడిని ఒక సరస్సులో మునిగిపోతుండగా సహాయకులు రక్షించి ఆసుపత్రిలో చేర్చారు. టెక్సాస్ రాష్ట్రంలోని సరస్సు అది. అక్కడి ఎ అండ్ ఎం యూనివర్శిటీ విద్యార్థి అయిన నిఖిల్ భాటియా ఆసుపత్రిలో మరణించగా, అతడితోపాటు ప్రమాదకర స్థితిలో ఉన్న మరో విద్యార్థిని షాలినీ సింగ్ అక్కడే వైద్యం పొందుతున్నారు. వారిరువురూ బైరాన్ సరస్సులో శనివారం నాడు ఈతకు వెళ్లి మునిగిపోతుండగా సహాయక సిబ్బంది రక్షించారు. భాటియా జైపూర్ వాసి. షాలినీ న్యూఢిల్లీకి చెందిన వారు. ఇక్కడి భారత కాన్సులేట్ ఈ వివరాలు అందించింది. వారు ఈదుతుండగా బలమైన కెరటాలు లోతులకు లాక్కుపోవడంతో వారి పరిస్థితి క్షీణించింది. హూస్టన్ యూనివర్శిటీలో చిక్కుకున్న 200 మంది భారతీయ విద్యార్థులకు ఇండియన్ – అమెరికన్లు ఆహారం, ఇతర అత్యవసరాలను అందిస్తున్నారు. వారిని హూస్టన్‌లోని భారత కాన్సల్ జనరల్ నిరంతరం సంప్రదిస్తున్నారు. ఆ నగరంలోగల వందలాది మంది భారతీయ విద్యార్థులకు అవసరపడిన ఆహార సరఫరాలను కాన్సులేట్ అందిస్తోంది. 250 మంది భారతీయ విద్యార్థులు చిక్కడిపోయిన నివాస భవన సముదాయానికి కాన్సల్ జనరల్ రే చేరుకొని సహాయక చర్యలు సాగించారు. హూస్టన్ లోపల, చుట్టుప్రక్కల లక్ష మంది దాకా ఇండియన్– అమెరికన్లు నివసిస్తున్నారు. వారు హార్వే తుఫానువల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోనేస్టార్ రాష్ట్రంలో డ్యామ్‌లకు గండ్లుపడే ప్రమాదం ఉందని అధికార్లు చెప్పారు.

1న సామూహిక సెలవులు

మన తెలంగాణ /సిటీ బ్యూరో: కంట్రిబ్యూషనరీ పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయ, ఉద్యోగలోకం సంసిద్ధం అవుతున్నాయి. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత కొంత కాలంగా దశలవారీగా ఉద్యమిస్తున్న జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీతో పాటు ఉద్యోగాల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నగర వ్యాప్తంగా నిరసన గళం వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. తమ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా మారిన కంట్రిబూషనరీ పెన్షన్ విధానం 2004 సెప్టెంబర్ 1వ తేదీన అమల్లోకి రావడంతో 1వ తేదీని విద్రోహ దినంగా పాటించనున్నట్లు ప్రకటించాయి. అదే విధంగా శుక్రవారం ఉపాధ్యా య, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఎదు ట ఆందోళలను చేపట్టనున్నారు. జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సెలవులను పెట్టి నిరస న వ్యక్తం చేయడంతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నాయి. తెలంగాణ గెజిటెట్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘాలతో జిల్లా రెవె న్యూ ఉద్యోగు ల సంఘం, నాల్గోవ తరగతి ఉ ద్యోగులు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళల కు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల అందోళనలకు పలు ప్రవేట్ ఉద్యోగుల సంఘా లు సైతం సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. జీవిత కాలం సేవలందించిన ఉద్యోగులకు రిటైర్డుమెంట్ అనంతరం భద్రత కల్పించే పెన్షన్ పాత విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే అని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణయాదవ్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం ప్రాథమిక హక్కు అని దానిని హరించే అధికారం ఏ ప్రభుత్వాలకు లేదని, జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం. రవీందర్ అన్నారు.

నకిలీ సర్వేలు, బోగస్ అవార్డులు : ఉత్తమ్

మన తెలంగాణ/హైదరాబాద్ : మూడున్నర సంవత్సరాల కెసిఆర్ రాష్ట్ర పాలన పూర్తి అబద్ధాలు, అసత్యాలు, నకిలీ సర్వేలు, బోగస్ అవార్డులతో సాగుతోందని పిసిసి చీఫ్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. గాంధీభవన్‌లో ఎంఎల్‌ఎ సంపత్‌కుమార్, అధికార ప్రతినిధులు మల్లు రవి, దాసోజు శ్రవణ్ కుమార్ తదితరులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ రంగ సంస్థ ఉత్తమ రైతు అవార్డును ఇచ్చిందంటూ ప్రచారం చేసుకున్నారని, ఇదంతా భూటకమని ఆయన ఆధారాలను బయట పెట్టారు. ఈ విషయంలో మీడియా కూడా తప్పులో కాలేసి కెసిఆర్‌ను ఆకాశానికెత్తుతూ వార్తలు రాయడం పట్ల ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఏడాదికి కేవలం రూ. 21 వేలు ఖర్చు చేసిన సంస్థ ఏదో తన వ్యాపార విస్తరణ కోసం సిఎంకు అవార్డు ఇచ్చినట్లు ప్రకటించిందన్నారు. ఈ అవార్డుపై వాస్తవాలను తెలుసుకోకుండా గవర్నర్ కార్యాలయం కూడా కెసిఆర్‌ను ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేస్తూ పత్రికలను ప్రకటనలను జారీ చేయడం మరీ దారుణమన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వారిపై విమర్శలు చేయడం లేదంటూనే రాజ్‌భవన్ సచివాలయ పనితీరును ఆయన తప్పుపట్టారు. పనికి మాలిన సంస్థ అవార్డు ఇచ్చినట్లు ప్రకటిస్తే మంత్రులు, ప్రజా ప్రతినిధులు క్యూ కట్టి అభినందనలు తెలపడం, అందుకు కెసిఆర్ ఆనందించడం చూస్తుంటే ఆయన పాలన ఎలాంటిదో స్పష్టమవుతుందన్నారు. మూడున్నర సంవత్సరాల పాటు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి, రైతులను గాలికి వదిలేసినందుకు కేంద్రం అవార్డు ఇస్తుందా, రైతుల ఆత్మహత్యలలో రాష్ట్రాన్ని దేశంలోనే రెండవ స్థానంలో నిలిపినందుకు అవార్డు ఇవ్వాలా, రైతు రుణ మాఫీ విషయంలో రైతులను నట్టేట ముంచినందుకు ఇవ్వాలా, కేంద్రం ఇచ్చిన సబ్సిడీని రైతులకు అందించకుండా ఉన్నందుకు ఇవ్వాలా, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంలో వైఫల్యం చెందినందుకు ఇవ్వాలా, మద్దతు ధరకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా ఉన్నందుకు ఇవ్వాలా, ధరల స్థిరీకరణకు నిధిని పెట్టనందుకు ఇవ్వాలా,రైతుల రుణాలకు వడ్డీని చెల్లిస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి చేతలుడిగి చూస్తున్నందుకు ఇవ్వాలా,రైతులకు బేడీలు వేసి తీవ్రవాదులుగా చూసినందుకు అవార్డు ఇవ్వాలా కెసిఆర్ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్‌ను కీర్తిస్తూ వార్తలు ప్రచురించిన పత్రికలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని,ఆయనకిచ్చిన అవార్డు కేవలం వ్యాపారం కోసమేనన్న విషయాన్ని తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

ఎన్నికల కోసమే రైతు సమన్వయ సమితిలు : ఏడాది కాలంలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గ్రామాలలో టిఆర్ఎస్ కార్యకర్తలకు పదవులను కట్టబెట్టేందుకే రైతు సమన్వయ సమితిల ఏర్పాటుకు కెసిఆర్ తెరతీశారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రైతు సమన్వయ సమితిలపై వెంటనే అఖిల పక్షం ఏర్పాటు చేసి చర్చించి నిర్ణయం తీసుకోవాలని, ఈ సమితిలలో రాజకీయ పార్టీల ప్రమేయం ఏ మాత్రం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సమితిలు, భూ సర్వేలలో రాజకీయ జోక్యం ఉండరాన్నది కాంగ్రెస్ విధానమన్నారు.

ఎకోబీట్‌పై జాతీయ వర్క్‌షాప్

మన తెలంగాణ/హైదరాబాద్: నగరంలో ఎకోబీట్ 2017 జాతీయ స్థాయి వైజ్ఞానిక కార్యక్రమం, వర్క్‌షాప్‌ను అస్టర్ ప్రైమ్ హాస్పిటల్ నిర్వహించింది. ఇందులో భాగంగా ప్రత్యక్ష ఎకోకార్డియాలజీపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత సీనియర్ కార్డియోలజిస్ట్ వి. దయసాగర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేయగా, డాక్టర్ శేషగిరి రావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. అమీర్‌పేటలో అస్టర్ ప్రైమ్ హాస్పటిల్ డైరెక్టర్, అంతర్జాతీయ హృద్రోగ చికిత్స నిపుణుడు, డాక్టర్ సి. రఘు ఆస్పత్రి ప్రాంగంణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇం దులో ప్రముఖ సీనియర్ కార్డియోలాజిస్ట్, డాక్టర్ రాకేశ్ గుప్తా, ఎస్‌కె పార సహర్, డాక్టర్ సమీర్ శ్రీవాస్తవ కీలక ఉపన్యాసకులుగా వ్యవహరించారు. కాగా, 85 మందికి పైగా వైద్యులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

పివి.సింధుకు సిఎం కెసిఆర్ సత్కారం



మన తెలంగాణ/హైదరాబాద్ : ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి.సింధు, కోచ్ పి.గోపిచంద్‌తో కలిసి బుధవారం ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ సింధు, గోపిచంద్‌లను శాలువాతో సత్కరించి, అభినందించారు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలో కొద్దిలో ఓడిపోయినా మంచి ప్రతిభ కనబరిచిందని సింధును సిఎం కొనియాడారు. బెటర్ లక్ నెక్ట్స్ టైమ్, ఆల్ ది బెస్ట్ అని సిఎం అన్నారని సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ప్రపంచకప్‌లో అద్భుత ఆటను కనబరిచి రజత పతకం సాధించిన బ్యాడ్మింటన్ క్వీన్ సింధుపై అభినందనల వర్షం కురుస్తూనే ఉంది. చాలా మంది అభిమానులు, ఇతర ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సింధును అభినందనలతో ముంచెత్తుతున్నారు. అసాధారణ ఆటతో కోట్లాది మంది అభిమానులను కనువిందు చేసిందని వారు ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

లంకకు చావోరేవో



నేడు భారత్‌తో నాలుగో వన్డే

కొలంబో: ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన శ్రీలంక జట్టు కనీసం మిగిలిన రెండు వన్డేల్లో నైనా గెలిచి ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ సారథ్యం వహించనున్నాడు. ఇకపై ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలతో సిరీస్‌ను సొంతం చేసుకున్న టీమిండియా ప్రయోగాలకు పెద్ద పీట ఇవ్వాలని భావిస్తోంది. రిజర్వ్ బెంచ్‌కు పరిమితమైన ఆటగాళ్లను ఈసారి బరిలోకి దించాలనే ఆలోచనలో కెప్టెన్ కోహ్లి ఉన్నాడు. ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు ఇప్పటికే సెంచరీలతో సత్తా చాటారు. వీరిలో ఒకరికి విశ్రాంతి ఇచ్చి యువ ఆటగాళ్లకు ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నాడు. మరోవైపు మహేంద్ర సింగ్ ధోనీకి ఈ మ్యాచ్ అరుదైనది మారనుంది. ఈ మ్యాచ్ ధోనీ కెరీర్‌లో 300వ వన్డేగా నిలువనుంది. దీంతో అందరి దృష్టి అతనిపై నిలిచింది. కాగా, ఈ సిరీస్‌లో ఆడిన రెండు వన్డేల్లో కూడా ధోనీ అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచిన విషయం తెలిసిందే.

రాహుల్‌కు పరీక్ష

మరోవైపు రెండు వన్డేల్లో విఫలమైన స్టార్ ఆటగాడు లోకేష్ రాహుల్‌కు ఈ మ్యాచ్ పరీక్షగా మారింది. టెస్టుల్లో అద్భుతంగా రాణించిన రాహుల్ వన్డేల్లో మాత్రం విఫలమవుతున్నాడు. ఇది అతనికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. జట్టులో స్థానం కోసం రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్న సమయంలో వరుస వైఫల్యాలు అతన్ని కలవరపెడుతున్నాయి. ఈసారి కూడా విఫలమైతే ఇతర ఆటగాళ్లకు చోటు కల్పించడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు రెండు వన్డేల్లో కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరి నిరాశ పరిచిన కేదార్ జాదవ్‌కు నాలుగో వన్డేలో స్థానం లభించడం కష్టంగా మారింది. అతన్ని ఆడించే సాహసం ఈసారి కోహ్లి చేయక పోవచ్చు. అతని బదులు మనీష్ పాండే జట్టులోకి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో యువ ఫాస్ట్ బౌలర్ శార్దుల్ ఠాకూర్ బరిలోకి దిగడం ఖాయం. భువనేశ్వర్‌కు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చే ఆలోచనలో కోహ్లి కనిపిస్తున్నాడు.

గెలిస్తేనే...

మరోవైపు ప్రపంచకప్ బరిలోకి నిలువాలంటే భారత్‌తో జరిగే రెండు వన్డేల్లో తప్పనిసరిగా గెలవాల్సిన ఒత్తిడి శ్రీలంకపై నెలకొంది. ఇప్పటికే మూడు మ్యాచుల్లో ఓటమి పాలైన లంకకు ఇది సంకటంగా మారింది. ఇందులో ఓడితే ప్రపంచ కప్ కోసం అర్హత పోటీలు ఆడాల్సిన దుస్థితి లంకకు నెలకొంటుంది. ఇది నివారించాలంటే భారత్‌పై చివరి రెండు మ్యాచుల్లో గెలవడం ఒక్కటే మార్గం. కాగా, చివరి రెండు వన్డేల్లో గెలిచే స్థితిలో ఉన్నప్పటికి లంకకు ఓటములు తప్పలేదు. ఆత్మవిశ్వాసం లోపించడంతో జట్టు పరాజయాల బాటలో నడుస్తోంది. జట్టును ముందుండి నడిపించే నాయకుడు లేని లోటు జట్టులో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లో మలింగ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. అతని పర్యవేక్షణలోనైన లంక గాడిలో పడుతుందో లేదో చూడాలి.



ధోనీని ఊరిస్తున్న రికార్డులు



కొలంబో: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని రెండు అరుదైన రికార్డులు ఊరిస్తున్నాయి. శ్రీలంకతో గురువారం జరిగే నాలుగో వన్డేలో ధోనీ తన కెరీర్‌లో రెండు రికార్డులను అందుకునే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు కెరీర్‌లో 299 వన్డేలు ఆడిన ధోనీ మరోకటి ఆడితే 300 మ్యాచ్‌ల క్లబ్‌లో చేరుతున్నాడు. భారత్ తరపున సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, మహ్మద్ అజారుద్దీన్, యువరాజ్ సింగ్‌లు మాత్రమే కెరీర్‌లో 300కు పైగా వన్డేలు ఆడారు. ధోనీ కూడా ఈ అరుదైన రికార్డును సాధించేందుకు ఒక అడుగు దూరంలో ఉన్నాడు. ప్రపంచంలోని అత్యుత్తమ వన్డే క్రికెటర్లలో ఒకడిగా ధోనీకి పేరుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన ధోనీ పలు మ్యాచుల్లో భారత్‌కు ఒంటిచేత్తో విజయాలు సాధించి పెట్టాడు. కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా, బ్యాట్స్‌మన్‌గా ధోనీ భారత క్రికెట్‌లో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నాడు. ఎన్నో చారిత్రక రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ఇక మరో అరుదైన రికార్డు కూడా ధోనీ ఊరిస్తోంది. వన్డేల్లో 99 స్టంపౌట్‌లతో ఇటీవలే శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర రికార్డును ధోనీ సమం చేశాడు. మరో స్టంపౌట్ సాధిస్తే వన్డే చరిత్రలో వంద స్టంపౌట్‌లు చేసిన తొలి వికెట్ కీపర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. నాలుగో వన్డేలో ఈ ఫీట్‌ను సాధించాలనే పట్టుదలతో ధోనీ ఉన్నాడు.



బంగ్లాదేశ్ పెను సంచలనం

ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం



ఢాకా: పసికూన బంగ్లాదేశ్ ప్రపంచ టెస్టు క్రికెట్‌లో పెను సంచలనమే నమోదు చేసింది. పటిష్టమైన ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ 20 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని సాధించింది. టెస్టు చరిత్రలో బంగ్లాదేశ్‌కు ఇదే అతి పెద్ద విజయం. మరోసారి అగ్రశ్రేణి ఆస్ట్రేలియా తొలి టెస్టులో అనూహ్య ఓటమిని చవి చూసింది. బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి ఆస్ట్రేలియా 261 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేక అవమానకర రీతిలో పరాజయం పాలైంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1–0 ఆధిక్యాన్ని సాధించింది. సాకిబ్ అల్ హసన్ అద్భుత బౌలింగ్‌తో మరోసారి ఐదు వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్‌కు చారిత్రక విజయం అందించడంలో కీలకపాత్ర పోషించాడు. 109/2 ఓవర్‌నైట్ స్కోరుతో బుధవారం నాలుగో రోజు బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియా ప్రారంభంలో బాగానే ఆడింది. స్టార్ ఆటగాడు డేవిడ్ వార్నర్ తనదైన షాట్లతో బంగ్లాదేశ్ బౌలర్లపై ఎదురు దాడి చేశాడు. కెప్టెన్ స్మిత్ అతనికి అండగా నిలిచాడు. ఇద్దరు బాగా ఆడడంతో ఆస్ట్రేలియా గెలుపు లాంఛనమే అనిపించింది. ఇదే సమయంలో వార్నర్ తన సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. ధాటిగా ఆడిన వార్నర్ 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో సెంచరీని అందుకున్నాడు.

సాకిబ్ మ్యాజిక్...

ఈ దశలో సాకిబ్ అల్ హసన్ అసాధారణ బౌలింగ్‌తో బంగ్లాదేశ్‌ను ఆదుకున్నాడు. చూడ చక్కని బౌలింగ్‌ను కనబరిచిన సాకిబ్ తొలుత ప్రమాదకర ఆటగాడు వార్నర్ (112)ను పెవిలియన్ పంపించాడు. ఆ వెంటనే ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్ (37)ను కూడా సాకిబ్ ఔట్ చేశాడు. మరోవైపు కుదురుగా ఆడుతున్న హాండ్స్‌కొంబ్ (15)ను తైజుల్ ఇస్లాం వెనక్కి పంపాడు. కొద్ది సేపటికే మాక్స్‌వెల్ (14), వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ (4) సాకిబ్ పెవిలియన్ బాట పట్టించాడు. చివర్లో కమిన్స్ 33 (నాటౌట్) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఇన్నింగ్స్‌లో సాకిబ్ ఐదు, తైజుల్ ఇస్లాం రెండు, మెహిది హసన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఒక దశలో 150/2తో పటిష్ట స్థితిలో కనిపించిన ఆస్ట్రేలియా తర్వాత బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 244 పరుగులకే కుప్పకూలింది. కాగా, ఆస్ట్రేలియా టెస్టు చరిత్రలో ఇదే అత్యంత అరుదైన ఓటమిగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవల భారత్, శ్రీలంక చేతుల్లో టెస్టుల్లో ఘోర పరాజయాలు చవి చూసిన ఆస్ట్రేలియా తాజాగా పసికూన బంగ్లాదేశ్ చేతిలోనూ ఓటమి పాలుకావడం జట్టు యాజమాన్యాన్ని కలవర పరుస్తోంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియా 217 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే.

ఆనందంగా ఉంది

బలోపేతమైన ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ సాకిబ్ అల్ హసన్ అన్నాడు. రెండు ఇన్నింగ్స్‌లలో ఐదు వికెట్లు పడగొట్టడం కొత్త అనుభూతిని ఇచ్చిందన్నాడు. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ఇది దోహదం చేస్తుందన్నాడు. స్వల్ప లక్ష్యాన్ని సైతం కాపాడుకొని ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టును ఓడించడం సామన్య విషయం కాదన్నాడు. ఈ గెలుపు తమ జట్టు దిశను కచ్చితంగా మారుస్తుందనే నమ్మకాన్ని సాకిబ్ వ్యక్తం చేశాడు. సమష్టి పోరాటం వల్లే చారిత్రక విజయం సొంతమైందన్నాడు. రానున్న టెస్టులో కూడా ఆస్ట్రేలియాను ఓడిస్తామనే నమ్మకం తమకు ఏర్పడిందన్నాడు. ఇకపై తమను చిన్న జట్టుగా భావించే జట్లు తమ ఆలోచన విధానాన్ని కచ్చితంగా మార్చుకోవడం ఖాయమని సాకిబ్ అభిప్రాయపడ్డాడు.

తన్వీర్ అరుదైన బౌలింగ్ విన్యాసం



బ్రిడ్జ్‌టౌన్: ట్వంటీ–20 స్పెషలిస్ట్ బౌలర్‌గా పేరొందిన పాకిస్థాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ సోహైల్ తన్వీర్ మరో అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సిపిఎల్) టోర్నమెంట్‌లో గయానా అమోజాన్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న తన్వీర్ మరోసారి అరుదైన బౌలింగ్ ఫీట్‌ను సాధించాడు. బార్బడోస్ ట్రైడెంట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తన్వీర్ 4 ఓవర్లలో కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లను పడగొట్టి అరుదైన గణంకాలను నమోదు చేశాడు. ఇందులో ఒక ఓవర్ మెయిడిన్ వేయగా, మరో ఓవర్‌లో ఒక్క పరుగు మాత్రమే ఇచ్చాడు. అతని ధాటికి బార్బడోస్ జట్టు 13.4 ఓవర్లలో 59 పరుగులకే కుప్పకూలింది. ముందుగా బ్యాటింగ్ చేసిన వారియర్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బార్బడోస్ తన్వీర్ ధాటికి తట్టుకోలేక స్వల్ప స్కోరుకే కుప్పకూలి 99 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తన్వీర్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా, తన్వీర్ గతంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో 14 పరుగులకే ఆరు వికెట్లు పడగొట్టాడు. 2008లో రాజస్థాన్ తరపున బరిలోకి దిగిన తన్వీర్ చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు.

ఆత్మరక్షణలో రూట్



లండన్: వెస్టిండీస్ చేతిలో ఊహించని ఓటమి ఎదురు కావడంతో ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ ఆత్మరక్షణలో పడ్డాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంక రెండు వికెట్లు మిగిలివుండగానే ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయడంతో జోయ్ ఇరకాటంలో పెట్టాడు. వోక్స్, బ్రాడ్‌ల వంటి ఆల్‌రౌండర్లు బ్యాటింగ్ చేస్తున్నా రూట్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకొంది. వెస్టిండీస్ ముందు కనీసం 350 పరుగుల లక్ష్యాన్ని కూడా ఉంచకుండా ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే రూట్‌తో సహా వెస్టిండీస్ కూడా తాము లక్ష్యాన్ని ఛేదిస్తామని ఊహించి ఉండదు. అయితే షాయ్ హోప్ చారిత్రక సెంచరీతో వెస్టిండీస్‌కు అద్భుత విజయాన్ని సాధించి పెట్టాడు. చాలా ఏళ్ల తర్వాత వెస్టిండీస్ ఓ అద్భుత విజయాన్ని తన పేరిట లిఖించుకుంది. ప్రపంచ క్రికెట్‌లో ఈ విజయం ఓ అద్భుతమని చాలా మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, విండీస్ విజయం ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్‌కు కొత్త సమస్య తెచ్చి పెట్టిందనే చెప్పాలి. ఊహించని రీతిలో విండీస్ లక్ష్యాన్ని అందుకోవడంతో రూట్ వ్యూహం బెడిసి కొట్టింది. అతి విశ్వాసంతో రూట్ తీసుకున్న నిర్ణయమే జట్టు పరాజయానికి కారణమని పలువురు మాజీ క్రికెటర్లు గళం విప్పడం ప్రారంభించారు.

బంగ్లాపై ప్రశంసల వర్షం



ఢాకా: ఆస్ట్రేలియాపై అద్భుత విజయం సాధించిన బంగ్లాదేశ్‌పై ప్రపంచ వ్యాప్తంగా అభినందనల వర్షం కురుస్తోంది. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ క్రికెటర్లు బంగ్లాదేశ్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. భారత మాజీ కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు ట్విట్టర్‌లో బంగ్లాదేశ్‌కు శుభాకాంక్షలు తెలిరు. అంతేగాక, భారత మాజీ ఆటగాళ్లు వీరేంద్ర సెహ్వాగ్, ఆకాష్ చోప్రా, సందీప్ పాటిల్, మదన్‌లాల్, అజయ్ జడే జా తదితరులు కూడా బంగ్లాదేశ్ జట్టును అభినందించారు. ఈ విజయం చాలా ప్రత్యేకమైందని వారు పేర్కొన్నారు. ఇక, వెస్టిండీస్ దిగ్గజాలు రిచర్డ్, క్లైవ్ లాయిడ్, బ్రియాన్ లారా, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు స్టీవ్‌వా, మాథ్యూ హెడన్, షేన్‌వార్న్ తదితరులు కూడా బంగ్లాదేశ్ విజయాన్ని చారిత్రాత్మకమైన గెలుపుగా అభివర్ణించారు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్లు నాసర్ హుస్సేన్, మైఖేల్ వాన్‌లు కూడా బంగ్లాపై ప్రశంసల వర్షం కురిపించారు. పాకిస్థాన్ స్టార్లు వసీం అక్రం, ఇమ్రాన్ ఖాన్, రమీజ్‌రాజా తదితరులు కూడా బంగ్లా విజయాన్ని అరుదైన ఘట్టంగా పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితో బంగ్లాదేశ్ మ రిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

వారే అర్హులు: స్మిత్

కాగా, తమపై చారిత్రక విజయాన్ని సా ధించిన బంగ్లాదేశ్‌ను ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అభినందించాడు. అసాధారణ ఆటను కనబరిచిన బంగ్లాదేశ్ ఈ మ్యాచ్‌లో విజయానికి అర్హురాలని పేర్కొన్నాడు. తొలి రోజు నుంచే బంగ్లాదేశ్ అద్భుతంగా ఆడిందని ప్రశంసించాడు. ఒత్తిడిలోనూ నిబ్బరంగా ఆడి విజయాన్ని అందుకున్నారని చెప్పాడు. గెలుపుకు వారే అర్హులు అని స్పష్టం చేశాడు. కాగా, ఈ మ్యాచ్‌లో ఓటమి ఎంతో బాధించిందన్నాడు. సునాయాసంగా గెలుస్తామని భావించిన మ్యాచ్‌లో ఓటమి పాలుకావడాన్ని ఇప్పటికీ నమ్మలేక పోతున్నానని తెలిపాడు.

హర్యానాకు ముంబా షాక్



ముంబయి: ప్రొ కబడ్డీ సీజన్–5లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో యూ ముంబా ఘన విజయం సాధించింది. ఇక్కడి ఎస్‌విపి స్టేడియంలో జరిగిన పోరులో ముంబా 38–32 తేడాతో హర్యానా స్టీలర్స్‌ను చిత్తు చేసింది. ఈ సీజన్‌లో ముంబాకు ఇది నాలుగో విజయం. ప్రారంభం నుంచే ముంబా చెలరేగి ఆడింది. ముంబా ఆటగాళ్లు అద్భుత ప్రతిభను కనబరుస్తూ ప్రత్యర్థి ఆటగాళ్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. కానీ, హర్యానా ఆటగాళ్లు కూడా ధైర్యాన్ని వీడలేదు. పట్టువదలకుండా పోరాడుతూ ముంబాకు గట్టి పోటీనే ఇచ్చారు. అయితే కీలక సమయంలో ఒత్తిడికి గురి కావడంతో ఓటమి తప్పలేదు. ముంబా జట్టులో అనూప్ కుమార్, కుల్దీప్ సింగ్, శ్రీకాంత్‌లు అద్భుతంగా ఆడారు. ప్రారంభం నుంచే దూకుడును కనబరిచిన అనూప్ 8 పాయింట్లతో టాపర్‌గా నిలిచాడు. కుల్దీప్ ఏడు, శ్రీకాంత్ ఆరు పాయింట్లు సాధించి తమవంతు పాత్ర పోషించారు. మరోవైపు కష్లింగ్ అకాడే కూడా నాలుగు పాయింట్లతో రాణించాడు. ఇక, హర్యానా జట్టులో వికాస్ చెలరేగి ఆడాడు. తన మార్క్ ఆటతో ముంబాను ఉక్కిరిబిక్కిరి చేశాడు. అతన్ని కట్టడి చేయడం ఒక దశలో ముంబాకు కష్టంగా కనిపించింది. అద్భుతంగా ఆడిన వికాస్ ఏకంగా 9 పాయింట్లను సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతనే టాపర్‌గా నిలిచాడు. వజీర్ సింగ్ కూడా ఏడు పాయింట్లతో సత్తాచాటాడు. కానీ మిగిలిన ఆటగాళ్లు విఫలం కావడంతో హర్యానుకు ఓటమి తప్పలేదు. చివరి దశలో పోరు కాస్త రసవత్తరంగా మారినా ముంబా పట్టు సడలించకుండా ముందుకు సాగింది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ అద్భుత విజయాన్ని అందుకుంది.




కొత్త ఒరవడికి శ్రీకారం!

మన తెలంగాణ/ క్రీడా విభాగం

ప్రపంచ టెస్టు క్రికెట్ చరిత్రలోనే రెండు అరుదైన విజయాలు నమోదయ్యాయి. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్, ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో వెస్టిండీస్ జట్లు ఈ అరుదైన విజయాలు అందుకున్నాయి. పటిష్టమైన ఆస్ట్రేలియాతో జరిగిన మొదటి టెస్టులో బంగ్లాదేశ్ 20 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని సాధించింది. బంగ్లాదేశ్ టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఇదే అత్యుత్తమ విజయం కావడం గమనార్హం. ఇటీవల కాలంలో ప్రపంచ క్రికెట్‌లో నమోదైన అతి పెద్ద సంచలన విజయంగా దీన్ని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ జట్లలో ఒకటిగా పరిగణించే ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ విజయం సాధించడం అతి అరుదైన విషయంగా వారు అభివర్ణిస్తున్నారు. 261 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం కాపాడుకుని ఆస్ట్రేలియాను ఓడించడం ఇతర పెద్ద జట్లకే చాలా కష్టమని వారంటున్నారు. అయితే బంగ్లాదేశ్ అసాధాణ పోరాట పటిమతో ఆస్ట్రేలియాను ఓడించి పెను తుఫాను సృష్టించిందని వారు పేర్కొంటున్నారు. ఈ విజయం బంగ్లాదేశ్‌ను అగ్రశ్రేణి జట్ల సరసన నిలుపుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. కొంతకాలంగా అసాధారణ ఆటతో ప్రకంపనలు సృష్టిస్తున్న బంగ్లా తాజాగా సాధించిన విజయం జట్టు దిశను మార్చడం ఖాయమని వారంటున్నారు. హేమాహేమీలతో కూడిన ఆస్ట్రేలియాపై విజయం సాధించడం మాములు విషయం కాదనే చెప్పాలి. అంతేగాక వార్నర్ అద్భుత సెంచరీతో చెలరేగిన నేపథ్యంలో వారి విజయాన్ని అడ్డుకోవడం దాదాపు అసాధ్యమేనని చెప్పవచ్చు. కానీ, ఒత్తిడిలోనూ బంగ్లాదేశ్ బౌలర్లు అసాధారణ బౌలింగ్‌తో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చడం అరుదైన అంశంగా పేర్కొనవచ్చు. సాకిబ్ అల్ హసన్ అద్భుత ఆల్‌రౌండ్ ప్రతిభతో బంగ్లాకు చారిత్రక విజయాన్ని సాధించి పెట్టాడు. ఇప్పటికే ప్రపంచంలోనే నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా ఉన్న సాకిబ్ రూపంలో బంగ్లాకు అరుదైన అస్త్రం లభించిందనే చెప్పాలి. భవిష్యత్తులో అతను మరింత మెరుగైన ప్రదర్శన కనబరిస్తే బంగ్లాకు ఇటువంటి సంచలన విజయాలు కష్టమేమి కాదు.

విండీస్‌కు బూస్ట్...

ఇక, ఇంగ్లాండ్‌పై వెస్టిండీస్ విజయాన్ని కూడా తక్కువ చేసి చూడలేం. ఇటీవల కాలంలో వరుస ఓటములతో సతమతమవుతున్న వెస్టిండీస్‌కు ఈ విజయం కొత్త ఊపు నిచ్చిందనే చెప్పాలి. షాయ్ హోప్, బ్రాత్‌వైట్ చారిత్రక బ్యాటింగ్‌తో విండీస్‌కు సంచలన విజయం సాధించి పెట్టారు. షాయ్ హోప్ ఈ టెస్టులో ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. ఇంగ్లాండ్‌ను వారి సొంత గడ్డపై ఓడించడం ఏ జట్టుకైన చాలా కష్టం. అయితే వెస్టిండీస్ ఈ అసాధ్యాన్ని సాధ్యం చేసి చూపించింది. 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఇంగ్లాండ్ గడ్డపై ఓ టెస్టులో విజయం సాధించింది. ఇటీవల వరుస ఓటములతో కుదేలైన విండీస్‌కు ఈ విజయం కొత్త దిశను చూపడం ఖాయం. ఒకప్పుడూ ప్రపంచ క్రికెట్‌ను ఏలిన విండీస్ కొంత కాలంగా పేలవమైన ప్రదర్శనతో చిన్న జట్టుగా మారి పోయింది. గెలుపు విషయం అటుంచి కనీసం డ్రాలతో గట్టెక్కడం కూడా వారికి కష్టమై పోయింది. ఇటీవలే భారత్‌తో సొంతగడ్డపై జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లలో ఘోర పరాజయం చవిచూసింది. అంతేగాక, పటిష్టమైన ఛాంపియన్స్ ట్రోఫీకి అర్హత కూడా సాధించలేక పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఇంగ్లాండ్‌పై స్ఫూర్తి దాయక విజయం సాధించడం విండీస్‌కు కొత్త ఊపునివ్వడం ఖాయం.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.